తెలుగు కళా సమితి

# తెలుగు జ్యోతి

2024 సంక్రాంతి సంచిక

40th Anniversary
ESTD : 1983




భారత రత్న



విరిసిన తెలుగు పద్మాలు!



రధం ముగ్గుట - AI ఊహా లో!

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501(c) Non Profit Org, Tax ID: 22-2534166, www.tfasnj.org

New Jersey, USA

# HAPPY 2024 new year

సభ్యులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

*from*

**TFAS Executive Committee**


తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org. Tax ID : 22-2534166, www.tfasnj.org
Telugu Fine Arts Society
తెలుగు కళా సమితి
సంక్రాంతి సంబరాలు
Sankranthi Sambaralu
On Sunday, January 21, 2024 from 10:00 am to 4:00 pm EST
At John Adams Middle School
1081 New Dover Rd, Edison, NJ 08820
COMPETITIONS
• Muggulu
• Fancy Dress
• Posters & Collage
• Telugu Pindi Vantalu
• Telugu Quiz
• Telugu Speaking
• Telugu Padya Pathanam
Competition Fee: $10
MALLAKHAMB
పెళ్లిసందడి
వివాహము చేసుకోతలచినవారి పరిచయవేదిక
KITE COMPETITION
TFAS - Vedic Vigyan Utsav 2024
Educational Workshops
Haasya yoga
జానపద నృత్యాలు
బుర్రకథ
యక్షగానం
Event Register Here:
Free Lunch
Model UN Club
Free Event
Arts&Crafts by i4Farmers
Competitions Register Here:
Registration last date : January 18, 2024
Event Registration: http://tinyurl.com/tfas2024sankranthiregistration
Competitions Registrations: http://tinyurl.com/tfas2024sankranthicompetitions
DIGITALAYA • +91 9246 578 473
BHOG
NEW YORK LIFE
UBLOOD
ITSUS
Prizes sponsored by
Smt. Radha Kasinadhuni in memory of
Late Sri Sambasivarao Kasinadhuni
& Sri Sai Suryadevara, Global IT Solutions, NYC
TFAS Board of Trustees 2022-24
Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Jyothi Kamarasu: (609) 578 8606
Bindu Yalamanchili: (908) 240 3167
Venkata Satya Tata: (973) 985 3409
Anil Veerisetty: (571) 218 8562
Ravi Annadanam: (917) 355 5503
Sudha Devulapalli: (732) 331 9313
Naga Mahendar Velishala: (732) 429 6025



తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org
New Jersey, USA
Happy
Republic
Day
26
సభ్యులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
గణతంత్ర దినోత్సవ
శుభాకాంక్షలు
From
TFAS Executive Committee

**Board of Trustees**
**2022-2024**

**President**
**Madhu Rachakulla**
*president@tfas.net*

**Vice President**
**Bindu Yalamanchili**
*vicepresident@tfas.net*

**Membership Services**
**Jyothi Kamarasu**
*membership@tfas.net*

**Secretary**
**Ravi Annadanam**
*secretary@tfas.net*

**Treasurer**
**Srinivas Cheruvu**
*treasurer@tfas.net*

**Community Services**
**Venkata Satya Prabhakara Murthy Tata**

**IT Services**
**Naga Mahendar Velishala**
*it@tfas.net*

**Annual Events**
**Sudha Devulapalli**
*events@tfas.net*

**Youth Services**
**Anil Veerisetty**
*youth@tfas.net*

**Advisors**
Radha Kasinadhuni
Dr. Satyaveni Rao
Dr. Raja Rao

**Telugu Jyothi**
**Vignan Kumar Utukuri**
Editor


# సంపాదకీయం

దక్షిణ భారత దేశం నుంచి ప్రధానిగా ఎన్నికైన మొదటి వ్యక్తి (పాములపర్తి వేంకట) నరసింహా రావు గారు. ఈనాటికైనా ఆయనకి 'భారత రత్న' పురస్కారం లభించడం ఎంతో ఆనంద దాయకం. ఆయనకి ఇప్పటికి సరియైన గుర్తింపు వచ్చింది అని సంతృప్తి పడచ్చు.

ఖలిస్థాన్ ఉద్యమాన్ని అణచడం, ఇజ్రాయిల్ తో సంబంధాలు పెంచడం, కాష్మీర్లో విప్లవవాదుల ఆటలు కట్టించడం, ఇలా ప్రధానిగా ఆయన దేశానికి చేసిన సేవలు అనేకం. వాటన్నిటికన్నా 1991 లో ఆయన చేసిన ఆర్థిక సరళీకరణ (Economic Liberalization) అందరికీ ఎంతో గుర్తుండే సంస్కరణ. ఆయన మన్ మోహన్ సింగ్ గారితో కలిసి చేసిన Economic Liberalization వలన దేశం కొత్త దారిలో నడిచింది, కొత్త ప్రగతి సాధించింది.

దాని ద్వారా దేశం ఎంతో ముందుకు వచ్చింది. నెహ్రూ గారూ, తదితర కాంగ్రెస్ నాయకులు అనుసరించిన ఆత్మ నిర్భరత (Indegenoue Self Reliance) విధానం గొప్పదా, నరసింహా రావు గారు చేసిన సరళీకరణ గొప్పదా అన్న వివాదం ఎప్పటికీ తీరకపోవచ్చు. కానీ ఆనాటి (1991) పరిస్థితులలో సిద్ధాంతాలు పక్కకి పెట్టి ఆ సరళీకరణ చేయకపోయినట్లైతే దేశానికి తీరని నష్టం వాటిల్లేది అన్నది మాత్రం ఖాయం. 1991 కి ముందు విదేశీ మారక ద్రవ్యం దొరకాలంటే దేశంలో పడిన కష్టాలు ఇప్పుడు కలా నిజమా అనిపిస్తాయి.

మనం ఈ నాడు ఛాతీ మీద చేయి వేసుకుని 'మేరా భారత్ మహాన్' అని నిబ్బరంగా అనగలుగుతున్నామంటే, దాని వెనుక నరసింహారావు గారి నిర్ణయాలు, విధానాలు ఎన్నో ఉన్నాయి.

'భారత్ రత్న నరసింహా రావు మహాన్హై'.

ఈ సంక్రాంతి పోటీలకి దాదాపు నూటపాతిక రచనలు పంపిన రచయితలందరికీ ధన్యవాదాలు.

అప్పరాజు నాగజ్యోతి గారు 'అమ్మోరు తల్లి' లో మూ మూర్ఖ నమ్మకాలని మూర్ఖనమ్మకం తోనే పరిష్కరించచ్చు అన్నారు

లక్ష్మి గాయత్రి గారు 'అన్నీ నీవనుచు' లో గాయకి హృదయం గురించి చక్కగా రాశారు

మహీధర శేషారత్నం గారు 'శాంతి కామన' లో ఉక్రైన్, గాజా పోరాటాలూ ఎప్పటికి ఆగేనూ అని వాపోయారు.

రాంభక్త పద్మావతి గారు 'సారాంశం' లో జీవిత పోరాటం గురించి చక్కని కవిత రాశారు

చిన్నారి సాహితి గాజా లో జరుగుతున్న 'యుద్ధాం' తనని ఎలా తల్లడించేసిందో రాసింది

చిన్నారి ప్రణతి రాసిన 'పాట' ఒక రంగుల నీటి బుడగ.

ఎప్పటి లాగే ఈ సంవత్సరం కూడా వచ్చిన కవితలు పరిశీలించడం లో మాకు సహకరించిన డాక్టర్ వైదేహి గారికి హృదయపూర్వక ధ్గన్యవాదాలు.

ఈ సంచికకి చంద్రయాన్-3 మీద ముఖ చిత్రం వేసిన అక్షర ప్రతాప్ కి మా హృదయ పూర్వక అభినందనలు.

తను చేసిన రచనకి పాఠకులు ఎలా స్పందిస్తున్నారూ అన్న తహతహ ప్రతి రచయితకీ ఉంటుంది. అలాగే తాము ప్రచురించిన రచన పాఠకులకి నచ్చిందా లేదా తెలుసుకోవాలని సంపాదకులకీ ఉంటుంది. ఈ రెండు ప్రయోజనాల కోసం ఈ సంక్రాంతి సంచిక నుండీ ప్రయోగాత్మకంగా 'పాఠకుల అభిప్రాయ సేకరణ' మొదలు పెట్టాము. ప్రచురించిన ప్రతి శీర్షిక కిందా ఈ క్రింది విధంగా ఒక లంకె ఉంటుంది.

**ఇక్కడ click చేసి సంపాదకీయం పై మీ అభిప్రాయం చెప్పండి**

పాఠకులెవరైనా ఆ లంకె పై నొక్కి తమ అభిప్రాయం తెలియజేయచ్చు. ఆ అభిప్రాయం వెంటనే రచయితకీ మాకూ వస్తుంది. అవన్నీతరువాయి సంచికలో ప్రచురిస్తాము.

వచ్చే సంచిక వరకూ శెలవు.

**సంపాదక వర్గం**

ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (Editor), ఉప్పల అనంత సుధాకర్, తాడేపల్లి కుమార్,

తిప్పాభొట్ల రవిశంకర్, తోడుపునూరి శ్రీనివాస్, అపర్ణ ఏలూరుపాటి

**BOT Representatives**

తాతా సత్య

# విషయ సూచిక


సంపాదకీయం 5

శాంతి కామన .. మహీధర శేషారత్నం 7

సింహరాజు .. చిట్టెల లలిత్ శ్రీవిష్ణు శరవణ్ 8

అమ్మోరు తల్లి .. అప్పరాజు నాగ జ్యోతి 9

సారాంశం .. రాంభక్త పద్మావతి 13

పాట .. చి. జి. ప్రణతి 13

అన్నీ నీవనుచు .. లక్ష్మి గాయత్రి 14

గురు స్మరణ .. మొక్కరాల కామేశ్వరి 14

ఆమె అంటే అత్యద్భుతం .. నామని సుజనాదేవి 20

స్వాభిమానం .. కుంతి 21

కళ్యాణమే వైభోగము .. బద్రి నర్సన్ 29

చీకటి ... గంటి రమాదేవి 33

వృద్ధ మరీచిక .. మెట్టు శ్రీనివాసరెడ్డి 42

ఒక శిశిరపు ఉదయాన! అక్కడ!!.. అలజంగి మురళీధర రావు 42

సాపాటు రుచికరం శత్రు ... సోమిశెట్టి వేణుగోపాల్ 43

బడ్జెట్ పద్మనాభం .. తటవర్తి నాగేశ్వరి 49

యుద్ధం .. చి॥ జి సాహితి 54

తెలుగుజాతి గొప్పదనం .. చొక్కరతాతారావు 57

తరతరాల సంపద .. ములుగు లక్ష్మి మైథిలి 57


Opinions expressed in this volume are those of the authors and not of TFAS.

# శాంతి కామన

మహీధర శేషారత్నం

**(తెలుగు జ్యోతి కవితల  పోటీలో ప్రధమ బహుమతి గ్రహీత)**

సీ. మత్తున మునుగుచు మత్సరమున తూలి
యహమిక నల్లాడె యవని యంత

మనసును మథియించి మర్మాలు తెలిపిన
ఋషులను మరచుట రిప్రమౌను

ఉన్మత్త లోకాన ఉచితజ్ఞతే పోయి
మానవత్వంబేమొ మంటగలిసె

శాంతియె ప్రమయగ సమత సమసిపోవ
అవని కోల్పోయెగా అమ్మతనము

తే.గీ. ప్రమను గోల్పోయి జనులంత భ్రమను నిలిచి
ఉక్రెయినుచివ్వ నటమటనుడికి పోవ
గాజ యిజ్రాయెలులనిని గాసిపోవ
మమత మరచిన మనుజుల మనుగడేది?

సీ. ఉత్పాతములు భువినుప్పతిల్లెనుగదా
ధాత్రియే విధ్వంస చిత్రమాయె

కమ్మని మృత్తికే కమురు వాసన తోడ
గుండెలకమ్ముకు కొదమ కొనగ

కాలము గడిచినా గాయాలు మానవు
మరణించిన మనిషి మరలి రాడు

శమదమములు నేర్పిశాంతిన్ ప్రసాదింప
హేమంతమా రమ్ము హేలగాను!

తే.గీ. పుణ్య సంక్రాంతి కాలాన పౌష్యలక్ష్మి
మనుజుల యెడద నింపుమా మంచితనము
అవని యంతయునాహ్లాదమలుము కొనగ
వేగ రావమ్మ, తేవమ్మ వెలుగు నీవె!

**ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి**

**సభ్యులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.**


మహారాజ పోషకులు శ్రీమతి కొల్లూరి గిరిజ , శ్రీ కొల్లూరి రామ్  గార్లు



## ముఖ చిత్ర కారుడు—చి. అక్షర్

ఈ సంచికకి చంద్రయాన్ - 3 మీద ముఖ చిత్రం వేసింది ఎనిమిది సంవత్సరాల వయస్సు గల అక్షర్. బొమ్మలు గీయడం, వర్ణ చిత్రాలు వేయడం ఇతనికి సరదా. మూడేళ్ళ ప్రాయం నుండీ చిత్రలేఖనం చేస్తున్నాడు. మొదట ఆర్టిస్ట్ అయిన తన తల్లి దగ్గరే డ్రాయింగ్ నేర్చుకున్నాడు. ప్రస్తుతం ఇంకా బాగా రాణించడం కోసం ఢిల్లీ కి చెందిన Art Teacher Sonia Dutt గారి వద్ద చిత్ర లేఖానాన్ని అభ్యసిస్తున్నాడు. నాన్న గారు శ్రీకాంత్, అమ్మగారు ప్రియాంక, చెల్లెలు ఆకాంక్ష తో East Windsor, NJ లో నివాసం. చిరుత ప్రాయంలోనే ఇంతటి నైపుణ్యం గల ఈ చిరంజీవి భావిలో గొప్ప చిత్రకారుడవ్వాలని మా ఆశీస్సు.

ఇక్కడ click చేసి ముఖచిత్రం పై మీ అభిప్రాయం చెప్పండి



## బాల రచయితలు

### చి. జి సాహితి—ఇంటర్మీడియట్



చిన్నప్పటి నుంచి కథలంటే చాలా ఇష్టం. అమ్మానాన్నకు చెరోపక్కా పడుకొని చిన్నప్పుడు అన్నయ్య నేనూ బోలెడు కథలు వినేవాళ్ళం. చెప్పుకునేవాళ్ళం. అప్పటికప్పుడు కొన్ని సందర్భాలను సృష్టించి నాన్న కథలు చెప్తుతూ ఉంటే చాలా ఆనందంగా ఉండేది. తరువాత మమ్మల్ని అలా కథలు అల్లేయమని ప్రోత్సహించేవారు. వేసవిలో పత్రికలు నిర్వహించే వివిధ శీర్షికలకు చిన్ని చిన్ని రచనలు పంపేవాళ్ళం. ఒక వర్షం వేళ మా ఇంటి పక్కనే నీటిలో మునిగిపోతున్న ఐదు కుక్క పిల్లలను సురక్షితంగా ఒకచోటకు చేర్చి, ఆ సంఘటనని "ఐదు కుక్కపిల్లల కథ" అని రాస్తే ప్రజాశక్తి "చిన్నారి"లో ప్రచురించారు. ఇంకో 4 కథలు బాలల శీర్షికల్లో వచ్చాయి. కథలు, చదవటం, రాయటం ఇష్టం. తెలుగు జ్యోతి వారు నా కథకు బహుమతి ఇచ్చినందుకు చాలా సంతోషం. నిర్వాహకులకు ధన్యవాదాలు. ప్రస్తుతం నేను విజయవాడలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నాను.

### చి. జె ప్రణతి

6 వ తరగతి

St. ఫిలోమినా హై స్కూలు సరదాలు: కథా పఠనం, పద్య రచన.



## సింహరాజు

**చిట్టేల లలిత్ శ్రీవిష్ణు శరవణ్ (ఆరవ తరగతి)**

ఒక అడవిలో ఒక పెద్ద సింహం రాజుగా ఉండేది. అది అన్ని జంతువులను హింసించేది. ఆ సింహంఅంటేనే అన్ని జంతువులకి చాలాకోపం వచ్చేది. అంతకుమించి భయం వేసేది. అన్ని జంతువులు ఆ సింహంపై కక్ష కట్టాయి. ఎలాగైనా ఆ సింహాన్ని అడవినుంచి పంపించేయాలని పన్నాగం పన్నేందుకు పంచాయతీ పెట్టాయి. ఒక ఉపాయం ఆలోచించాయి.

అవన్నీకలిసి ఒక విచిత్ర భయంకర వికారజంతువు ఆకారంలో వేషం వేసుకుని సింహం దగ్గరకు వచ్చి భయపెట్టాయి. ఆ పెద్ద ఆకారాన్ని చూడగానే అదేదో కొత్త రాక్షసి అనుకొని ఆ సింహంకి వణుకుపుట్టి, 'ఇక రాజుగా ఉండను. ఈ అడవిలోనే ఉండను బాబోయ్..' అని పరుగెత్తి ఆ అడవిని విడిచి వెళ్ళిపోయింది. అప్పటి నుండి ఆ అడవిలోని జంతువులు సంతోషంగా నివసించ సాగాయి.

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# అమ్మోరుతల్లి

అప్పరాజు నాగ జ్యోతి
**(తెలుగు జ్యోతి కథల పోటీలో ప్రధమ బహుమతి గ్రహీత)**

సోఫాలో కూర్చుని ఓ పేపు వార్తాపత్రికని చదువుకుంటూనే మరోపేపు ఇల్లు ఊడుస్తున్న మా పనిమనిషి మల్లికని ఒక కంట గమనిస్తున్నాను. ఎప్పుడూ గలగలా మాట్లాడుతూ హుషారుగా వుండే మల్లిక ఈ పేళ ఏదో కోల్పోయినట్టుగా విచారంగా వున్నట్టనిపించింది.

పనంతా అయిపోయాక నా దగ్గరకొచ్చి ' పనైపోయిందమ్మ, ఇంగ ఇంటికెల్త ' అన్న మల్లికతో ' ఒక్కనిమిషం ఆగపే మల్లీ, ఇదిగో ఇవి నీ కొడుక్కివ్వు ' అంటూ కొన్ని జిలేబీలని గబగబా ఒక కవర్లో పేసి దాని చేతికిస్తూ 'అన్నట్టు మల్లీ ఇందాకటినుండీ చూస్తున్నాను. దేనికో చాలా బాధపడుతున్నట్టున్నావు. ఏమైందే ' అని నేను అడగడం ఆలస్యం బొటబొటా కన్నీళ్ళు దాని బుగ్గలపైనుండీ క్రిందకి జారాయి.

“ అయ్యో, అదేం పని మల్లీ . ముందు ఆ కళ్ళు తుడుచుకో. అసలే ఉట్టి మనిషివి కూడా కావు. ఇంతకీ నీకొచ్చిన కష్టం ఏమిటే ? “ అని అడిగాను.

“ఏం సెప్పేదమ్మా, నా పేనానికి ఈ మారు పెద్ద కట్టమే వొచ్చె. అంతా నా తలరాత. మొదటికాన్పుకి మాదిరే మా అత్త ఈతూరీ అదే లొల్లి షురు సేసిందమ్మా.నా కడుపుల పెరుగుతున్నది ఆడబొట్టి అయితే దాన్ని తీయించేస్తాదట. నా అదురుట్టంకొద్దీ తొలిసూలు మగబొట్టి కాబట్టి ఆ బిడ్డ బతికి బట్ట కట్టె. ఈ తూరి ఆడబొట్టయితే ఏమవుతాదోనని ఒకటే గుబులవుతాందమ్మా ' అంటూనే గొల్లుమంది మల్లిక.

' నువ్వనుకున్నట్టుగా ఏమీ జరగదులే మల్లీ. నీ కడుపులో బిడ్డకు ఏ ప్రమాదమూ వాటిల్లదు. నువ్వనవసరంగా భయపడకు ' అన్నాను ఓదార్పుగా .

' మా అత్త ఎంత మొండిదో మీకు తెల్వదామ్మా? నా దొడ్డ యారాలికి రొండు కాన్పులూ మగబొట్టిలే కాబట్టి ఏ బుగులూ లేకపాయే ! కానీ చిన్న యారాలి కడుపులున్నది ఆడబొట్టని ఎరికవంగనే కడుపు తీసేయమని మా అత్త డాక్టరమ్మతోటి సెబితే, గట్ల చేస్తే తల్లి పేనానికి ముప్పని సెప్పి డాక్టరమ్మ ఒప్పుకోకపాయె ! గప్పుడు మా అత్త నాటుమందు తెచ్చి యారాలి నోట్ల కుక్కె. దాంతోటి కడుపుల నానా ఆగమై నాలుగ్గంటలు నరకయాతనపడి సివరకామె సచ్చిపాయె. గా తర్వాత రొండుసెలలకే కొడుక్కి మా అత్త మారు మనువు సేసె . నాకు గినా గట్లనే అయితే గా వచ్చే సవత్తల్లి సేతిల నా బిడ్డ ఎన్ని కట్టాలు పడాల్నో, ఏమో ' అన్న మల్లిక మాటలకి నాకు చాలా బాధేసింది.

కడుపులో వున్న బిడ్డ కడుపులోనే పోతే కలిగే పుత్రశోకమే కాకుండా, బ్రతికి బట్ట కట్టిన తొలిచూలు బిడ్డకి ముందు ముందు ఎటువంటి కష్టాలొస్తాయోనని తల్లడిల్లుతున్న ఆ తల్లికి ఏ విధంగా ధైర్యం చెప్పాలో అర్థం కాలేదు.

'నువ్విలా బెంగ పడుతుంటే కడుపులో బిడ్డ ఆరోగ్యం దెబ్బతింటుంది మల్లీ. నేను ఆ డాక్టరమ్మతో మాట్లాడి మీ అత్తకి బుద్ధి చెప్పమంటాలే. నువ్వు ధైర్యంగా వుండు. అన్నింటికీ ఆ అమ్మోరు తల్లే అండ' అని చెప్పి పంపించాను.

దాన్ని ఊరడించేందుకలా చెప్పానేగానీ నిజానికి మల్లి అత్త ఎంత మూర్ఖురాలో నాకు బాగా తెలుసు. డాక్టర్ చేత చెప్పించినా కూడా ఆమె వింటుందన్న నమ్మకం నాకైతే ఏ కోశానా లేదు. అలాగని మానవప్రయత్నం మానలేముగా! అందుకే ఆ మరుసటి రోజు పెద్దాసుపత్రికి పెళ్ళి డాక్టర్ ని కలిసి విషయమంతా వివరించాను. 'మేడం, మల్లి అత్త సూరమ్మ గురించేగా మీరు చెబుతున్నది! అబ్బో, ఆవిడ మహా మొండి మనిషండీ బాబూ. తన మాటే తనది తప్ప మనం చెప్పేది చెవికెక్కించుకోదు. రెండవ కోడలి విషయంలో అంత అనర్థం జరిగినా ఆవిడకి చీమ కుట్టినంతైనా బాధ లేదు, ఆ మనిషిలో పిసరంత మార్పు లేదు. ఆవిడ కొడుకులూ

అంతే. తల్లి నోట్లోంచి అలాగే ఊడిపడినట్టుంటారు. తల్లిపై ఈగ వాలనివ్వరు. అటువంటి ఆదిమమానవుల బుర్రలు మార్చడం అసాధ్యమండీ. అయినా మీరింతలా చెబుతున్నారు కాబట్టి నా వంతు ప్రయత్నం నేను చేస్తానులెండి. ' అంది డాక్టర్ ప్రియం వద. ఆవిడకి కృతజ్ఞతలు చెప్పుకుని బయటకొస్తుండగా సిస్టర్ నివేదిత కనిపించి పలకరించడంతో ఆమెతోనూ విషయమంతా చెప్పాక ఆమె ఇచ్చిన భరోసాతో నిశ్చింతగా ఇంటికి వచ్చాను.

***

మరుసటిరోజు సాయంత్రం పనిలోకొచ్చిన మల్లిక మొహం మ్లానమై ఉండడాన్ని గమనించి ఏమయిందంటూ అడగ్గానే ఆ వేళ ఉదయం తను ఆస్పత్రికి వెళ్ళినపుడు జరిగిందంతా చెప్పుకొచ్చింది. 'చూడు సూరమ్మా, లింగపరీక్ష చేసేది కడుపులో ఉన్న బిడ్డ ఎదుగుదలలో లోపాలేమైనా వున్నాయేమోనని తెలుసుకునేందుకే తప్ప పుట్టబోయేది ఆడబిడ్డ అని తెలుసుకుని ఆ పసికందుని కడుపులోనే అంతం చేసేటందుకు కాదు. కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆడో మగో చెప్పడం చట్టరీత్యా నేరం. కాబట్టి వేరే ఆలోచనలేవీ పెట్టుకోకుండా ఏ బిడ్డ పుట్టినా దాన్ని దైవప్రసాదంగా భావించాలి ' అంటూ హితవు చెబుతున్న డాక్టరుపేపు అదోలా చూసింది సూరమ్మ.

'నీ మాటా పైనం సూస్తా వుంటే నా కోడలి కడుపుల మోస్తన్నది ఆడబొట్టేనని నాకు సమజయిందిలే డాక్టరమ్మా. ఆడబిడ్డని కనుడు, సాకుడూ మా ఇలాకలసే లేదు. మా తాతల కాడినిండీ మా ఇండ్లల్ల అంతా మగోల్లె పుట్టిన్రు, పెరిగిన్రు. అట్ల కాక ఈ పొద్దు నా కోడలి కడుపుల ఆడబొట్టికి గిన జాగ ఇస్తే మా ఇంటికే అశుభం. గా అరిష్టాన్ని దాని కడుపులకెల్లి తీసేసి జరింత పున్నెం కట్టుకో డాక్టరమ్మా. ' ఆ మాటలకి లోపలనుండి కోపం ఉవ్వెత్తున పొంగుకొచ్చినా తమాయించుకుని ' చూడు సూరమ్మా, నువ్వు చదువుకోలేదు కాబట్టి ఇంత వివరంగా చెప్తున్నాను. స్త్రీ పురుషుల్లోని క్రోమోజోముల కలయిక ద్వారా బిడ్డలు పుడతారు. పురుషుల్లో ఎక్స్, వై అనే రెండురకాల క్రోమోజోములుంటే, స్త్రీలలో మాత్రం కేవలం ఎక్స్ క్రోమోజోములే వుంటాయి. సంభోగ సమయంలో స్త్రీ శరీరంలోని ఎక్స్ క్రోమోజోముతో పురుషునిలోని ఎక్స్ క్రోమోజోము కలిస్తే ఆడబిడ్డ, అలాకాకుండా వై క్రోమోజోము కలిస్తే మగబిడ్డ కలుగుతారు. కాబట్టి పుట్టే బిడ్డ ఆడా, మగా అనే దాన్ని నిర్ణయించేది మగవారిలో ఉండే వై క్రోమోజోములే తప్ప దానికీ ఆడవాళ్ళకి ఏ విధమైన సంబంధం లేదు. కాబట్టి ఈ విషయంలో శుభము అశుభము అనేవి ఆడవాళ్ళకి ఆపాదించకుండా, మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలని చక్కగా పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులని నేర్పించడం మన ధర్మం. నేను ఇంత దాకా చెప్పింది నీకు అర్థమయిందో లేదో గానీ ఒక్క విషయం మాత్రం గుర్తు పెట్టుకో సూరమ్మా, నువ్వు కోరినట్టుగా కడుపులో వున్న ఆడపిల్లని ఎలా కడుపులోనే చంపేస్తూ పోతే ముందుముందు నీ మనవళ్ళకిచ్చి పెళ్లి చేసుకునేందుకు ఆడపిల్లలే దొరకని పరిస్థితి ఎదురవుతుంది ' అంటూ ఓపిగ్గా వివరించింది డాక్టర్ ప్రియంవద.

ఆ మాటలు సూరమ్మ మెదడులోకి ఎక్కి ఆమెలో మార్పు వచ్చిందో లేదా ఈ డాక్టరమ్మ వలన ప్రయోజనం లేదనే అనుకుందో గానీ మొత్తానికి డాక్టర్ చెప్పినదానికి ఎదురు మాట్లాడకుండా కోడలిని తీసుకుని మౌనంగా ఆస్పత్రి నుండి బయటకొచ్చేసింది.

***

" గా తర్వాత ఆసుపత్రి గేటుకాడ ఒక నర్సమ్మని కలిసి సానాసేపు గుసగుసలాడింది మా అత్త. ఆ నర్సమ్మ మా అత్త సేతిలో ఏదో పొట్లం పెట్టుడు, ఇంగ మా అత్తేమో ఆయమ్మి సేతిల దుడ్లు పెట్టుడు నా కండ్ల ముందే జరిగే ! ఇంట్లనేమో నిన్నటి సందీ నా పెనిమిటి తోటి మా అత్త మంతనాలు సేయడం సూస్తుంటే, ఏ చెనం నా నోట్ల మా అత్త నాటు మందు తెచ్చి కుక్కుద్దోనని బయ్యమవుతాంది. ఒకేల నాకేదైనా అయితే నా కొడుకుని జరింత కాసుకోండమ్మా' అంటూ పెద్దగా ఏడ్చేసింది మల్లిక. 'నువ్వనుకున్నట్టుగా

ఏమీ జరగదులే మల్లి. అన్నింటికీ ఆ అమ్మోరుతల్లే వుంది. ఆ తల్లిపై భారం వేసి నిశ్చింతగా వుండు. అంతా మంచే జరుగుతుంది ' అంటూ ధైర్యం చెప్పి పంపించాను.

***

ఆ మరుసటిరోజు ' బేగి రావే మల్లీ, మంత్రసాని మైసమ్మ కాడికి పోవాల ' అంటూ మల్లికని గబగబా లాక్కుపోయింది సూరమ్మ. అత్తతోపాటే వచ్చిన మూడేళ్ళ కొడుకుని గుండెలకు హత్తుకుంటూ, కసాయివాడి వద్దకి వెళ్తున్న గోవుకి మల్లే అత్త వెనకాల నడిచిపోతున్న మల్లికని చూస్తూ ' మల్లికి మంచి జరిగేట్టు చూడు తల్లీ. నీకు పట్టుచీర చుట్టిస్తాను ' అంటూ ఆ అమ్మవారికి మనసులోనే ముడుపు కట్టుకున్నాను.

***

మరుసటి రోజు మల్లికకి బదులుగా దాని అత్త సూరమ్మ పనిలోకి వచ్చింది.

నిన్నటి సంఘటన చప్పున గుర్తుకురాగా ' నువ్వు వచ్చావేమిటి సూరమ్మా ? మల్లికి ఆరోగ్యం బాగోలేదా' అని అడిగాను.

'అదేంలేదమ్మా. ఇయాల్టి సందీ మీ ఇంట్ల నేనే పని సేస్తనమ్మా. మల్లి ఇంటికాడే వుండి సక్కంగ ఆరాముగ వుంటనే కదమ్మా లోన బిడ్డ సుఖంగ ఉండేది. గా బిడ్డ భూమ్మీద పడినంక ఆ బిడ్డని సూసుకుంటూ నేను కాలం గడిపేస్త ' అన్న సూరమ్మ జవాబుకి సంభ్రమాశ్చర్యాలకి లోనయ్యాను.

'అకస్మాత్తుగా నీలో ఈ మార్పు ఏమిటి సూరమ్మా, అసలేం జరిగింది ' అన్న నా ప్రశ్నకి ' అంతా ఆ అమ్మోరితల్లి మహత్యం ' అంటూ నిన్న సాయంత్రం జరిగినదంతా చెప్పుకొచ్చింది సూరమ్మ.

***

' మల్లీ, మంత్రసాని మైసమ్మ అంజనం యేసి నీ కడుపుల వున్న బిడ్డ మగో ఆడో సెప్తది. ఆడబొట్టే అయితే మందు ఇస్తది. అది తిన్నంక కడుపులో బిడ్డ కడుపులోనే సాఫ్ అయిపోతది. నీ పేనానికి ఏ పెమాదమూ రాదు. ఇయ్యాల అమ్మోరితల్లికి ముడుపులు కట్టే రోజు కదా, ముందుగాల ముడుపు కట్టి ఆ పైన మైసమ్మ కాడికి పోదాం పా '

అత్త చెప్పేది మౌనంగా వింటూ భారంగా నడుస్తోంది మల్లి.

ఇద్దరూ కలిసి గుడికి చేరాక అక్కడ మల్లి చేత అమ్మోరు తల్లికి దగ్గరుండి సూరమ్మ ముడుపుని కట్టిస్తుండగా హఠాత్తుగా సూరమ్మ వెనకనున్న గంగమ్మ ఉన్నట్టుండి జుట్టు విరబోసుకుని ఊగడం మొదలెట్టింది.

' ఒసేయ్ సూరమ్మా, నీ కోడలు కడుపుల పెరుగుతున్నది నా అంశ. దాన్నే అంతం చేసే ఆలోచన చేస్తాన్నావు . నీకెంత ధైర్యమే ! నిన్నిడిచి పెట్ట, నీ వంశం ఆసాంతం నాశనం సేస్త. ఇకపై నీ వంశంలో మగ నలుసే లేకుండా సేస్తనే, కాసుకో '

గంగమ్మ నోటినుండీ ఉరుముల్లా వస్తున్న ఆ మాటలకి అత్తాకోడళ్ళు చేష్టలుడిగి నిలుచుండిపోయారు.

అక్కడే ఉండి ఇదంతా చూస్తున్న గుడికి వచ్చిన భక్తులంతా గంగమ్మ చుట్టూ చేరి ' అమ్మోరుతల్లీ, మమ్మల్ని సల్లంగా చూడమ్మా ' అంటూ చేతులెత్తి దండం పెడుతుంటే, మరికొందరేమో గంగమ్మకి సాష్టాంగ నమస్కారాలూ, పొర్లుదండాలు పెడుతున్నారు.

అక్కడే గుడి లోపల అమ్మోరికి ప్రదక్షిణాలు చేస్తున్న గంగమ్మ కూతురు కావేరి చెవిలో ఎవరో వెళ్ళి ఈ విషయం చెప్పగా ఆమె గబగబా బైటకి పరిగెత్తుకొచ్చి ' అమ్మోరుతల్లీ, నీకేం కావాలో సెప్పు తల్లీ. మేమేం సేస్తే శాంతిస్తావో సెప్పమ్మా ' అంటూ రెండు చేతులూ జోడించి ప్రార్థించింది.

'మల్లి గర్బంలో పెరుగుతున్న నా అంశనే అంతమొందించే పథకాలేస్తాందీ సూరమ్మ . అదే జరిగితే ఊరు వల్లకాడు సేస్తా. ఆ కడుపుల పెరుగుతున్న నా అంశకి నా పేరే పెట్టాల, ముద్దుగ పెంచి, బాగ సదివించాల, పేమగా సూసుకోవాల, మంచి వరుడికిచ్చి మనువు సేయాల. అట్ల మాటివ్వుండ్రి.

లేకుంటే, ఒసేయ్ సూరమ్మా నిన్నిడిచి పెట్ట. నీ కుటుంబంతో పాటు, ఈ ఊరినీ అంతం చేస్తా, హా హో హీ హూ '

పూనకంతో ఊగుతున్న గంగమ్మ మాటలకి అంతా భయపడి పోయారు.

' అమ్మోరు తల్లీ, సాక్ష్యాత్తూ నువ్వే మా ఊరి ఆడపడుచు కడుపుల పెరుగుతున్నవంటే మాకంతకంటే ఏం కావాల తల్లీ. నిన్ను పేనంగ సూసుకుంటం. నువ్వు సెప్పినట్టే ఆ బిడ్డని పేమగా పెంచుకుంటం. శాంతించమ్మా శాంతించు' అంటూ భక్తులంతా గంగమ్మ ముందు మోకరిల్లారు.

ఇదంతా చూస్తూ భయంతో వణికిపోయిన సూరమ్మ కూడా 'ఎరుక లేక తప్పు సేయబోయా అమ్మోరుతల్లీ, నన్ను సెమించమ్మా. నువ్వే నా ఇంట పొరాడతానంటే కాదంటనా తల్లీ, నిన్ను మా సెత్తిన పెట్టుకుని సూసుకుంటం తల్లీ శాంతించు, శాంతించు' అంటూ అమాంతం గంగమ్మ కాళ్ళపై పడింది.

ఆ మాటలకి తృప్తిపడ్డ గంగమ్మ కొద్దిక్షణాల తర్వాత పూనకం పోయి నీరసంగా నేలపైకి ఒరుగుతుంటే గభాల్న ఆమె భుజాల్ని పట్టుకుని అక్కడే ఉన్న అరుగుపై కూర్చోబెట్టి సపర్యలు చేయసాగింది ఆమె కూతురు కావేరి.

***

'ఆ అమ్మోరు తల్లే నా ఇంట పుట్టబోతాందంటే శాన సంతోసంగుందమ్మా. మా ఇంటోళ్ళం ఎంత పున్నెం సేసుకుంటే గంత అదురుట్టం పడతాది సెప్పు తల్లీ ! అమ్మోరు తల్లి సల్లని సూపుకంటే ఇంగేం కావాలమ్మ ఈ జనమకి'

రెండు చేతులూ జోడించి పారవశ్యంతో చెబుతున్న సూరమ్మ మాటలకి నాలో ఆనందం ఉప్పొంగింది.

హమ్మయ్య, మొత్తానికి సిస్టర్ నివేదిత నేను చెప్పిన ఆలోచనని తూచా తప్పకుండా పాటించి కొండంత సమస్యని చిటికెలో పరిష్కరించింది.

సాక్ష్యాత్తూ అమ్మోరు తల్లే చెప్పినట్టుగా గంగమ్మ చేత ఆడించిన పూనకం నాటకం సూరమ్మని సమూలంగా మార్చేసింది.

తీవ్రమైన మానసిక బాధ, మనోవైకల్యాల కారణంగా మనిషిలో వచ్చే హిస్టీరియా లక్షణాలకి దైవత్వాన్ని ఆపాదిస్తూ సాక్ష్యాత్తు అమ్మోరే ఒంటి పైకి పూనకంలా వచ్చినట్టు భావించే ఒక మూఢవిశ్వాసం ' ఆడపిల్ల పుట్టుక ఇంటికి అరిష్టం' అనుకునే మరో మూఢవిశ్వాసాన్ని ఈ వేళ జయించింది. చదువు లేని సూరమ్మ విషయంలోనైతే ముల్లును ముల్లుతోనే తీసిన చందాన పని సాధించగలిగాను. కానీ చదువుకున్న మూర్ఖుల మనస్సులోనూ స్థిరపడిపోయిన ఈ అంధవిశ్వాసాలను కూకటి వేళ్ళతో పెళ్లగించడం సాధ్యమేనా? రాకెట్లలో అంతరిక్షంలోకి దూసుకుపోతున్న ఈ నవీనయుగంలో ఈ మూఢనమ్మకాలకి చరమగీతం పాడే రోజు ఎప్పుడూ వస్తుందో కదా !

ఏదేమైనా మొత్తానికి ఒక ఆడశిశువుని కళ్ళుతెరవకుండానే మాతృగర్భంలోనే అంతమైపోయే భయంకరమైన విపత్తునుండి తప్పించగలిగాను. నాకీ తృప్తి చాలు !!!

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి



SIDDHENDRA KUCHIPUDI ART ACADEMY
FOUNDER AND ARTISTIC DIRECTOR: SWATHI ATLURI-GUNDAPUNEEDI
PHONE: 732-429-2948
EMAIL: SIDDHENDRAKUCHIPUDI@GMAIL.COM
WWW.SIDDHENDRAKUCHIPUDIARTACADEMY.COM
HTTPS://WWW.FACEBOOK.COM/SIDDHENDRAKUCHIPUDI

## సారాంశం

**రాంభక్త పద్మావతి**
**(తెలుగు జ్యోతి కవితల పోటీలో ద్వితీయ బహుమతి గ్రహీత)**

బాధ్యతలు నిద్రపోనివ్వవు
బంధాలు కట్టేసి కదలనివ్వవు
చితికిన కలల ఆనవాళ్ళు
అష్టదిగ్బంధనం చేసి
ఊపిరాడనివ్వవు

ఉదయాలు రాత్రులు
నిస్సవ్వడిగా నేల రాలుతూ
దిగులు మంటలను రాజేస్తూ
ఆశలు చిగురులు తొడిగే లోపల
ఇదీ అని చెప్పలేని నిరాసక్తత నులిమేస్తూ

కనులకు చిక్కిన అందమైన దృశ్యాన్ని
వలేసి పట్టేలోగా
ప్రశాంత కొలను చెల్లాచెదురవుతూ
ఇదీ అని వివరించలేని
దుఃఖం మెలిమెడుతూ

కదులుతున్న కాలాన్ని నిస్సహాయంగా చూస్తూ
వడలిపోతున్న దేహాన్ని నిరాశతో గమనించుకుంటూ
భారంగా అడుగులేస్తూ

మార్గమధ్యం లో
గమనం మార్చుకుని తరలిపోయిన పిల్ల కాలువలు
సాయంసంధ్యలో మరల జతకూడిన పాత నదులు
జీవితపు మరిన్ని కోణాలను
ఓపికతో బోధిస్తూ

ఆకాశం బద్దలై కిందపడినా
భూమికి రెక్కలు మొలిచి పైకెగిరినా
ప్రయాణం అర్థాంతరంగా ముగియకూడదు

ఒకవేళ మనసు ముక్కలైతే
అతుకులేసుకుంటూ పక్కన నిలబడు
అది చేసింది నువ్వైతే
మరో పక్కన నిలబడి క్షమాపణనడుగు

**ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి**

## పాట

**జె ప్రణతి – 6 వ తరగతి**
**(తెలుగు జ్యోతి పిల్లల పోటీలో బహుమతి గ్రహీత)**

రంగు రంగుల గాలిపటాలను
నింగిన ఎగర వేయాలి
పావురాలతో పోటీపడుతూ
అవి ఎగురుతువుంటే చూడాలి

బొంగరాలకు దారం చుట్టి
నేలపైకి విసరాలి
గిర గిర మరిమరి తిరుగుతువుంటే
మనమూ చుట్టూ తిరగాలి

కాగితాలతో పడవలు చేసి
వాన నీటిలో వదలాలి
పోటీ పడుతూ పరుగులు తీసే
పడవని చూసి నవ్వాలి

సెల్ఫోన్ వంకా చూడకుండా
చెల్లితో మనము ఆడాలి
అమ్మ చెప్పిన చిన్న పనులను
చప్పున చేస్తూ ఉండాలి

**ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి**

## అన్ని నీవనుచు..

లక్ష్మీ గాయత్రి

ఎంత వద్దనుకున్నా మనసు మోహన రాగాన్నే ఆలపిస్తోంది గౌరీమనోహరికి. ఫోటోలో చూసిన అందగాడి చుట్టూ ఆశలు అల్లుకుపోతున్నాయి. సంగీతం వచ్చినవాణ్ణే చేసుకుంటానంటూ నిన్నటి దాకా తను పెట్టిన పేచీ ఇప్పుడు కల్లో కూడా గుర్తు లేదు. పెళ్లికొడుకు శ్రీధర్‌కి స్వరాలెన్నో కూడా తెలియదని తండ్రి ముందే చెప్పినా కూడా అతని ఫోటో చూడగానే మనసంతా ఏదో అవ్యక్తానందంతో నిండిపోయింది.

"కన్నె మనసంటే ఇలాగే ఉంటుంది కాబోలు..అందుకే దుష్యంతుణ్ణి చూస్తూనే మైమరచిపోయింది శకుంతల" అనుకుని నవ్వుకుంది.

పెళ్లివారు చూపులకొచ్చారు! పరిచయాలయ్యాయి!

"మా నాన్నగారు సంగీతవిద్వాంసుడు. మా అమ్మాయికి ఆయనే సంగీతం నేర్పించారు. ఆలిండియా రేడియోలో ఆర్టిస్టు మా గౌరి. సంగీతమంటే ప్రాణం" తండ్రి పరిచయం చేస్తుంటే శ్రీధర్ చిరునవ్వుతో వినడం గౌరి కంటి చివరి నుంచి స్పష్టంగా చూసింది. నల్లని మీసకట్టు కింద కొద్దిగా విచ్చుకున్న పెదవుల మీది దరహాసం, కళ్లలో ప్రతిఫలిస్తూ, మొహాన్ని మరింత కాంతివంతంగా చెయ్యడాన్ని చూసి అబ్బురపడింది.

అదేనా మంచితనమంటే....ఆ కళ్లలో కనిపిస్తున్న వెలుగేనా మంచితనం?!

"ఒక పాట పాడమ్మా" శ్రీధర్ తండ్రి ఆసక్తిగా అడిగాడు.

"పూవులేరి తేవే చెలి పోవలె కోవెలకూ..." కృష్ణశాస్త్రిగారి గీతం పాడింది గౌరి

"చాలా బాగా పాడావు. మా ఇంట్లో పాటలు వినేది నేనొక్కణ్ణేనమ్మా. తల్లీకొడుకులిద్దరికీ అవేమీ అక్కర్లేదు!" నవ్వుతూనే అన్నాడాయన. పెళ్లికొడుక్కి పాట అక్కర్లేదన్న మాట కూడా గౌరి మనసుకెక్కలేదు. నవ్వి ఊరుకుంది.

నెల తిరక్కుండా శ్రీధర్‌కీ గౌరికీ పెళ్లయిపోయింది. అటూ ఇటూ తిరగడాలతో నెమ్మదిగా రెండు నెలలు గడిచాయి. ధనుర్మాసం వచ్చింది. పుట్టింట్లో తెల్లవారుజామున కూనిరాగాలు తీసుకుంటూ చుక్కల ముగ్గులు పెట్టడం, తాతగారి దగ్గర కూర్చుని అన్నమయ్య పాటలు పాడటం గుర్తొచ్చింది గౌరికి.

తెల్లవారుజామునే లేచి తలారా స్నానం చేసింది! చిరునవ్వుల కాంతులు వెదజల్లుతున్న నందగోపాలుని దగ్గర దీపం వెలిగించి, "నారాయణతే నమో నమో..." అంటూ సన్నగా పాడటం ప్రారంభించింది.

"జలధిశయన రవిచంద్ర విలోచన..." మైమరచి పాడుతున్న గౌరికి పక్కనుంచి సన్నగా ఏదో చప్పుడు వినిపించింది. పాడుతూనే తలతిప్పి చూసింది. అప్పటివరకూ తీసి ఉన్న బెడ్ రూం తలుపులు ఇప్పుడు వేసేసి ఉన్నాయి. పాట ప్రారంభంలో తల తిప్పి ఆదమరిచి నిద్రపోతున్న శ్రీధర్‌ని చూసి, తృప్తిగా పాట ప్రారంభించింది. ఇప్పుడతను కనిపించడం లేదు. తామిద్దరికీ మధ్య అడ్డుగోడలా మూసిన తలుపు! మరిక పాట ముందుకు సాగలేదు గౌరికి. గొంతు అప్రయత్నంగా మూగబోయింది!!

కలలు గనే నోగకళ్లకు కాటుకరేఖలు దిద్దుకున్నా.. కమ్మగా కాచిన నెయ్యి వేసి ముద్దపప్పు ముద్దలు పెట్టినా ప్రతీదీ భర్త మీది ప్రేమతో, మొగుడి మెప్పుకోసమే చేస్తుంది ఆడ పుటక పుట్టిన ప్రతి ప్రాణీ. తను పాడే పాట, చేసే నృత్యం, గీసే చిత్రం మున్ముందుగా భర్త వినాలి.. చూడాలి.. మెచ్చుకోవాలి. అప్పుడే ఆ కళకి అస్తిత్వం దక్కినట్టు! కట్టుకున్నవాడి ఆదరణకు నోచుకోని కళ.. ఎప్పటికైనా మాసిపోక తప్పదు. చరిత్రలో అందుకు లక్షా తొంభై ఉదాహరణలున్నాయి.

రెండు నెలలుగా జాజ్వల్యమానంగా వెలుగుతున్న తన సంసారజ్యోతి...కాంతి తగ్గినట్టు అనిపించింది గౌరికి. తృప్తి

నిండిన మనసులో అసంతృప్తి చోటు చేసుకుంది. నిర్మల సరోవరంలో నాచు!!

తన మనసులో అలజడిని బైటికి తెలియనివ్వలేదు గౌరి. యధాప్రకారం పనులన్నీ చేసింది. శ్రీధర్ కూడా మామూలుగానే ఉన్నాడు. తలుపు వేసినందుకు సారీ చెప్పడంలాంటిదేమీ చెయ్యలేదు.

రెండు రోజులు గడిచాయి. గౌరి తండ్రి మహాదేవశాస్త్రి ఫోన్ చేశాడు.

"అమ్మా, ప్రతి ధనుర్మాసంలోనూ మనింటి దగ్గరున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నువ్వు స్వరార్చన చేస్తూ ఉంటావు కదా. పెళ్లయిపోయినా ఊళ్లోనే ఉంటున్నావు కాబట్టి, రేపు శనివారం వచ్చి పాడమని పూజారిగారు అంటున్నారు. నువ్వూ అల్లుడూ శుక్రవారం రాత్రే మనింటికి వచ్చేస్తే శనివారం తెల్లవారుజామునే వెళ్లి పాడొచ్చు!"

గౌరీమనోహరి మనసు ఒక్కసారిగా పురులు విప్పింది. నాదస్వరం విన్న నాగులా పాడాలన్న కోరిక పడగెత్తింది.

"అలాగే నాన్నా, తప్పకుండా వస్తాం" ధాటీగా తండ్రికి చెప్పేసింది.

శ్రీధర్‌కి విషయం చెప్పి, "రేపు సాయంత్రం అమ్మా వాళ్లింటికి వెళ్లిపోదాం. తెల్లవారుజాము ఐదింటికల్లా

పాశుర విన్నపం అయిపోతుంది. వెంటనే పాడాలి!" అంది ఆనందంగా

శ్రీధర్ ఒక్క క్షణం మాట్లాడలేదు. తర్వాత గౌరిని దగ్గరగా తీసుకుంటూ, "సారీ గౌరీ. నా ఫ్రెండ్ ఒకడు అమెరికా నుంచి వచ్చాడు. ఫ్రెండ్సందరం శనివారం కలుస్తున్నాం. నాకు రావడానికి కుదరదు. నువ్వు వెళ్లి హేపీగా పాడు!" అన్నాడు

గౌరీమనోహరి ఆనందమంతా ఒక్కసారిగా ఆవిరైపోయింది. అసంతృప్తి నాచు మరికాస్త చిక్కనైంది.

ఏ పాటలు పాడితే బావుంటుంది..ఏ రాగాలైతే ప్రత్యూషపు ప్రశాంతతనీ, దాంతో అల్లుకుని ఉన్న భక్తినీ ఇనుమడిరపజేస్తాయి...లాంటి విషయాల్ని ఎటూ భర్తతో చర్చించలేదు. తను పాడుతూ ఉంటే అతను కనీసం ఎదురుగా కూర్చుని తన్మయంగా వింటూ ఉంటే చాలనుకుంది తను. కానీ...

మరింక ఆలోచించలేదు గౌరి. ఆలోచించి ప్రయోజనం లేదు. ఈ ఆలోచనలేవో శ్రీధర్‌ని పెళ్లి చేసుకోవడానికి ముందు ఉండాల్సింది. సంగీతం వచ్చినవాణ్ణే చేసుకుంటానన్న మాట మీద ఉంటే ఇప్పుడిలాంటి బాధ ఉండేది కాదు. ఫోటో చూసీ చూడగానే శకుంతలా దుష్యంతుడూ అనుకుంటూ వ్యామోహంలో పడిపోయింది. ఇప్పుడు ఏమనుకునీ ఏమిటి ప్రయోజనం..?! ఇవాళ తనొక్కడే ఫ్రెండ్‌ని కలుస్తున్నాడు. రేపు ఫ్రెండ్ భార్య కూడా వస్తోంది.. పాటా లేదు ఆటా లేదు నువ్వు కూడా రా అంటే ... ?!

గౌరి నిశ్శబ్దంగా భర్త చేతుల మధ్య నుంచి తప్పుకుని వంటింట్లోకి వెళ్లింది. ఎప్పుడైనా మనసు బాగా లేకపోతే గొంతెత్తి తనకి నచ్చిన పాట పాడుకోవడం గౌరికి అలవాటు. పాట పూర్తి కాగానే మనసంతా ప్రశాంతంగా అయిపోతుంది. కాని ఇప్పుడు పాడాలంటే గొంతు పైకి లేవడం లేదామెకి. భర్త ఇప్పుడే ఆఫీసు నుంచి వచ్చాడు. అతనికి ఇల్లు ప్రశాంతంగా ఉండాలంటే తను పాడకూడదు! తను గొంతెత్తితే అతను మళ్లీ తలుపు వేసేసుకుంటాడు. గౌరీమనోహరి మనసులో కదిలిన ఆలోచన అదే!

మర్నాడు మధ్యాహ్నం తనొక్కర్తీ బయలుదేరి వెళ్లాలా వద్దా అని గౌరి కొట్టుమిట్టాడుతూ ఉండగా, అనూహ్యంగా శ్రీధర్ ఎవరో అపరిచితుణ్ణి వెంటబెట్టుకు వచ్చాడు.

గౌరికి అతన్ని చూపించి, "ఎవరో తెలుసా" అన్నాడు నవ్వుతూ.

గౌరి తెల్లబోయింది.

వచ్చినతను నవ్వి "చెప్పాను కదా..మేం ఇద్దరం ఎప్పుడూ కలుసుకోలేదని!" అన్నాడు

"అయితే నీ గురించి నువ్వే చెప్పు. ఈ లోపల నేను మాంచి టీ చేసి తెస్తాను!" అంటూ వంటింట్లోకి వెళ్లాడు శ్రీధర్.

వచ్చినతను "నేనెవరో చెబుతున్నా...వినండి!" అని "అదివో అల్లదివో శ్రీహరివాసము" అంటూ అందుకున్నాడు.

పాట ప్రారంభించిన క్షణంలోనే గౌరికి అతను రేడియో ఆర్టిస్టు మురళి అని తెలిసిపోయింది. మరుక్షణం ఆమెలో నిస్తబ్దతంతా ఊదేసినట్టే పోయింది. మైమరచిపోతూ పాట విని, పూర్తవగానే అప్రయత్నంగా చప్పట్లు కొట్టింది.

"మీ పాట వినగానే గుర్తు పట్టాను మురళీగారూ...చాలా సంతోషంగా ఉంది మిమ్మల్ని కలవడం"

ఆ పాటికి మూడు కప్పులతో టీ తీసుకొచ్చిన శ్రీధర్, "రేపు నువ్వు పాడబోయే ఆలయంలో మురళి ఎల్లుండి పాడుతున్నాడట. రేపు నీ పాట ఉందని చెప్పాను. వినడానికి తను వస్తానన్నాడు" అన్నాడు

అప్పటిదాకా పాడాలా వద్దా అన్న సందిగ్ధతలో కొట్టుమిట్టాడిన గౌరీమనోహరి, ఆ క్షణం తను వెళ్లి పాడాలన్న నిర్ణయానికి వచ్చేసింది.

"ఇంతకీ ఏం పాడుతున్నారు రేపు" మురళి అడిగాడు

గౌరి చప్పున జవాబు చెప్పలేకపోయింది. "మీరు చెప్పండి, ఏం పాడితే బావుంటుంది?!" అంటూ ఎదురు ప్రశ్నించింది.

"తెల్లవారుజాము కచేరీ గనక మార్నింగ్ రాగాతో ప్రారంభిస్తే బావుంటుంది. రేవగుప్తిలో పురుషోత్తముడవీవుతో మొదలుపెట్టండి!"

మురళి మాటలు వింటూంటే ఎక్కడలేని ఉత్సాహమూ పుట్టుకొచ్చింది గౌరికి. అప్రయత్నంగా "పురుషోత్తముడవీవు...పురుషాధముడ నేను" అంటూ హమ్ చేసింది.

"ఆ...అదే. ఏదీ పాడండి!"

తొలిసారిగా భర్త అస్తిత్వాన్నే విస్మరించింది గౌరీమనోహరి. పెళ్లి కాకముందరి గౌరిలా అనుభూతి చెందుతూ..హాయిగా గొంతు విప్పి పాడింది.

"అద్భుతంగా పాడారు. మీ గొంతులో భావాలు చక్కగా ధ్వనిస్తున్నాయి. గమకం వండ్రఫుల్‌గా ఉంది. ముఖ్యంగా మీ స్వరం చాలా స్వీట్‌గా ఉంది. సినిమాల్లో పాడితే మీరొక స్వర్ణయుగాన్ని సృష్టిస్తారు. ఓకే...తర్వాతేమిటి...ఒకటి అన్నమయ్యది అయిన తర్వాత రెండోది వేరే ఎవరిదైనా అయితే బావుంటుంది." గుక్క తిప్పుకోకుండా మాట్లాడాడు మురళి.

తనకంటే సీనియర్ అయిన అతని ప్రశంసలకి గౌరి మొహం పుచ్చపువ్వులా విచ్చుకుంది. బాహ్యస్మృతి పూర్తిగా నశించింది.

"వేరే ఎవరిదైనా అంటే...." అంటూ ఆలోచనలో పడిరది.

"హంసనాదరాగంలో బంటురీతి కొలువు పాడండి. త్యాగరాజకీర్తన. చాలా ఫేమస్. అందరూ ఎంజాయ్ చేస్తారు!"

"నిజమే గానీ, హంసనాదం మార్నింగ్ రాగా కాదు కదా"

"కాదు. కాని కర్ణాటక సంగీతంలో సమయం కంటే సందర్భానికే ఎక్కువ ప్రాముఖ్యత. కర్ణాటక సంగీత విద్వాంసులు ఏ రాగాన్నైనా ఎప్పుడైనా పాడతారు. సాయంత్రం కచేరీల్లో మార్నింగ్ రాగాల కీర్తనలు బోలెడుంటాయి. అయినా మొదటిపాట మార్నింగ్ రాగాలో ఇచ్చేశాం కాబట్టి తర్వాత ఏదైనా ఓకే"

"ఓకే...బంటురీతి కొలువు ఒక్కసారి పాడతాను...విని చెప్పండి ఎలా ఉందో..." ఆ క్షణం మురళి తనకి అత్యంత ఆత్మీయుడుగా అనిపించాడు గౌరికి. అతని దగ్గర తనకి ఎంతో చనువు ఉన్నట్టే ఫీలయింది.

మొత్తం మీద ఇద్దరూ కలిసి మర్నాడు గౌరి పాడవలసిన పాటలు నిర్ణయించి ఒక విడత రిహార్సల్ పూర్తి చేసేసరికి సాయంత్రం ఐదయింది.

"చాలా థాంక్సండీ. ఏ ప్రోగ్రామ్‌కీ నేను ఇంత బాగా ప్రిపేర్ అవలేదు!" గౌరీమనోహరి తృప్తిగా, ఆనందంగా అంది.

"మీరు థాంక్స్ చెబితే నా ఆనందమంతా పోతుంది. ఎందరెందరివో పాటలు విన్నాను గానీ మీ పాట నన్ను

వశపరచుకున్నట్టు మరెవ్వరి గాత్రమూ లేదు!" అంటూ చుట్టూ చూశాడు మురళి

అప్పుడు... ఒక్కసారిగా భర్త గుర్తొచ్చాడు గౌరీమనోహరికి. చూస్తే శ్రీధర్ బెడ్ రూమ్ తలుపు వేసుకుని లోపల కూర్చుని ఆఫీస్ వర్క్ చేసుకుంటున్నాడు.

"మనం పాడుతున్నాం కదా...ఆయనకి డిస్టర్బెన్స్..అందుకే లోపల కూర్చున్నారు!" కాస్త కినుకగా అంది గౌరి

మురళి నవ్వేశాడు.

ఆ మర్నాడు ఆలయంలో గౌరి పాటకచేరీ అద్భుతంగా జరిగింది. మునుపటి కంటే కూడా చాలా బాగా పాడావంటూ అందరూ మెచ్చుకున్నారు. మర్నాడు ఉదయం మురళి పాడాడు. అతడి కోరిక మీద గౌరి కూడా అతని పక్కన కూర్చుని ఒకటి రెండు పాటలు పాడింది.

ఆ తర్వాత గౌరి జీవితంలో మురళికి ప్రాధాన్యత పెరిగింది. సాయంత్రాలు శ్రీధర్‌తో బాటు అతను రావడం, సంగీతచర్చలు మామూలైపోయాయి. క్రమేపీ మురళి కోసం ప్రత్యేకంగా టిఫిన్లు చెయ్యడం, అలంకరించుకోవడం వరకూ విషయం పాకింది. మురళి కూడా గౌరి పట్ల ఆసక్తిగానే ఉన్నాడు.

ఇలా ఉండగా హఠాత్తుగా గౌరికి ఒకరోజు అనుమానం వచ్చింది. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతున్న చందాన తనూ మురళీ కాలక్షేపం చేస్తున్నారు. ఇంట్లోవాళ్లు పిల్లిని చూసినట్టు శ్రీధర్ తమని చూస్తూనే ఉంటాడు కదా...అతను ఇప్పటిదాకా తనని ఏమీ అనలేదు. మామూలుగానే ఉన్నాడు. కాని అతని మనసులోని ఆలోచనలేమిటో....అతనికేమైనా కోపంగా ఉందో ఏమో...?!

"నేనూ మురళీ మాట్లాడుకోవడం, పాడుకోవడం మీకేమైనా ఇబ్బందిగా ఉందా..." భర్త ఏమంటాడోనని భయపడుతూనే అడిగింది.

శ్రీధర్ ఎప్పటిలాగే చిరునవ్వు నవ్వాడు. "మీ ఇద్దరి మధ్యా సంగీతచర్చలు నడుస్తున్నాయి. అవి శృంగారచర్చలుగా రూపాంతరం చెందనంతకాలం నాకు ఏ ఇబ్బందీ లేదు!"

గౌరి కొరడా దెబ్బ తిన్నట్టే ఉలిక్కిపడిరది. "అంటే.... ఏమిటి మీ ఉద్దేశ్యం?!" అంది రోషంగా

శ్రీధర్ నవ్వు చెక్కుచెదరలేదు. "నా భార్య నన్ను ప్రేమించాలని కోరుకుంటానే గాని, ఏ రకంగానూ భార్యని శాసించను. యజమాని అంటే ప్రేమ ఉన్న చిలక, స్వేచ్ఛగా ఎగురుతున్నా యజమానిని విడిచి వెళ్లదు. దాన్ని పంజరంలో బంధించాల్సిన అవసరం లేదు. అలా బంధించడం న్యాయమూ కాదు! అదే నా ఉద్దేశ్యం!"

గౌరీమనోహరికి నోట మాట రాలేదు. శ్రీధర్ అమాయకుడేమీ కాదు. తామిద్దరిలో కలుగుతున్న వికారం అతని దృష్టికి ఎప్పుడో వచ్చింది. అయినా అతను కల్పించుకోవడం లేదు. తన మంచి చెడ్డలు తననే చూసుకోమని పరోక్షంగా చెబుతున్నాడు. తను చిలకా అతను యజమానీనా..ఏం చూసుకుని అతనికంత ధీమా...మురళి కాలిగోటికైనా సరిపోతాడా అసలు..?!

మర్నాడు ఫోన్ చేసి శ్రీధర్ అన్న మాట మురళితో చెప్పింది.

తక్షణం బయల్దేరి వచ్చేశాడు మురళి. గౌరి రెండు చేతులూ పట్టుకుని దగ్గరకి లాక్కుంటూ "అంతా మన మంచికే. నీకు శ్రీధర్ ఎట్టి పరిస్థితుల్లోనూ తగడు గౌరీ. అసలు నేనే చెబుదామనుకుంటున్నాను. వాడికి డైవోర్స్ ఇచ్చెయ్...మనం పెళ్లి చేసుకుందాం! నీకు సినిమా అవకాశాలు కూడా ట్రై చేస్తున్నాను. మన భవిష్యత్తు బంగారమే"

గౌరి బిత్తరపోయింది. మురళి అంటే ఇష్టమే అయినా తను ఆశించినట్టు ఆనందం కలగడం లేదు. ఏదో తెలియని ఆందోళన, ఆవేదన కలుగుతున్నాయి. తన మనసేమిటో తనకే అర్థం కావడం లేదు.

ఒక వారం పాటు దీర్ఘంగా ఆలోచించింది గౌరి. పెళ్లయి నిండా ఆర్నెల్లు కూడా కాకుండానే డైవోర్స్ తీసుకోవాలంటే

సహజంగా ఉండే భయం వల్లే ఆందోళన అని నిశ్చయించుకుని, తనకి తనే ధైర్యం చెప్పుకుంది. మురళిని చేసుకుంటే తన జీవితం రాగమాలికే అవుతుంది. సినిమాల్లో పాడటం ఒక్కటే తనకి ఇష్టం లేదు. దానికేమీ ఫర్వాలేదు. మురళి తనని బలవంత పెట్టడు. తన ఇష్టానికే వదిలేస్తాడు. అంచేత ధైర్యం చేసి మురళిని చేసుకోవడమే మంచిది.

ఒక నిర్ణయానికి వచ్చి, మర్నాడు శ్రీధర్ ఆఫీసుకి వెళ్లగానే ఒక పెద్ద బ్యాగ్ నిండా తన బట్టలు సర్దుకుని పుట్టింటికి బయల్దేరింది గౌరి. పుట్టిల్లు చేరుతూనే మురళికి ఫోన్ చేసింది.

గౌరి శ్రీధర్‌ని వదిలేసి వచ్చేసిందని విని ఆనందపడ్డాడు మురళి.

"సంగీతదర్శకుడు రామన్ గంట కిందటే ఇక్కడ విమానం దిగాడు. ఇప్పుడు నేను ఆయన దగ్గరే నోవోటెల్‌లో ఉన్నాను. నువ్వు వెంటనే ఇక్కడికి రా." అంటూ ఫోన్ పెట్టేశాడు

గౌరికి తొలిసారిగా మురళి మీద చిరాకు కలిగింది. తనకిష్టం లేదంటున్నా ఈ సినిమా గోల వదలడం లేదు మురళి. నేపథ్యగాయనిని చేసి అందలం ఎక్కిస్తానంటాడు. గట్టిగా చెప్పాలి తనకి ఎంతమాత్రమూ ఇష్టం లేదని. ఇప్పుడు నోవోటెల్‌కి వెళ్లడం కూడా ఇష్టంలేదు తనకి. ఆ మాటే చెబుదామని మళ్లీ రెండుసార్లు ఫోన్ చేసింది గౌరి. మురళి లిఫ్ట్ చెయ్యలేదు. సరే, ఒకసారి వెళ్లినంత మాత్రాన కొంపలేమీ మునగవులే అనుకుని నోవోటెల్‌కి బయల్దేరింది.

హోటల్ లాంజ్‌లోనే కనిపించాడు మురళి. అటు తిరిగి ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అతని దగ్గరకి వెళుతున్న గౌరికి పదడుగుల దూరంలో ఉండగానే మురళి మాటలు వినిపించాయి.

"నా పంట పండింది భయ్యా. అది మొగుణ్ణొదిలేసి వచ్చేసింది. రామన్ సార్ దగ్గరకి తీసుకెళుతున్నాను. ఒకే అయిందంటే ఇక నాకు కాసుల వర్షమే....ఏంటీ..దానికిష్టం లేదనా...నా పెళ్లామయ్యాక ఇంకా దానిష్టం ఏమిటి భాయీ...చచ్చినట్టు మన మాట వినాల్సిందే! నో వే...." మురళి నవ్వుతున్నాడు

ఆ మాటలన్నీ స్పష్టంగా వినిపించాయి గౌరికి. ఒక్కక్షణం కొయ్యబారిపోయినట్టే ఉండిపోయింది. వెంటనే తేరుకుని, నెమ్మదిగా వెనక్కి తిరిగి నడుచుకుంటూ బైటికి వచ్చేసింది.

మురళి తన గురించి చులకనగా మాట్లాడాడన్న ఆలోచన కూడా రాలేదు గౌరికి. మనసులో ఒకటే మాట గింగిరాలు తిరుగుతోంది..."నా పెళ్లామయ్యాక ఇంకా దానిష్టం ఏమిటి....చచ్చినట్టు మన మాట వినాల్సిందే!"

ఆ క్షణం గౌరి అంతర్నేత్రం తెరచుకుంది. శ్రీధర్‌కీ మురళికీ ఉన్న తేడా ఏమిటో, శ్రీధర్‌లో ఉన్న గొప్పతనమేమిటో అర్థమైంది.

మురళి సగటు మగవాడు. స్త్రీని గౌరవించడం సగటు మగవాడికి చేతగాని పని. ఆడదానిలో ఎంత గొప్పదనం ఉన్నా ఆమెను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలనే సగటు మగవాడు ప్రయత్నిస్తూ ఉంటాడు. తేడా వస్తే రాక్షసుడైపోతాడు. అలా లేనివాడు పురుషోత్తముడే. అది శ్రీధర్!

శ్రీధర్‌కి సంగీతంలో ఆసక్తి లేకపోవచ్చు కాని, అతను నూటికి నూరుపాళ్లూ మంచి భర్త! తనని ప్రేమగా చూసుకున్నాడు. ఏ మగవాడూ ఆడదానికి ఇవ్వనంత స్వేచ్ఛ ఇచ్చాడు. పరాయి మగవాడితో కలిసి గంటలు గంటలు కాలక్షేపం చేస్తున్నా పల్లెత్తు మాట అనలేదు. మనిషిని ప్రేమతో బంధించాలే గాని, నిబంధనలతో కాదని ప్రాక్టికల్‌గా చేసి చూపించాడు.

సంగీతం విషయానికొస్తే, ఒక్క సంగీతమే కాదు ఏ కళ అయినా మంచితనపు నీడలో ఉన్నప్పుడే బతుకుతుంది ... ఎదుగుతుంది! మంచివాడు కళాకారుడు కాకపోయినా పర్వాలేదు గాని, కళాకారుడు దుర్మార్గుడైతే మాత్రం కళ, కళ తప్పుతుంది ... వసివాడిపోతుంది! అత్యద్భుతమైన గాయనీమణులందరి జీవితాలూ నట్టేట్లో కలిసిపోవడానికి కారణం వారి భర్తలు సగటు మగవాళ్లు కావడమే!!

"నా భార్య నన్ను ప్రేమించాలని కోరుకుంటానే గాని, ఏ రకంగానూ భార్యని శాసించను" అన్న భర్త మాటలు వేదాక్షరాల్లా వినిపించాయి గౌరీమనోహరికి. మట్టి నీడలాంటి

శ్రీధర్ అండ వదిలేసి పడగ నీడలోకి వెళుతోందన్న విషయం తన అంత:కరణానికి అందింది. అందుకే తనకి ఆందోళన కలిగింది. పురుషోత్తముడైన భర్త పట్ల తనకి తెలియకుండానే తను పెంచుకున్న ప్రేమ అతన్ని వదిలేసి వెళ్లాలంటే ఆవేదనగా పరిణామం చెందిందని గౌరి మనసుకి ఆ క్షణం గ్రాహ్యమైంది. పెళ్లిచూపులనాడు తనకి శ్రీధర్‌లో కనిపించింది భౌతిక సౌందర్యం కాదు ... మనోనైర్మల్యమే! కలకలమను ముఖకళ నొక్కుచు పలుకులనమృతము లొలికే స్వామి తన శ్రీధర్. అలాంటి మనిషిని దాటిపోకుండా తనని ఆ భగవంతుడే కాపాడాడు!

“అమ్మా…నేను బయల్దేరతాను, బొట్టు పెట్టు!” పెద్ద బ్యాగేసుకుని ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూస్తూ తల్లి గౌరీమనోహరి నుదుట కుంకుమ దిద్దింది!!

*************************

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

## గురు స్మరణ

మొక్కరాల కామేశ్వరి

తల్లి ప్రాణ మిచ్చు తండ్రి ప్రాపు నిచ్చు
గురువిచ్చు జిజ్ఞాస గురుతెరుగ నీ దిశ
తల్లి తండ్రి లేక మనికి లేదు జగతి
గురువు లేక ఇలను దొరకునా సుగతి?

మంచి గురువు నేర్పు మర్మ మెల్ల తెలిపి
ఆచరించి చూపు ఆచార్య వరుడు
గురుని బాధ్యత చూడ గురుతరం బగును
ఛాత్రు పై తనముద్ర శాశ్వతం బగును.

విద్య నేర్పు నపుడు విష్ణురూపు డతడు
విజ్ఞతను నేర్పగా విశ్వనాథుండు
వివరంబు తెలుపగా విరియించి తానగును.
అట్టి గురునికి చేతు అభివాద శతము

సద్గురుని బడయంగ నరయ మూలమ్ము
దేవుడిచ్చిన వరము దీవెనల ఫలము
తానె గురువు అగుట తలుప భాగ్యమ్ము
పూతమగు జీవిక, పూర్ణమగు చరిత..

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి



# ఆమె అంటే అత్యద్భుతం

నామని సుజనాదేవి

తనువంతా నలుపద్దిన నిశిరాత్రి ని
కేశాలలో దాచుకుని కాటుక దిద్దిన
కలువరేకుల కళ్ళతో ఉషోదయ సూర్యునికై
రెప్పవాల్చని కళ్ళ లోగిళ్ళతో నిరీక్షిస్తుంది ఆమె !

ఆకుపచ్చని చీరను కట్టి అందాల సుమాల
ఇంద్రధనుస్సు రంగుల రవిక తో
నెలవంకను సిగలో తురుముకుని
ఆవలితీరంలో కలవడానికి ఎదురుచూస్తున్న
ప్రియుని కోసం అనుక్షణం నిరీక్షిస్తూనే ఉంటుంది
ఆమె!

తొలకరి జల్లుకు తనువులోని తాపము తగ్గి
తడిసి ముద్దయి పులకరించే పుడమిలా
వర్షపు జల్లుకు తనివితీరా స్నానమాడిన వనితలా
కపటమెరుగని పసిమనసులా తెల్లవారి వెలుగులా
పున్నమి వెన్నెలలా మెరుస్తుంది ఆమె !

ఆవేదనలను అడగకుండానే అవిరళంగా ఇచ్చినా
అన్ని క్షమించి ఆదరించే ఆదిదేవత లా
ఉపకారం, పరోపకారము మాత్రమె తెల్సిన అమ్మలా
మౌనబాష్యమై ప్రాణవాయువై పలకరిస్తుంది ఆమె!

మంచుతెర మేలిముసుగు తొలగిస్తూ
ప్రభాత కిరణాలు పడగానే
తొలిసారి ప్రియునికి మోము చూపే
సిగ్గుల మొగ్గయిన వయ్యారిలా
కరిగిన తుషార బిందువులలో జలకమాడి
పరువపు మేని మెరుపుతో కడిగిన ముత్యమవుతుంది
ఆమె!

నీలిరంగు నింగిలాంటి అందమైన ఆమె లలాటంపై
ప్రభాత భాస్కరుడు సిందూరంలా భాసిస్తాడు!

ఆమె నడయాడిన పదమంజీరాలలో
సెలయేటి గలగలలు వినిపిస్తాయి .

తళుక్కున మెరిసే ఆమె చిరునవ్వులో
నింగిలోని తారల తళుకులు కనిపిస్తాయి .

లయబద్ధంగా కదిలే కర మంజూషాల రవళి లో
మలయసమీరానికి తలలూపే తరువుల
తన్మయత్వం సవ్వడై వినిపిస్తుంది.

ఆమె గొంతులో కోకిల గానం పలుకుతుంది
ఆమె ఆగమనంతో అరవిరిసిన మల్లెల పరిమళం
గుబాళిస్తుంది
ఆమె పలుకుల్లో తొలిపొద్దు న పక్షుల
కిలకిలా రావాలు పల్లవిస్తాయి

ఆదరించినపుడు
నవ్వుల జలపాతంలా
మల్లెపూల సుగంధంలా
మధుమాసపు మకరందంలా
తేనెలొలుకు తెలుగందంలా
చైత్రమాస వసంతంలా

ఆవేశపడినపుడు
సుడిగుండాల సునామీలా
కంపించే భూకంపంలా
ఊపేసే తుఫానులా
ముంచేసే ఉప్పెనలా
పేలే అగ్ని పర్వతంలా
మెరిసి కురిసే పిడుగులా
ప్రళయ కాల భీభత్సంలా
విజృంభించి
పరోపకారమే పరమావధిలా
అనుగ్రహిస్తే అన్న పూర్ణలా
ఆగ్రహిస్తే అపరకాళికలా కనిపించే
ఆమె మరెవరో కాదు
ప్రతి ఒక్కరినీ పరవశింపజేసే
మన ప్రకృతి మాత.

*****

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# స్వాభిమానం!

కుంతి

“విహారి! నీ పద్ధతి నాకేమీ నచ్చడం లేదు. నిన్ను పిచ్చిగా ప్రేమించి వెంబడి పడుతుంటే నన్ను బాగా అవమానిస్తున్నావు” అన్నది గాయత్రి బుగ్గలు ఎర్రబడుతుండగా ఆవేశంతో.

“కూల్ గాయత్రి! ఎందుకు నాపై ఇంతకోపం” ప్రశాంతంగా అన్నాడు నవ్వుతూ విహారి.

“కోపం కాక మరేమిటి? నా మాట తీరును, నా నడతను చాలా సార్లు వెక్కిరించావు. నేనేదైనా మాట్లాడినా, ఎలా నడుచుకున్నా చాలు అందులో దోషాలు వెతుకుతావు”

విహారి, గాయత్రి మాటలను పెద్ద సీరియస్ గా తీసుకోక ఎటో చూస్తుంటే, గాయత్రి విహారి ముఖాన్ని తన వైపుకు తిప్పుకొని,

“నేను పదవ తరగతి తరువాత తెలుగు చదవ లేదు. నాకు భాష సరిగా రాదు. నాకు కొన్ని ఒత్తులు పలకరాదు. కొన్ని పదాలను ఉచ్చరించ లేను. ఒకసారి తొందరలో బాధ్యత అనే బదులు బాద్యత అంటే “ఒత్తుల డబ్బా దగ్గర పెట్టుకొని మాట్లాడు” అని అందరి ముందు అన్నావు.

ఒకసారి విద్యర్థులు అని రాస్తే, “ఆకలేస్తే ఇంకొక ముద్ద అన్నం ఎక్కువగా తిను, దీర్ఘాలను కాదు” అన్నావు. అసలు ఈ మధ్య నీముందు మాట్లాడాలంటేనే బయమేస్తుంది”

“అలా మాట్లాడకు గాయత్రి నాకు భయమేస్తుంది. కాదు...కాదు.. బయమేస్తుంది” అన్నాడు చిలిపిగా.

“బీ సీరియస్! ఇంకొకసారి నేను యేదో తొందరలో నీకేదో విషయం చెప్పబోతే, నేను చెప్పే విషయం పట్టించుకోకుండా, “ఆ ఉచ్చారణ యేమిటి? ఆ వాక్యాలు అలా దోషంగా పలుకుతావెందుకు? అసలు నీవు దీక్షితులు గారి కూతురువేనా?” అన్నావు.

“చూడు గాయత్రి! నాకు తెలుగు భాష అంటే ప్రాణం. ఆ భాషను ఎవరైనా సరిగ్గా రాయక పోయినా, పలకక పోయినా కోపం వస్తుంది. నీవే కాదు ఒకవేళ మా అమ్మ అలా చేసినా కోపం వస్తుంది. నీకు తెలుసు మన ఇళ్ళల్లో పిల్లలు చేసే భాషాదోషాలను, ఉచ్చారణా దోషాలను పెద్ద వాళ్ళు కోప్పడి సవరిస్తారు”

“నీతో బాష ... అదే భాష విషయం లోనే కాదు. ఇంకా చాలా విషయాలలో ఇష్యూస్ ఉన్నాయి” అన్నది కోపంగా

“యేమిటో ఆ ఇష్యూస్ “ అన్నాడు నవ్వుతూ

“ఒకసారి మనం హోటల్ కు వెళ్ళాం. నేను తింటూ తింటూ, కుడి చేయితో సర్వ్ చేసుకున్నాను. నీకు సర్వ్ చేశాను. అపుడు నీవు “అంటూ, ముట్టూ లేదా? ఎంగిలీ మంగలం తెలియదా?” అని కస్సుమన్నావు” అన్నది తలుచుకొని బాధ పడుతూ.

“ నాకు అలా పద్ధతీ, పాడు లేకుండా తినడం నచ్చదు. అయినా కోప్పడినందుకు సారీ చెప్పాను కదా” మ్యాటర్ బాగా సీరియస్ గా అనిపించడం తో, గంభీరంగా పలికాడు విహారి.

“ఒకసారి మనం సినిమాకు వెళ్ళాం. నేను నీ మీద చేయి వేసి దగ్గరగా కూర్చున్నాను. నాకు అప్పుడే పీరియడ్స్ వచ్చాయి. అదే విషయం నీకు చెప్పాను. నన్ను గొంగళి పురుగును విదిల్చనట్లు విదిల్చి, దూరంగా జరిపి, సినిమా మధ్యలోనే బయటికి తీసుకు వచ్చి, ఆటో మాట్లాడించి, ఇంటికి పంపి వేశావు.గుర్తుందా?”

“గుర్తుంది. ఆడ వాళ్ళకు పీరియడ్స్ వస్తే హాయిగా ఒక పక్కకు ఉండి, రెస్ట్ తీసుకోవాలి. అంతే కానీ కలేసి తిరగకూడదు. అందుకే ఆలా చేశాను” మ్యాటర్ మరీ సీరియస్ గా మారడంతో తానూ కాస్తా సీరియస్ గా సమాధానం ఇచ్చాడు.

“నీ ఉద్దేశ్యం యేదైనా నీవు రియాక్ట్ అయిన తీరు మాత్రం నాకు చాలా కోపం తెప్పించింది. ఈ ఆధునిక, యాంత్రిక, ఫాస్ట్ ప్రపంచంలో ఇంకా ఇలాంటి నీ ఆలోచనలు నాకు నచ్చలేదు”

"మనం ఎంత ఎదిగినా మన కుటుంబ సంస్కారం, సంప్రదాయం విడవడం నాకూ నచ్చదు"

"భాషా ఆచారవ్యవహారాల విషయాల్లోనే కాదు చాలా సార్లు, చాలా విషయాలలో నా జీవన విధానాన్ని, నా వ్యక్తిత్వాన్ని కించ పరిచే విధంగా మాట్లాడావు. ఒక సారయితే మరీ ఘోరంగా, ఛాందస సంప్రదాయ కుటుంబాలలోని వాళ్ళు, తమ కంటే కింద కులం వాళ్ళను తిట్టే తిట్టును నామీద ప్రయోగించి, నీవు అలా ప్రవర్తించకు" అన్నావు.

విహారి ఆమె వైపు ప్రేమగా చూస్తూ, యేదో చెప్పబోయాడు.

"నీవు మాట్లాడ వద్దు. నన్ను చెప్పనివ్వు. ఒకసారి మనం గుడికి వెళ్ళాం. అక్కడ పూజారి మంత్రాలు చదువుతుంటే నీవు కూడా గొంతు కలిపావు. పూజలు అయిన తరువాత నీవు నన్ను, "నీకు యే యే స్తోత్రాలు వస్తాయి అన్నావు. దానికి నేను, "నాకు యేవీ రావు" అన్నాను.

నీవు వెంటనే "మీ అమ్మా నాన్న ఎలా పెంచారు. నీవు పుట్టిన కుటుంబ వాతావరణం యేమిటి? నీవు ఇలా యేమిటి?"అన్నావు.

అపుడు నేను "మా అమ్మానాన్నలు ప్రేమగా పెంచారు" అన్నాను. అపుడు నీవు, "అయితే నీకు వాళ్ళు సంస్కృతి సంప్రదాయాలు నేర్పలేదన్న మాట అన్నావు"

"గాయత్రి ! మన ఇళ్ళల్లో పిల్లలకు చదువు సంధ్యలతో పాటు పూజలు పునస్కారాలు నేర్పుతారు. ఆ ఉద్దేశ్యంతో అలా అన్నాను. అన్నీ గుర్తు పెట్టుకొని ఇలా బాధ పడితే ఎలా? అప్పటికప్పుడు అన్నీ మరిచిపోతేనే కదా జీవితం సుఖంగా ఉండేది "

"విహారి! పలు సందర్భాలలో అన్న మాటలు ఎలా మరిచిపోతాను. అవి నా వ్యక్తిత్వానికి, పెంపకానికి సంబంధించినవి అయితే మరీనూ"

విహారి మౌనంగా వింటున్నాడు. గాయత్రి విహారి వైపు చూస్తూ, మళ్ళీ మాటలాడడం ప్రారంభించింది.

"దీనికంతటికి కారణం ఒకటే. నీ చదువును, నీ తెలివితేటలను, నీ ఆకర్షణీయమైన స్వభావాన్ని చూసి నేను నిన్ను పిచ్చిగా ప్రేమించాను. ఇతరుల పట్ల చూపే మర్యాద, మన్ననలను చూసి ఆరాధించాను. కానీ నా విషయం లో మాత్రం నీవు చూపే ప్రవర్తనను చూసి ఆశ్చర్య పోతున్నాను.

నాకు ఈ మధ్య, నీకు అసలు సెక్యూలరిస్టిక్ అండ్ హ్యూమనిస్టిక్ అప్రోచ్ ఉందో లేదో ?

ఈక్వాలిటీ, బ్రాడ్ మైండెడ్ నెస్ భావాలు ఉన్నాయో లేవో? అన్న సందేహం కలుగుతుంది. అంతేకాదు...... నిన్ను ప్రేమించి చాలా పెద్ద తప్పు చేశానా ?అనిపిస్తుంది" అంటూ ఆమె ముఖం కిందికి దించుకుంది.

ఆమె కను కొలుకుల్లోనుండి నీళ్లు దూకడానికి సిద్ధంగా ఉన్నాయి.

విహారి గాయత్రి ముఖం పైకెత్తి, కళ్ళల్లో నీళ్ళు తుడుస్తూ, "గాయత్రి !ప్లీజ్ యేడవ వద్దు. నీకొక విషయం చెప్పాలి. అనునిత్యం సంప్రదాయాల, ఆచార వ్యవహారాల స్మరణ చేసే తాతయ్య, నానమ్మలను, తన విశాలమైన అభ్యుదయ భావాలతో మానాన్న భాగా వ్యతిరేకించాడు.

అందుకే మా తాతయ్యకు మా నాన్నంటే చాలా కోపం. నేను కూడా మా నాన్న లాగా అయిపోతానేమోనని, మా అమ్మా నాన్నలతో పోట్లాడి నన్ను చిన్నప్పటి నుండి తన దగ్గర పెంచుకున్నాడు. ఆయన ఆలోచనలను, భావాలను నాలో నూరి పోసాడు. దానితో నేను కూడా పెద్ద చదువులు, చదివి, పెద్ద ఉద్యోగాన్ని నిర్వహిస్తున్నా, సామాజిక జీవనం లో ఉన్నా, మా తాతయ్య చెప్పే విషయాలలో కొంత వరకు ఉన్న తార్కికత, శాస్త్రీయతను అర్థం చేసుకొని ఆయనను వెంబడించాను. దానితో పాటుగా "పెద్దవాళ్లను వ్యతిరేకించకుండా యేది చెబితే అది చేయాలి" అన్న భావనతో కూడా ఆయన అడుగులో అడుగులు వేశాను. అయితే కులం, గోత్రం, మడి, ఆచారం అంటూ పాకులాడినా, మానవత్వం విషయంలో ఎక్కడా తప్పు చేయలేదు. నా

కులం కాని వాళ్ళను యే రోజు అగౌరవ పరచలేదు. అందరితో స్నేహంగాఉన్నాను. ఎవరికి ఏ కష్టం వచ్చినా కులం, మతం అని చూడకుండా సాయం చేశాను..... నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించాను కాబట్టి, నిన్ను నాకనుగుణంగా, నా కుటుంబానికి అనుగుణంగా లేకపోతే విమర్శించాను కానీ, అలా లేని వాళ్ళను ఎవరిని వేలెత్తి తప్పు పట్టలేదు. అవమానించలేదు. ఒక్కటి మాత్రం నిజం నీవు "నన్ను ప్రేమించాను"ని చెప్పగానే నీలాంటి అందమైన మంచి అమ్మాయి ప్రేమ దొరికినందుకు ఆనందపడ్డాను. గర్వపడ్డాను. కానీ నేను వెంటనే స్పందించలేదు. నీవెప్పుడైతే కోదండ రామాలయ అర్చకులైన దీక్షితుల అమ్మాయివని తెలిసిందో అప్పుడే, "నిన్ను పెళ్లి చేసుకున్నా కులం, గోత్రం విషయం లో ఇబ్బంది లేదు" అని భావించి, నేను నీ ప్రేమను ఆహ్వానించాను. గాఢంగా ప్రేమించాను.

మరొక మాట నీవు దీక్షితుల అమ్మాయివి కాకపోతే బహుశా మన ప్రయాణం ఇంత దూరం వచ్చేది కాదు. నీ వైపు కన్నెత్తి చూడకపోయే వాడిని. నీవు చూపిన ప్రేమకు గౌరవంతో తల వంచి నమస్కరించి తప్పుకునే వాడిని. నీవొకటి గమనించావో లేదో కానీ నేను ఏనాడూ హద్దులు దాటలేదు.

ఇప్పటికీ చెబుతున్నాను. సనాతన చట్రం లో బిగించబడి, మా తాతయ్య భావజాలంలో బంధించబడి, కొన్ని విషయాలలో నేనూ సమ్మతించడం వలన, నిన్ను అపుడపుడు నిందించాను తప్ప ప్రేమ లేక కాదు. అయితే ఒక్కటి మాత్రం నిజం నేను నీ నుండి సంపూర్ణమైన సంప్రదాయ కుటుంబ స్త్రీ లక్షణాలను ఆశిస్తున్నాను. అందులో తప్పులేదు అనుకుంటున్నాను" అన్నాడు విహారి స్థిరంగా.

"అంటే నీవు నన్ను నన్నుగా ప్రేమించలేదు. నేను దీక్షితులగారి అమ్మాయిని కాకపోతే నన్ను, నా ప్రేమను తిరస్కరించేవాడివి అంతేనా...?"

"అంటే... అది ఎలా చెప్పాలంటే......"

"నీవు ఏమీ చెప్పవద్దు. నాకంతా అర్థమయింది....."

"హేయ్! ఏమిటి సీరియస్ డిస్కషన్ లో ఉన్నట్లున్నారు. లంచ్ అవర్ అయిపోవస్తుంది. మీ టిఫిన్ బాక్స్ లు ఓపెన్ కూడా చేసినట్లు లేరు" గాయత్రి , విహారి లకు ప్రాణ మిత్రుడు, వారి ప్రేమవ్యవహారానికి వారధిగా నిలిచిన వాడు, వారు పని చేస్తున్న సంస్థలో పర్సనల్ సెక్షన్ లో పని చేస్తున్న వాడు అయిన ప్రవాళ్ అప్పుడే క్యాంటిన్ లోకి అడుగుపెడుతూ, నవ్వుతూ అన్నాడు.

"నథింగ్ సీరియస్ ! అయినా నీవేమిటి? ఎప్పుడు సెక్షన్ వైపు వచ్చినా గుట్టలు గుట్టలు ఫైల్స్ వేసుకొని కనిపిస్తున్నావు" అన్నాడు విహారి.

" హెడ్ ఆఫీస్ నుండి ప్రమోషన్ డ్యూ ఉన్న ఫైల్స్ అన్నీ త్వరగా క్లియర్ చేసి పంపమని ఉత్తర్వులు వచ్చాయి. దానితో రెండు రోజులుగా విపరీతమైన పని ఒత్తిడితో బిజీగా ఉన్నాను" అన్నాడు ప్రవాళ్ గాయత్రీ బాక్స్ ఓపన్ చేసి, అందులోనుండి ఒక రొట్టెను తుంచి నోటిలో పెట్టుకుంటూ.

"విహారి! నేను వెళతాను. నాకు కొంచెం పని ఉంది. ప్రవాళ్! ఈ బాక్స్ ఖాళీ చేసి మాయింటికి తెచ్చి ఇవ్వు" అంటూ అక్కడి నుండి లేచింది గాయత్రి.

విహారి యేదో చెప్పబోయాడు. వినిపించుకోకుండా గాయత్రి అక్కడి నుండి వెళ్లిపోయింది. గాయత్రి వెళ్ళిపోయిన తరువాత, " నీతో ఒక విషయం మాట్లాడాలి రా" అన్నాడు ప్రవాళ్ గంభీరంగా.

"యే విషయం ?" అన్నాడు విహారి.

"మొన్న మీ అందరి పర్సనల్ ఫైల్స్ చెక్ చేస్తున్నాను. అందరి ఫైల్స్ తో పాటు గాయత్రి ఫైల్ కూడా చెక్ చేశాను. ఒక్కసారిగా ఆశ్చర్య పోయాను"

"యేమిటి...యేమిజరిగింది..?"

"గాయత్రి జనరల్ క్యాటగిరి కాదు. రిజర్వ్డ్ క్యాటగిరి. ఆమెకు ఉద్యోగం కూడా కోటాలో వచ్చింది. వాళ్ళమ్మ పేరు మంగమ్మ . తండ్రి పేరు జానయ్య. గార్డియన్ పేరు మాత్రం వేదాంత దీక్షితులు. నేను మళ్ళీ మళ్ళీ ఆమె ఫైల్ లోని ప్రతి

కాగితాన్ని క్షుణ్ణంగా చెక్ చేశాను. నాకు అర్థం అయినది ఏమిటంటే గాయత్రి దీక్షితుల కూతురు కాదని....

మీ ఇద్దరి ప్రేమను గురించి తెలుసుకొని, ప్రోత్సహించిన మిత్రుడిని నేను. కానీ ఈ విషయం తెలిసిన తరువాత నేను నీకు చెప్పక పోయినా బాగుండదు. మీ పెళ్లి అయిన తరువాత ఈ విషయం బయట పడితే మీ కాపురంలో కలతలు రావచ్చు. అన్ని విషయాలు తెలిసి కూడా దాచిపెట్టానని నామీద నీకు ద్వేషం యేర్పడచ్చు. చెబితే ఒక బాధ, చెప్పకపోతే ఒక బాధ. చెప్పడం వల్ల మీ పెళ్లిని చెడగొట్టిన వాడిని అవుతానేమోనని బాగా కంగారు పడ్డాను. నేను చాలా స్ట్రెస్ అయ్యాను. అందుకే ఒక నిర్ణయానికి వచ్చాను. నిన్న దీక్షితుల గారి ఇంటికి వెళ్ళి ఆయనను కలిశాను"

ప్రవాళ్ మాటలను ఒక ట్రాన్స్ లో, ఒక షాక్ లో వింటున్న విహారి, "ఆ తరువాత యేమి జరిగింది" అన్నట్లుగా చూశాడు.

"రండి! రండి! గాయత్రి ఆఫీస్ నుండి వాళ్ళ ఫ్రెండ్ ఇంటికి వెళతాను అని చెప్పింది" ప్రవాళ్ ను సాదరంగా ఆహ్వానిస్తూ అన్నాడు దీక్షితులు. దీక్షితులు భార్య కామాక్షి ప్రవాళ్ ను ప్రేమగా పలకరిస్తూ, కాఫీ తెచ్చి ఇచ్చి, ఒక పక్కకు కూర్చుంది.

"గాయత్రి లేదని తెలుసు. మీతో మాట్లాడాలని వచ్చాను" నవ్వుతూ అన్నాడు ప్రవాళ్.

కొంచెం ఆశ్చర్యంగా మరియు సందేహంగా "యేమిటి విశేషం ?" అన్నాడు దీక్షితులు.

"నేను, విహారి, గాయత్రి మంచి ఫ్రెండ్స్ అని మీకు తెలుసు. ఆఫీసులో మా స్నేహాన్నిచూసి అందరూ కుళ్లుకుంటారు కూడా" అని ఆగాడు

"ఔనౌను! గాయత్రి, విహారి ల ప్రేమను మా దాకా తీసుకొని వచ్చి వాళ్ళను పెళ్లి పీటల వరకు నడిపిస్తున్నది నీవేకదా" అన్నాడు దీక్షితులు

"వాళ్ళు పెళ్లిచేసుకుంటున్నందుకు ఆనందించే వ్యక్తుల్లో మొదటి వాడిని నేను. అయితే నిన్న ఒక విషయం తెలిసింది. ఆ విషయంలో నాకు పూర్తిగా క్లారిటీ లేకుండా వాళ్ళను పీటలెక్కిస్తే, ఆతరువాత వచ్చే పరిణామాలకు భయపడి, మీతోచర్చిద్దామని వచ్చాను"

"యేమి తెలిసింది "అన్నది కొంచెం జంకుతూ దీక్షితులు భార్య కామాక్షి.

"నేను ఈ మధ్యే పర్సనల్ సెక్షన్ కు బదిలీ అయ్యాను. నిన్న గాయత్రి పర్సనల్ రికార్డ్స్ చెక్ చేస్తుంటే, గాయత్రి రిజర్వ్డ్ క్యాటగిరికీ చెందిన అమ్మాయి అని, ఆ అమ్మాయి తల్లిదండ్రుల పేర్లు మంగమ్మ, జానయ్యలు అని, మీరు ఆమెకు గార్డియన్ మాత్రమే అని తెలిసి వచ్చింది.

ఈ విషయం పెళ్లి అయిన తరువాత తెలిస్తే యేమైన ఇబ్బందులు తలెత్తుతాయేమో అని భయపడి. ముందుగా మిమ్మల్ని కలిసి, వాస్తవాలు తెలుసుకొని, ఈ విషయాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలో ఆలోచించాలని మీ దగ్గరికి వచ్చాను"

దీక్షితులు ప్రవాళ్ మాటలు విని కాసేపు మౌనంగా ఉన్నాడు.

ఆ తరువాత "ప్రవాళ్ ! నిజంగా నీవు ఇపుడు ఈ ప్రస్థావన తెచ్చి, మా గుండెల మీద ఉన్న బరువును దించావు. గాయత్రికి మంచి సంబంధం దొరికింది, మంచి వరుడు దొరికాడు అని సంతోషించాము. కొన్ని రోజుల్లో నిశ్చితార్థం కూడా పెట్టుకున్నాము.

అయితే కొన్ని రోజులుగా గాయత్రి పుట్టు పూర్వోత్తరాలకు సంబంధించిన విషయాన్ని విహారి కుటుంబ సభ్యులకు ఎపుడు, ఎలా చెప్పాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నాము. ఒక వేళ నిజం చెబితే కుదిరిన పెళ్లి ఎక్కడ ఎత్తిపోతుందో అని భయపడుతున్నాము" అని తల దించుకొని కూర్చున్నాడు దీక్షితులు.

"మనమందరం విహారి, గాయత్రిల బాగు కోరే వాళ్ళము. మీరేమీ భయపడకండి. అంతా సవ్యంగా జరిగేట్లు చూద్దాము.

కానీ పెళ్ళికి ముందు సత్యాసత్యాలు అందరికి తెలిస్తే బాగుంటుంది. అంత్య నిష్ఠూరం మంచిది కాదు కదా"

"ఔను ప్రవాళ్ ! అబద్ధం, అసత్యం ఎంతో కాలం నిలువదు. అబద్ధపు పునాదులపైన వివాహపు భవంతులు కడితే యే నాటికైనా కూలే ప్రమాదం ఉంటుంది. నేను ఉన్నది ఉన్నట్లు చెబుతాను. కానీ వాళ్ళ వివాహం మాత్రం జరిగేట్లు చూడాలి. యేమైనా జరిగితే గాయత్రి కళ్ళలో నీళ్ళను చూడలేను" అన్నాడు దీక్షితులు.

"బెటర్ లేట్ దాన్ నెవర్. మీరు జరిగింది చెప్పండి. అందరినీ కన్విన్స్ చేస్తూ ముందుకు పోదాం"

దీక్షితులు కళ్లు మూసుకొని, గత కాలపు విషయాలను నెమరు వేసుకొని క్రమంగా చెప్పడం ప్రారంభించాడు.

" మేము ఇక్కడి వాళ్ళం కాదు. మాది రాజమహేంద్రవరం పక్కన ఉన్న ఒక చిన్న పల్లెటూరు. మాకు అక్కడ చాలా భూములు ఉన్నాయి. మా భూములను జానయ్య అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చాము. జానయ్య దళితుడు. జానయ్య అతని భార్య మంగమ్మ చాలామంచి వాళ్ళు. వాళ్ళకు పెళ్లి కూడా మా నాన్న నే చేశాడు. వాళ్ళు మా యింటికి దగ్గరలోనే ఉండే వారు. వాళ్ళకు అమ్మాయి పుడితే గాయత్రి అని నేనే నామకరణంచేశాను.

మా ఊళ్ళో ఉన్న గుడిలో నేను అర్చకత్వం చేస్తుండేవాడిని. గాయత్రి ఎపుడు, మాయింటిలో లేదా గుడిలో కానీ ఉంటుండేది. మాకు పిల్లలు లేకపోవడం తో నేనూ, కామాక్షి ఆమ్మాయిని బాగా చూసుకునేవాళ్ళము. గాయత్రి అయిదవ తరగతి చదువుతుండగ మంగమ్మ చనిపోయింది. ఆ తరువాత జానయ్య తాగుడుకు బానిసై, కొన్నిరోజులలో అతను కూడా చనిపోయాడు.

గాయత్రిని వాళ్ళ వాళ్లు ఎవరూ పెంచుకోవడానికి ముందుకు రాలేదు. మా ఊరి పెద్దల సమక్షం లో ఆ అమ్మాయిని పెంచుకుంటామని మాట ఇచ్చి, నేను మా ఆవిడ గాయత్రిని మాయింటికి తెచ్చుకున్నాము. కానీ మా పాలి వాళ్ళు కులం కాని పిల్లను పెంచుకుంటున్నామని చెప్పి, మాకు వారసత్వంగా వచ్చిన గుడి అర్చకత్వాన్ని తీసివేయించారు. గుడిని ఆక్రమించుకున్నారు. దానితో మేము చాలా కాలం కిందట ఈ నగరానికి వచ్చి ఈ గుడిని పట్టుకొని, ఇక్కడ స్థిరపడ్డాము. అయితే నా కులం కారణంగా గాయత్రికి భవిష్యత్తులో వచ్చే అవకాశాలు ఎక్కడ పోతాయో అన్న భయంతో, ఆ అమ్మాయి పాత స్కూల్ సర్టిఫికెట్ల తో యిక్కడ కూడా కంటిన్యూ చేయించాము. గాయత్రి బాగా చదువుకుంది. ఉద్యోగం తెచ్చుకుంది. అయితే ఒక్క మాట గాయత్రిని ఇంటికి తెచ్చుకున్న రోజు నుండి ఈరోజు వరకు మేము యేనాడు గాయత్రిని పరాయిగా భావించలేదు. సొంత బిడ్డ కంటే ఎక్కువగా చూసుకున్నాము. మొదట్లో గాయత్రి నన్నూ, నా భార్యను అయ్యగారు, అమ్మగారు అని పిలిచేది. మేమే ఆ పిలుపును మానిపించి అమ్మా, నాన్నా అని పిలవడం అలవాటు చేయించాము. ఈ పాత విషయాలు మేము ఎపుడో మరిచిపోయాము. అదీ జరిగిన సంగతి. గాయత్రి పుట్టుక కారణంగా ఆమె పెళ్లి ఆగ వద్దు. నీవు వాళ్ళ ఇద్దరికీ శ్రేయోభిలాషివి. ఎలాచేస్తావో నీ ఇష్టం. ముందే నేను ఈ విషయం చెపుదామనుకున్నాను. కానీ గాయత్రి పైన ప్రేమ నా నోటిని కట్టి వేసింది" అని వివరించాడు దీక్షితులు.

"అంకుల్! మీరేమీ వర్రీ అవ్వవద్దు. వాస్తవం తెలిసింది కాబట్టి, ఇష్యూను మేనేజ్ చేయటం కష్టం కాదనుకుంటున్నాను. ఈ విషయాన్ని విహారి పేరెంట్స్ దాకా తీసుకొని వెళ్ళి, అన్నీ సవ్యంగా జరిగేట్లు చూస్తాను, నాకు సెలవివ్వండి. ఆ అన్నట్లు నేను ఇక్కడికి వచ్చినట్లు గాయత్రికి చెప్పకండి' అంటూ ప్రవాళ్ అక్కడి నుండి బయలు దేరాడు.

.........................................

"అదీసంగతి" అంటూ విహారి వైపు చూశాడు.

'ఎంత పని జరిగింది. గాయత్రి ఒక్కమాట కూడా నాతో చెప్పలేదు. నన్ను మోసం చేసిందా? అనిపిస్తుంది. ఇపుడు మా తాతయ్యకు ఈ విషయం ఎలా చెప్పాలి? "

"విహారి! గాయత్రి నిన్ను పిచ్చిగా ప్రేమించింది. నీవేమో చాదస్తపు చట్రం లో ఉండిపోయి, చీటికి మాటికి ఆమెని ఇన్సల్ట్

చేస్తూ వచ్చావు. అసలే చిన్న చిన్న వాటికి సీరియసయ్యే వాడివి. ఆమె తన గత జీవితం గురించి చెబితే యేమౌతుందో అని భయపడి నీకు వాస్తవం చెపకుండా ఉండి ఉండవచ్చు"

"ప్రేమలోకి దిగే ముందే చాలా సార్లు పరిపరి విధాలా ఆలోచించి ప్రేమలోకి దిగాను. ఇలా జరిగిందేమిట్రా? ఇపుడు కులం కానీ అమ్మాయిని ఎలా పెళ్లిచేసుకోను "

"ఒరేయ్ ఫూల్! గాయత్రి చాలామంచి అమ్మాయి. చదువుకున్నది.ఉద్యోగం చేస్తున్నది. అంద మైనది. అన్నిటికీ మించి నిన్ను ప్రేమిస్తున్నది. ప్రేమించే ఆడది భార్య గా దొరకడం కన్నా మగాడికి మరొక అదృష్టం లేదు. అవుట్ డేటెడ్, నాసిరకం ఆలోచనలు మానేసి ఆమెను హాయిగా స్వీకరించు. మరొక విషయం గాయత్రి మోసం చేసింది అని ఆలోచిస్తూ, ఆమె పైన విరుచుక పడకు. అలాగే నీవేదో ఆ అమ్మాయిని ఉద్ధరిస్తున్నావు, ఆదర్శం పాటిస్తున్నావు అనుకోని గాయత్రిని చేరదీయకు. ఆమె ప్రేమను, ఆమె పైన నీకున్న ప్రేమను అర్థం చేసుకొని ఆమెను చేపట్టు. బాగా ఆలోచించుకొని, నీను ఇంతకు ముందు ఎలా ఆమెను ప్రేమిస్తున్నావో అలాగే ప్రేమించు. అపుడే నీ చదువుకు, సంస్కారానికి అర్థం, పరమార్థం.

ఈ వాస్తవాలను నేను ఎందుకు వెలికి తీశానంటే మీకు భవిష్యత్తులో యే ఇబ్బందులు తలెత్తకుండా ఉండడం కోసం. గాయత్రి అనే అదృష్టలక్ష్మి నీ తలుపు తట్టి నీ ఇంటి ముందు నిలబడి ఉంది. తలుపు తెరిచి ఆహ్వానిస్తావో, పిచ్చి తలపులతో తలుపులు బిగించుకుంటావో నీ ఇష్టం" అన్నాడు ప్రవాళ్

విహారికి యేమి చేయాలో పాలుపోలేదు. ముందుగా తనతో స్నేహంగా ప్రవర్తిల్లే తన తండ్రికి ఈ విషయం చెప్పాలి అనుకున్నాడు. కానీ యేదో హడావిడిలో ఇంటి వాళ్ళతో గాయత్రి విషయం పంచుకోలేకపోయాడు.

రెండు రోజులు గడిచాయి. గాయత్రి ఫోన్ చేస్తున్నా రిసీవ్ చేసుకోవడం లేదు. పైగా తిక్క తిక్కగా మెసేజ్ లు చేశాడు. ఆఫీసుకు కూడా వెళ్లడం లేదు. మనసులో చెప్పలేని మదనం తో బాధ పడసాగాడు. తండ్రితో ఎలాగైనా ఈ విషయం చెపుదామని ఎదురు చూస్తున్నాడు. ఆ సమయం రానే వచ్చింది.

.........................................

"నాన్న! మీకోక విషయం చెప్పాలి" అన్నాడు విహారి యేదో హడావిడిలో ఉన్న తండ్రి తో.

" ముందుగా మనం ఒక చోటికి వెళ్ళాలి. నీవు కూడా నాతో బయలుదేరు" అన్నాడు విహారి తండ్రి సేనాపతి.

ఇద్దరూ కారులో బయలుదేరారు. దారి పొడుగునా విహారి, సేనాపతినిఎక్కడికి వెళుతున్నాము ?ఎవరిని కలవబోతున్నాము ? అని ఎన్ని ప్రశ్నలు వేసినా, "చెబుతా...చెబుతా.. అంటున్నాడు తప్ప ఏ విషయం చెప్పడం లేదు.

కానీ తాను మాత్రం తమ ప్రేమ వివాహానికి వచ్చిన అడ్డు గురించి, దానికి కారణమైన గాయత్రి పుట్టుక గురించి, బయట పడిన నిజాల గురించి, తాను పడుతున్న మధనం గురించి అంతా తండ్రికి వివరించాడు.

వారు భద్రాచలం అడవుల్లోని ఒక మారు మూల ప్రాంతం లో ఉన్న ఒక గిరిజన గూడేనికి చేరుకున్నారు. సేనాపతి దారి చెబుతూ ఉంటే, విహారి ఆ గిరిజన గూడెం లో ఉన్న ఒక ఇంటి వైపు కారును తీసుకు వెళ్ళి, ఆపాడు. ఇద్దరూ కారు దిగి ఆ ఇంటిలోకి వెళ్లారు.

అక్కడ ఒక మహిళ చనిపోయి ఉంది. సేనాపతి దగ్గర ఉండి ఆమె అంత్య క్రియలు జరిపించాడు. తిరుగు ప్రయాణం అవుతూ, సేనాపతి ఆమె కొడుకు చేతిలో కొంత డబ్బు పెట్టాడు. విహారి అతడిని గమనించాడు. అతను దాదాపు తన వయసులోనే ఉన్నాడు. తిరుగు ప్రయాణం లో మరలా విహారి, "ఇంతకీ ఆమె ఎవరు? మనం ఇక్కడికి ఎందుకు వచ్చాం?" అంటూ మళ్ళీ ప్రశ్నల వర్షం గుప్పించాడు. సేనాపతి చెప్పడం ప్రారంభించాడు.

"దాదాపు ముప్పై సంవత్సరాలక్రితం క్రిందటి మాట. నేను ఈ అడవుల్లోనే ఫారెస్ట్ ఆఫీసర్ గా పని చేశాను. నాకు అప్పట్లో ఇక్కడ చుట్టు పక్కల ఉన్న అన్నీ గ్రామాలలోని ప్రజలతో మంచి పరిచయాలు ఉండేవి. నేను ఇక్కడి వాళ్ళతో పూర్తిగా కలిసి వాళ్ళ ఇళ్ళల్లో తింటూ, వాళ్ళ మనిషిగా ఉండే వాడిని. అప్పుడప్పుడు మన ఇంటిలో వాళ్ళకు సహపంక్తి భోజనాలు యేర్పాటు చేసే వాణ్ణి. ఇది మీ తాతయ్యకు నచ్చకపోయేది. దానితో నా పైన కోపం తో మీ తాతయ్య మన ఇంటి లో ఉండక తన ఊరుకు వెళ్లిపోయాడు.

ఇది ఇలా ఉండగా నీవు మీ అమ్మ కడుపులో ఉండగా ఒక సంఘటన జరిగింది. మీ అమ్మకు నెలలు నిండాయి. మీ అమ్మను తీసుకొని పట్నానికి బయలు దేరాను. నేను పని చేస్తున్న గ్రామం నుండి ఈ గ్రామానికి చేరుకున్న సమయంలో, నా కారు చెడి పోయింది. ఒక పక్కకుంభవృష్టి. చీకటి. అంతలో ఇపుడు చనిపోయిందే రాంబాయమ్మ. ఆమె నన్ను, మీ అమ్మను ఆ పరిస్థితిలో చూసి తన గుడిసె నుండి పరుగెత్తుకొని వచ్చింది. ఆమె మమ్మల్నితన గుడిసెలోకి తీసుకు వెళ్లింది. మీ అమ్మకు కాన్పు చేసింది. అంత బాగానే జరుగుతుంది అనుకున్నంతలో, మీ అమ్మ స్పృహ తప్పి పోయింది. ఆ రాత్రి మీ అమ్మకు ఆమె బాగా సపర్యలు చేసింది. తెల్లవారి మీ అమ్మను దగ్గరలో ఉన్న టవున్ లో హాస్పిటల్ లో చేర్చాను. కానీ మీ అమ్మ చాలా రోజులు మంచం పట్టింది. మీ అమ్మకు స్వస్థత చేకూరే వరకు అంటే దాదాపు మూడు నెలల రోజుల పాటు నీకు ఆ రాంబాయమ్మ తన పాలు ఇచ్చి పెంచింది. నీ ఆలనా పాలనా చూసింది. ఇపుడు నేను డబ్బులు ఇచ్చానే, వాడు కూడా అపుడు చంటి పిల్లవాడు. వాడిని, నిన్ను ఒక్కతీరు గా చూసుకున్నది. అయితే నీవు పుట్టిన కొన్ని నెలల తరువాత మీ తాతయ్య నన్ను కులభ్రష్టుడని, ఆచారాలను ధ్వంసం చేస్తున్నానని నిందించి, నాతో మీ అమ్మ తో పోట్లాడి నిన్ను తన దగ్గరికి తీసుకొని పోయాడు. మీ తాతయ్య ఈ కుల పట్టింపులు, చాదస్తాల విషయం లో తప్ప మిగిలిన విషయాలలో మంచి వాడే. సరే పెద్దమనిషిని ఎందుకు బాధ పెట్టడమని, నిన్ను తీసుకుపోయి తన దగ్గర ఉంచుకొని పెంచుకుంటున్నా మేము అభ్యంతర పెట్టలేదు. మేము అప్పుడప్పుడు నీ దగ్గరికి వచ్చి చూసుకొని వెళుతుంటే వాళ్ళము.

రాంబాయమ్మ నిన్ను కొన్ని రోజుల పాటు పాలు తాగించి పెంచినందు వల్ల, నీ మీద ప్రేమ పెంచుకొన్నది. ఎప్పుడూ నీ గురించి అడుగుతుండేది. నీవూ మీ తాతయ్య మాదిరిగా అనిపించడంతో ఎందుకులే చెప్పడం అని ఊరుకున్నాను. అయితే ఆమెను ఇప్పటికైనా పరిచయం చేయకపోతే పొరపాటు అవుతుందని నిన్ను ఇక్కడికి తీసుకొని వచ్చాను. ఇదీ జరిగిన కథ" వివరించాడు సేనాపతి.

సేనాపతి చెప్పినది విన్న విహారి కి ఒక్కసారిగా రాంబాయమ్మ పై అభిమానం, కృతజ్ఞతా భావం కలిగింది. కార్ నడుపుతూనే మనసులో ఆమెకు జోతలు అర్పించాడు. మౌనంగా కారు నడుపుతున్నాడు.

సేనాపతి కార్ సీటు వెనక్కి వాలి, రిలాక్స్ అవుతూ, "గాయత్రి తక్కువ కులంలో పుడితే పుట్టి ఉండవచ్చు. నీవు సంప్రదాయ కుటుంబంలో పుట్టినా కొంత కాలం నీవు కూడా గిరిజన స్త్రీ సంరక్షణ లో పెరిగావు. ఆమె తిన్న ఆహారం ఆమె రక్తంలో కలిసి పాలుగా మారి నీకు జవసత్వాలను నింపాయి. ఒకవేళ గాయత్రి పుట్టుకతో చెడినట్లైతే, నీవూ చెడినట్లే. అయినా ఇంత చదువూ చదువుకొని, శాస్త్ర జ్ఞానం సంపాదించుకొని, పరిశోధనా సంస్థల్లో పని చేస్తూ మానవత్వానికి, మంచితనానికి విలువనియ్యక పుట్టుకకు, పుట్టుకతో ముడిపడి ఉన్న కులానికి ప్రాధాన్యత ఇవ్వడం మూర్ఖత్వం. మీ తాతయ్య మంచి వాడే కావచ్చు. కానీ ఆయన మతం నుండి ఆధ్యాత్మికత వరకు వెళ్లలేదు. సంకుచిత ఆలోచనల చట్రాలలో బందీ గానే ఉండిపోయాడు. నీవైనా దాని నుండి బయటపడి మానవత్వాన్ని, విశాలమైన ప్రేమ తత్వాన్ని అర్థం చేసుకో" అంటూ ముగించాడు.

ఆ మాటలు విన్న విహారి ఆలోచనల్లో పడిపోయాడు. తాను బ్రాహ్మణ కులంలో పుట్టినా ఒక అబ్రాహ్మణ స్త్రీస్తన్యం గ్రోలి బతికి బట్ట కట్టాడు. గాయత్రి అబ్రాహ్మణ కులం లో పుట్టినా బ్రాహ్మణ కుటుంబ పెంపకంలో పెంచి పోషించబడింది.

తాను తాతయ్య పెంపకంలో పెరగడం వలన ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు నేర్చుకోగలిగాడు. కానీ గాయత్రి పుట్టుకతో కాక కొంత ఆలస్యంగా బ్రాహ్మణ కుటుంబంలోకి చేరడం వల్ల, పైగా దీక్షితులు కేవలం వృత్తి రీత్యా తప్ప, పెద్దగా కులాచారాలను పాటించకపోవడం వల్ల గాయత్రికి ఆచార వ్యవహారాలు అంతంత మాత్రమే వంటపట్టాయి. అంటే కులాచారాలు, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు అర్థంచేసుకొని ఆచరణలో పాటిస్తే ఎవరికైనా వంట బడితాయి. కానీ కేవలం ఒక కులం కలిగిన తండ్రికి పుట్టడం వల్ల కానీ పెంచడం వల్ల కానీ రావు. ఒక నిబద్ధుడైన సత్యాచారి తన పిల్లలకు  సత్యమార్గం తెలిపితే, పిల్లలు కూడా సత్యవాదులు అవుతారు. కానీ ఒక వ్యక్తి సత్యవాది అయినంత మాత్రాన ఆ యింటిలో పిల్లలు సత్యవాదులు కారు. పుట్టుకకు, పెంపకానికి సంబంధం లేదు. గాయత్రి అబ్రాహ్మణ కుటుంబం లో పుట్టినా దీక్షితుల ఇంటిలో పెరిగి పూర్తిగా కాకున్నా, కొంత సంప్రదాయాన్ని ఒంట పట్టించుకున్నది. ఒక వేళ దీక్షితులు కామాక్షమ్మలు కూడా తన తాతయ్య లాగా దగ్గర ఉండి అన్నీ నేర్పిస్తే తాను కూడా తన ఆలోచనలకు దగ్గరగా ఉండేది. ఈ వ్యత్యాసాలు ప్రదర్శించకపోయేది. అయినా......ఇపుడు నేనీ ఆలోచనలు మానుకోవాలి. ముఖ్యంగా నేనిప్పుడు గాయత్రి పుట్టుక గురించి ఆలోచించకుండా ఆమెలోని ప్రేమ తత్వాన్ని ఆహ్వానించాలి. దాని కన్నా ముందుగా ఇన్ని రోజులు ఆమెను అవమానించి నందుకు క్షమించమని అడగాలి.

అంతే కాదు గాయత్రి కూడా తన భావాలను అర్థం చేసుకొని సంప్రదాయాలను, పూర్తిగా ఆచరణలోకి తీసుకొని వస్తే తాతయ్యను కూడా సంతోష పెట్టవచ్చు.....” ఇలా విహారి ఆలోచనల్లో కొట్టుకుపోతూ డ్రైవ్ చేస్తుండగా, విహారి ఆలోచనలను చేదిస్తూ ఫోన్ రింగ్ అయింది. గాయత్రి నుండి ఫోన్. వెంటనే విహారి, “సారీ గాయత్రి! నన్ను క్షమించు. నీతో మూర్ఖంగా ప్రవర్తించాను. నీ ఫోన్ కూడా రిసీవ్ చేయలేదు. పైగా నీ పుట్టుకను గురించి తెలుసుకొని, నీ ప్రేమను, నిన్నూ తిరస్కరిస్తూ మెసేజ్ చేశాను. కానీ ఈ రోజే కులం కన్నా మానవత్వం ఎంత గొప్పదో తెలుసుకున్నాను. నీలో ఉన్న ప్రేమతత్వాన్ని కూడా అర్థం చేసుకున్నాను. నీవు నాకు కావాలి. మా తాతయ్యను ఒప్పిస్తాను. రేపే మీ ఇంటికి వచ్చి నిన్ను కలుస్తాను” అన్నాడు

“విహారి! నీవు ఇపుడు మానవత్వం, ప్రేమ తత్వం అంటూ మాట్లాడుతున్నావు. కానీ ప్రతి వ్యక్తికి స్వాభిమానం అంటూ ఒకటి ఉంటుందన్న విషయం మరిచిపోయావు. ఇపుడు నీలో రియలైజేషన్ వచ్చినట్లే, నాలో కూడా రియలైజేషన్ వచ్చింది. నేను నిన్ను మరిచిపోతాను. నీవు కూడా ఆ ప్రయత్నం లో ఉండు. ఈ విషయం చెప్పాలనే నీకు ఫోన్ చేస్తుంటే, నీవు రిసీవు చేసుకోక మెసేజ్ లు పెడుతున్నావు. నేనూ మెసేజ్ పెట్టవచ్చు. కానీ నీకిచ్చే మెసేజ్ మౌఖికంగా ఇవ్వాలని ఫోన్ చేసే ప్రయత్నం చేశాను.

ఇంకొక విషయం చెప్పాలి. నేను నిన్ను ప్రేమించాను కాబట్టి నిన్ను క్షమిస్తాను. కానీ అందరూ ఆ పని చేయలేరు. త్వరగా ఆ పిచ్చి చాదస్తాలు, ప్రేలాపనలు మానుకో లేదా కేసుల్లో ఇరుక్కుంటావు ”అని ఫోన్ పెట్టేసింది.

విహారి ఫోన్ పెట్టేసి తండ్రితో జరిగింది చెప్పాడు. సేనాపతి గట్టిగా ఊపిరి పీల్చుకొని, ”గాయత్రి స్వాభిమానం గాయపడింది. ఇంకా నీవు ఆ అమ్మాయి ప్రేమను పొందలేవు. బెటర్ యూ ఫర్గెట్ హర్. అయినా విషపూరితమైన విత్తనాలు నాటితే మంచి మొక్కలు ఎలా వస్తాయి.” అన్నాడు బాధగా కళ్ళు మూసుకుంటూ.

విహారి మనసు బాధతో మూల్గుతుండగా, తాను చేసిన తప్పులకు పశ్చాత్తాపపడుతూ కార్ ముందుకు పోనిచ్చాడు.

.............

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# కళ్యాణమే వైభోగము

బద్రి నర్సన్

మాలతికి పెళ్లి సందడి అంటే చాలా ఇష్టం. ఏ పెళ్ళికెళ్ళినా సరాసరి మండపంలోకి చొరబడి పెళ్లికూతురు వెనకాల అమ్మలక్కల మధ్యన సర్దుకుంటుంది. పెళ్లి కొడుకును కల్యాణ మండపానికి తెచ్చే కార్యక్రమం నుంచి పెళ్లికూతురు అప్పగింతలు దాకా ఆ పెళ్లిలో లీనమైపోతుంది. వయసు పన్నెండేళ్లయినా చూసిన ప్రతిపెళ్ళి గురించి సినిమా కథలా పూస గుచ్చినట్లు భావోద్వేగాలు పండించి మరి చెబుతుంది. 'అందరి పెళ్ళిళ్ళను ఇంత వర్ణించి చెప్తావు, మరి నీ పెళ్లి గురించి ఎవరు చెప్తారు?' అని ఎవరైనా అడిగితే 'ఇంకొకరెందుకు? నా అంత బాగా చెప్పడం వారికి రావాలి కదా! ఆ ఛాన్సు ఎవరికీ ఇవ్వను. నేనే చెప్పుకుంటాను. ' అని గలా గలా నవ్వుతుంది.

పెళ్లిలో అమ్మాయి ఏ ఏ సందర్భంలో ఏ చీర కట్టిందీ, అది ఎలా నప్పిందీ, చీర కలర్, డిజైన్, బోర్డర్ ఎలా ఉన్నాయీ, ఇంకా ఎలా ఉంటే బాగుండేదీ ఇలా బట్టల సంగతి కూడా మాలతికి బాగా తెలుసు. అందుకే పట్టణంలో పెళ్లిబట్టలు కొనేందుకు వెళితే మాలతిని బొట్టు పెట్టి పిలుస్తుంటారు. పగటి పెళ్ళికి, రాత్రి పెళ్ళికి చీరలు ఎలా ఉంటే బాగుంటుందో, వీడియోల్లో అవి ఎలా మెరిసిపోతాయో చెప్పే తెలివి కూడా మాలతికి ఉంది.

ఇంత గొప్పగా చెప్పినా మాలతి వాళ్లది పేద కుటుంబమే. మాలతి తండ్రి బట్టల దుకాణంలో గుమస్తాగా పని చేస్తాడు. తల్లి ఇంట్లోనే బీడీలు చుట్టుతుంది. వారికి ఆలస్యంగా పుట్టిన ఏకైక సంతానం మాలతి. ఇల్లిల్లు తిరుగుతూ సరదా ముచ్చట్లు చెప్పే మాలతి పది తరగతి పాసయి ఇంటర్ లో చేరింది.

పెద్ద బడి. కావలసినంత మంది దోస్తులు. ముచ్చట్లు చెప్పేందుకు, వినేందుకు కొదువే లేదు. మాలతికి కబుర్ల కోసం ఆడ మగ ఎవరైనా ఒకటే, పరిచయమైతే చాలు. ఓ రోజు కాలేజీ వెళ్లే దారిలో వెనుక నుంచి సైకిలుపై వచ్చిన సంతోష్ పక్కన ఆగి సైకిలు దిగాడు.

'మాలతీ! కాలేజీకేనా?' అన్నాడు.

'చేతిలో పుస్తకాలు పట్టుకొని పేరంటానికెళ్తానా?' అంది నవ్వుతూ.

ఇళ్లన్నీ దాటి ఇద్దరు కాలేజీ గ్రౌండ్ లోకి వచ్చారు.

'నీ నవ్వు బాగుంటది'

'నన్ను చిన్నప్పటి నుండి చూస్తున్నావ్.. ఇప్పుడు తెలిసిందా ఈ సంగతి!' అంది నవ్వుతూనే.

'ఇంటర్ లోకి వచ్చినాక నీ నవ్వు మరీ అందంగా మారింది' అన్నాడు.

ఆ మాట వినగానే ఆగలేక మళ్ళీ గలగలా నవ్వింది.

'నవ్వు కూడా మంచిగా చెడ్డగా ఉంటదా?' అంది నవ్వాపుకుంటూ.

'నా నవ్వు ఎట్లుంటది?' అన్నాడు సంతోష్.

'నవ్వు నవ్వే.. నవ్వొస్తే నవ్వుతాం. అంతే!' అని చేతులూపింది.

ఇలా మాలతి ఒంటరిగా కనబడ్డప్పుడల్లా ఆమెను పలకరిస్తూ నవ్విస్తూ వెంటపడడం సంతోష్ కు అలవాటైంది. ఆ అవకాశం కోసం ఎప్పుడు కాచుకొని ఉండేవాడు. ఓ రోజు మాటల్లోనే - 'కరీంనగర్ లో పెళ్ళి సందడి సినిమా నడుస్తుంది. వెళ్దామా?' అన్నాడు సంతోష్. సినిమాలంటే మాలతికి ఇష్టమే. కానీ అలా చాటు మాటుగా వెళ్లడమంటే భయం అనిపించింది. వెంటనే 'వద్దు' అన్నట్లు తలూపింది. 'మ్యాట్నీ షోకి వెళితే ఎవ్వరికీ తెలియదు. నేను ఎన్నో సినిమాలు అలాగే చూశాను. నీక్కూడా సినిమాలంటే ఇష్టం కదాని అడిగాను. నీవు రాకున్నా రేపు నేను ఒక్కణ్ణే వెళ్తా.. ఆలోచించుకో!' అంటూ సంతోష్ క్లాసు రూమ్ రావడంతో దూరం జరిగాడు.

రాత్రంతా ఆలోచించిన మాలతికి ఇంట్లో చెప్పకుండా సినిమాకు వెళ్లడం తప్పే కానీ సినిమా పేరే పెళ్లి సందడి. ఈ ఒక్కసారికి తప్పదన్నట్లు సంతోష్ తో వెళ్లేందుకు మనసు మొగ్గు చూపింది.

మర్నాడు కాలేజీ దారిలో సంతోష్ కనబడగానే 'సినిమాకు వెళ్దామా?' గుసగుసగా అంది.

పెళ్లి సందడి తో మొదలైన వారి సినిమా ప్రయాణం ప్రేమించుకుందాం రా!, పెళ్లి చేసుకుందాం! దాక సాగింది.

ఇంటర్మీడియట్ పూర్తవడానికి పరీక్షలే మిగిలున్నాయి. పరీక్షలయ్యాక ఫలితాలు ఎలా ఉన్న మాలతి చదువు ఇంతటితో ఆగిపోతుంది. ఎవరో బంధువుల అబ్బాయికిచ్చి స్తోమతకు తగ్గ ఖర్చుతో పెళ్లి చేసి మాలతిని సాగనంపాలనే ఆలోచనలో ఆమె అమ్మ నాన్నలున్నారు.

మాలతి సంతోష్ ల చాటుమాటు చివరి సినిమా పేరు పరుగు. సినిమా చూస్తున్నంత సేపు ప్రేమికుల కష్టాలు చూసి ఇద్దరు తెగ బాధ పడిపోయారు. మరో వైపు మళ్ళీ ఎప్పుడు, ఎలా కలుస్తామా అనే బెంగ ఇద్దరినీ కలచివేసింది. సంతోష్ కరీంనగర్ లో డిగ్రీలో చేరిపోయాడు. మాలతికి పెళ్లి సంబంధాల వేట ముమ్మరమైంది.

తమ ప్రేమను నిలబెట్టుకునేందుకు ఓ రోజు ధైర్యం చేసి సంతోష్ తన ఇంట్లో మాలతిని పెళ్లి చేసుకుంటానన్నాడు. ఆ మాట వినగానే నారాయణ ముందు కొడుకు చెంప చెళ్లుమనిపించాడు.

ఆనక 'నీకు తలకాయ ఖరాబైందారా! ఇరువై ఇండ్లు కూడా రాలేదు పెళ్లి చేసుకుంటవా! అదీ మన దుకాన్ల పనిచేసే గుమస్తా బిడ్డను. దాన్ని చేసుకొని వానింటికి అల్లుడిగా పోతవా.. ఎవరన్నా వింటే మానం పోతది' అని నోటికొచ్చినట్లు తిట్టాడు.

ఈ విషయమంతా చెప్పగానే 'ఈ గొడవలన్నీ వద్దు. నేను మా వాళ్ళు చూసిన పిల్లవాణ్ణి చేసుకుంటాను' అంది మాలతి మనస్ఫూర్తిగా.

'ఇలా అయితే కుదురదు. మనం లేచి పోదాం!' అన్నాడు సంతోష్.

'లేచిపోతే నా పెళ్లి ఎలా జరుగుతుంది?' అంది మాలతి, పెళ్లి సంప్రదాయంగా జరగదనే బెంగతో.

'నీ పెళ్లి పిచ్చి పాడుగాను. ముందు బయట పడ్డాక ఎక్కడో గుళ్లో చేసుకుందాం. సరేనా!' అన్నాడు సంతోష్.

'అట్లా వద్దు. ఊర్లో అన్ని పెళ్లిళ్లలా మన పెళ్లి కూడా జరగాలి'

'మన పెళ్లి అక్షింతలతో కాదు. బడిత పూజతో చేస్తాడు మా నాన్న. అర్థమైందా!'

'మా నాన్న పెళ్లి మీ ఇంట్లో అడుగుతాడు. ఒప్పుకోకుంటే చేతులెత్తి బతిమాలుతాడు' అంది.

'చేతులెత్తి కాదు.. గొంతు కోసుకుంటానన్నా మా నాన్న ఒప్పుకోడు. తెల్సా!'

'మా అమ్మ నాన్నలకైనా చెబుతాను' అంది అమాయకంగా.

'పిచ్చిదానా! చెప్పగానే సరే బిడ్డ అంటారనుకున్నావా.. కాళ్ళు చేతులు కట్టేసి ఇంట్లో పడేస్తారు. నీ మారాంలు ఇక్కడ పనికి రావు'

'మరి నా పెళ్లి?' అని మొదటికొచ్చింది మాలతి.

ఆ మాట వినగానే తల పట్టుకున్న సంతోష్ ' ముందు బయట పడదాం. ఆ తర్వాత అన్ని ఆలోచిద్దాం. సరేనా!' అన్నాడు. ఊర్లోంచి అలా ఒకరోజు ఆ ప్రేమపక్షుల జంట ఎగిరిపోయింది.

*** ***

సంతోష్ ఇంట్లో ఉన్న సొమ్మునంతా సర్దుకొని వచ్చినందువల్ల వారికి డబ్బు సమస్యలేదు. హైదరాబాద్ లో ఓ చిన్న లాడ్జిలో దిగారు. 'మా బంధువుల అమ్మాయి. పరీక్షలు రాసేందుకు తోడుగా వచ్చాను' అని చిన్న అబద్ధంతో పెద్ద సమస్య గట్టెక్కించాడు.

హోటల్లో భోజనాలు చేస్తుండగా బయట బొమ్మరిల్లు పోస్టర్ కనిపించగానే ' బొమ్మరిల్లు సినిమా కెల్దామా?' అంది మాలతి. 'సరే.. ఫస్ట్ షో కెళ్దాం. తలనొప్పిగా ఉంది. ముందు రెస్ట్ తీసుకుందాం!' అని రూము వైపు నడిచాడు సంతోష్.

రెస్ట్, ఫస్ట్ షో, డిన్నర్ అన్ని అయ్యాయి. దార్లో మాలతికి తెలియకుండా మల్లె పూలు తీసుకున్నాడు సంతోష్.

రూములోకి వచ్చాక ఫ్రెష్ అయి బట్టలు మార్చుకున్నాక సంతోష్ మల్లె పూల వాసన చూస్తూ మాలతి చేతిలో పెట్టాడు.

'ఇదేందీ! మనకేమైనా పెళ్లైందనుకుంటున్నావా! ఏవేవో ఏర్పాట్లు చేస్తున్నట్లున్నావ్!' అని పూలను పక్కన పెట్టింది.

'రెండ్రోజుల్లో మా ఫ్రెండ్స్ ని పిలుస్తాను. గుళ్లో పెళ్ళి చేసుకుందాం!' అన్నాడు అంతా ఒకేసే కదా అన్నట్లు.

'అదేం లేదు. నా పెళ్లి.. అదే మన పెళ్లి మన ఊర్లో మన వాళ్ళ మధ్యన జరగాలి. అంతే!' అని మొండిగా అంది మాలతి.

'అదెట్లయితది? ఇద్దరినీ కొట్టి చంపుతారు.'

'ఏమైనా కానీ.. ఊరంతా ఆశీర్వదించి, భోజనాలు చేసి, అప్పగింతలు చేస్తేనే మన పెళ్లి అయినట్లు. ఆ తర్వాతే ఏదైనా! ' అంది మూతి ముడుస్తూ.

'మనిద్దరం ఇప్పటికైనా ఎప్పటికైనా ఆలు మగలమే కదా.. కలిసి పడుకుంటే ఏమైతది?' అన్నాడు సముదాయింపుగా దగ్గరవుతూ సంతోష్.

వెంటనే దూరం జరిగిన మాలతి 'పెళ్ళికి ముందు శోభనం మహా పాపం. అయ్యవారి మంత్రాలు వినలేదా! పిల్ల తండ్రి అబ్బాయి కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తేనే పిల్లను తాకే హక్కు వస్తుందన్నారు. అది జరిగాకే నీవు నన్ను తాకాలి' అంది శాస్త్రాలు తెలిసినట్లు.

'పెళ్లిళ్లు చూసి చూసి నీ మెదడు వాటి తోటే నిండి పోయింది. కుక్క తోక వంకర లాగా ఎంత చెప్పినా చివరకు కథ అక్కడికే వస్తోంది.' అన్నాడు విసుగ్గా.

ఆ మాటలకు మాలతిలో ఉలుకు పలుకు లేదు. తన తీర్పు అమలు కావలసిందే అన్నట్లుంది ఆమె వైఖరి.

ఈ బ్రహ్మచారి బతుకు తప్పేలా లేదని, మాలతిని మరీ ఒత్తిడి చేసి బాధ పెట్టొద్దని అనుకున్నాడు సంతోష్. వారం తరువాత - 'ఎన్నాళ్ళు ఇక్కడే ఉందాం.. బయట రూము తీసుకుందాం.. నేను సిల్క్ మందిర్ లో పని చేస్తాను. నీవు చదువుకో!' అంది మాలతి.

'నిజమే మంచి ఆలోచన. ఒక్క పెళ్లి గోల తప్ప మిగితా వాటిలో నీ బుర్ర బాగా పనిచేస్తుంది' అన్నాడు సంతోష్.

మాలతికి పెళ్లి బట్టలపై ఉన్న జ్ఞానానికి మెచ్చి అడగ్గానే ఆమెను ఉద్యోగంలోకి తీసుకోని పట్టు చీరల సెక్షన్ లో పని ఇచ్చాడు సిల్క్ మందిర్ యజమాని రామేశ్వరరావు. చీరల అమ్మకాలపై కమిషన్ కూడా ఇస్తామన్నాడు. ఇంత తేలిగ్గ నచ్చిన ఉద్యోగం దొరకడంతో తెగ సంబరపడి ఇక తన సత్తా చూపించాలనుకుంది మాలతి.

దగ్గర్లోనే ఓ కిరాయి గదిలోకి మారాక సంతోష్ కాలేజీలో చేరిపోయాడు. వీధిలో దగ్గరి కుటుంబాలకు తమ జీవితాల్లోని వాస్తవ స్థితిని ఉన్నదున్నట్లుగా చెప్పేశారు. దాంతో వారికి మాలతి పెళ్లి పట్టుదలపై ఆసక్తి, సంతోష్ బ్రహ్మచారి బతుకుపై సానుభూతి పెరిగింది.

అప్పుడప్పుడు షో రూము అంతా కలియతిరిగే రామేశ్వరరావు.. మాలతి వద్దకు వచ్చినప్పుడు మాత్రం ఆమె కస్టమర్లతో మాట్లాడే తీరును శ్రద్ధగా గమనించేవాడు. అసలు ఆమె షాపులో సేల్స్ గర్ల్ కన్నా పెళ్లి బట్టలు ఖరీదు చేసేవాళ్ళ తోడుగా వచ్చిన బంధువులా కలిసిపోవడం ఆయనకు బాగా నచ్చింది.

అందరిలో మాట్లాడడం బాగుండదని రామేశ్వర్ రావు ఓసారి మాలతిని తమ ఛాంబర్ కు పిలిపించాడు.

భయంగా వచ్చిన మాలతి 'ఏమైనా తప్పు చేశానా సార్?' అంది.

'తప్పేం లేదమ్మాయీ! బాగా పని చేస్తున్నావని చెప్పడానికే పిలిపించాను' అన్నాడాయన నవ్వుతూ.

మాలతి భయం పారిపోయింది.

'ఏ వూరు మీది. ఇక్కడ ఎవరెవరుంటారు?' ఏదైనా సాయం అవసరముంటే చేద్దామనే ఉద్దేశ్యంతో అడిగాడాయన.

అంత పెద్ద మనిషితో ఇవన్నీ చెప్పాలో చెప్పద్దో అనుకుంటూనే తమ వింత కథను మొత్తం చెప్పేసింది మాలతి.

'అరె.. భలేగుంది మీ ప్రేమ కథ.. నీ పట్టింపులు భేష్! పెద్దలను ఎదిరించినా పెళ్ళికి నీవిస్తున్న విలువ నిజంగా గ్రేట్' అని కొంత సేపు ఆలోచించి 'రేపు మీ బ్రహ్మచారిని తీసుకురా.. మాట్లాడుతాను' అన్నాడు.

రెండు చేతులు జోడించి తేలికైన మనసుతో బయటకు వచ్చేసింది.

మర్నాడు మాలతి వెంట వచ్చిన సంతోష్ తో 'మీ నాయన ఎవరు..ఏం చేస్తుంటాడు?' అని అడిగాడు.

'పేరు నారాయణ. ఊర్లో బట్టల దుకాణం వుంది.' అన్నాడు సంతోష్.

'నేను స్టేట్ క్లాత్ మర్చంట్స్ సంఘం అధ్యక్షుడిని, హోల్ సేల్ వ్యాపారులను అడిగితే మీ నాయన సంగతి తెలుస్తది. పిలిపించమంటావా?' అన్నాడు.

'అబ్బో.. నన్ను తన్ని పట్టుకుపోతాడు. మాలతి ఒక్క మాటతో నా వెంట వచ్చింది. నమ్మి వచ్చిన మాలతికి అన్యాయం జరిగితే ఇద్దరం చచ్చిపోతాం!' అని తమ విషయం తండ్రికి చెప్పొద్దని ప్రాధేయపడ్డాడు సంతోష్.

'అంత భయం వద్దు. మీకేమి కాదు. మిమ్మల్ని ఎవరు విడదీయరు. ఆలా చేస్తే నేను చూస్తూ ఊరుకోను. మీ పెళ్లి నా బాధ్యత. నన్ను నమ్మరా!' అన్న మాటలతో వారిలో పూర్తి భరోసా కలిగించాడు రామేశ్వరరావు.

నారాయణ వివరాలు సంపాదించిన రామేశ్వరరావు స్వయంగా ఆ ఊరికెళ్ళి విడివిడిగా మాలతి, సంతోష్ ల తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. మాలతి తల్లిదండ్రులు కూతురు సంగతి తెలిసి కన్నీరు పెట్టారు. నారాయణ మాత్రం చిందులేశాడు. ఆవేదనా ఆవేశాలు చల్లబడ్డాక 'ఊర్లో అందరి పెళ్లిళ్లలా తన పెళ్లి

కూడా జరిగితేనే సంతోష్ తో కాపురం చేస్తానని పట్టుబట్టి ఇప్పటికి మీవాణ్ణి దూరమే ఉంచుతోంది మీ కోడలు. అంత మంచి పిల్ల మీ ఇంటికి రావడం అదృష్టం' అని నారాయణకు వివరించాడు.

రామేశ్వరరావు మాటల్ని గౌరవించిన నారాయణ చేతులెత్తి 'అంతా మీ ఇష్టం' అన్నాడు.

'పిల్లలను తీసుకొస్తాను. పెళ్ళికి సిద్ధం కండి!' అని హామీ ఇచ్చి తిరుగు పయనమయ్యాడు.

మర్నాడు తన ఛాంబర్ లో అడుగుపెడుతూనే 'మాలతిని రమ్మను' అని తన డ్రైవర్ ని పంపాడు రామేశ్వరరావు.

కొద్దిసేపటికి తిరిగొచ్చిన డ్రైవర్ 'మాలతి ఇవ్వాళ డ్యూటీకి రాలేదట సార్' అన్నాడు.

స్వయంగా రామేశ్వరరావు సిల్క్ సెక్షన్ కు వచ్చి ఆరా తీస్తే - 'మన సార్ మా ఊరెళితే సంతోష్ వాళ్ల తండ్రి వచ్చి మమ్మల్ని పట్టుకుపోతాడని, పెళ్లి చేస్తామని చెప్పి తీసికెళ్లి చంపేస్తారని, ఇక నేను రేపటి నుంచి పనిలోకి రాను' అని మాలతి తనతో అందని చెప్పిందో సేల్స్ గర్ల్.

'వాళ్ల రూము తెల్సా!' అని అడగ్గానే తెలుసన్నట్లు తలూపిన ఆమెతో 'పద' అనబోయి మనసులో ఏదో శంకతో ఆగిపోయాడు. ఆ మాటలు విన్నాక తాను పిల్లలకు మేలు చేస్తున్నానా కీడు చేస్తున్నానా అనే ఆలోచనలోపడ్డాడు. వాళ్ళూహించినట్లు నారాయణ ఏదైనా కిరాతకానికి ఒడికడితే.. అలా కాసేపు ఆలోచించి దీన్ని ఇంతటితో వదిలేయాలనుకున్నాడు.

అయినా మనసూరుకోక రోజూ మాలతి వచ్చిందా అని తెలుసుకుంటూనే ఉన్నాడు. వారం రోజులు గడిచింది. వారితో 'మీ పెళ్లి నా బాధ్యత' అని హామీ ఇచ్చి కల్పించిన ఆశలు ఆయన పెద్దరికాన్ని చిన్నబుచ్చుతున్నాయి.

పిల్లలను తీసుకోని వస్తానన్న రామేశ్వరరావు కోసం ఎదురు చూసిన నారాయణ ఉండబట్టలేక ఓ రోజు ఫోను చేశాడు.

'నమస్కారం సార్! మీరు, పిల్లలు బాగున్నారా!' అన్నాడు.

'ఎక్కడ పిల్లలయ్యా! నేను మీ ఊరికి వచ్చిన తెల్లారి నుండే మాలతి డ్యూటీకి రావడం మానేసింది. మీరొచ్చి ఊరికి తీసికెళ్లి చంపేస్తారని పిల్లలు భయపడుతున్నారట' అన్నాడు విసుగ్గా రామేశ్వరరావు.

'అయ్యో ఎంత మాటంటున్నారు సార్! మా పిల్లలను మేం చంపుకుంటామా! అప్పుడప్పుడు పత్రికల్లో వస్తున్న వార్తలు చూసి అలా భయపడుతున్నారేమో! మమ్మల్ని బయలుదేరి రమ్మంటారా?' అన్నాడు నారాయణ.

'మీరు రావలసిన అవసరమేమీ లేదు. నేనే పిల్లల్ని తీసుకోని మీ వద్దకొస్తాను' అని ఫోను పెట్టేశాడు. డ్రైవర్ ను పిలిచి కారు తీయమన్నాడు.

వెతగ్గా దొరికిన మాలతి, సంతోష్ ల రూముకు బయటి నుంచి తాళమేసి కనబడింది. కారును చూసి కొందరు ఇళ్లల్లోంచి బయటికి వచ్చారు.

'ఎవరు మీరు? ఎవరు కావాలి?' అని అడిగాడొకాయన.

'ఈ రూములో ఉండేవాళ్ళు ఎటెళ్ళారు?' అని అడిగాడు రామేశ్వరరావు

'మీకెందుకు.. వారికి మీరేమవుతారు?' అని మరొకరు ఎదురొచ్చి ప్రశ్నించాడు.

వీరి అనుమానాలు తీర్చితే తప్ప కథ ముందుకు సాగదని తనకు వారిద్దరి గురించి తెలిసిందంతా చెప్పి వారికి పెళ్లి చేయాలనే ఆలోచనతోనే తాను వచ్చానని స్పష్టం చేశాడు.

ఆ మాటలు నమ్మి ఒకరి ఇంట్లో దాచిన మాలతి, మరో ఇంట్లో ఉన్న సంతోష్ ను బయటికి తెచ్చారు.

'మీ పెళ్లి నా బాధ్యత అన్నాక కూడా మీకు నమ్మకం కలగడం లేదా?' అనడంతో ఇద్దరు ఆయన ముందుకు వచ్చి తల వంచుకొని నిలబడ్డారు. మీ ఊరికెళ్ళి వచ్చాను. నారాయణ పెళ్ళికొప్పుకున్నాడు..'అన్న ఆయన మాట పూర్తికాకుండానే 'మరి నా పెళ్లి మా ఊర్లోనే జరగాలి?' అంది మాలతి.

'మీ ఊర్లోనే తిరుపతి గుడి లాంటి సెట్ వేయించి చేయిస్తాను. మన షాపులకు ఒక పట్టు చీరల ప్రకటన అవసరముంది. మీరిద్దరు అందులో వధూవరులు. నీవు కోరుకున్న చీరలు కట్టుకో! నగలు పెట్టుకో! మేకప్ చేసుకో! చుట్టాలను పిలుచుకో! కానుకలు ఇచ్చుకో!' అంతా నీ ఇష్టం' అన్నాడు రామేశ్వరరావు పూర్తి స్వేచ్ఛనిచ్చినట్లు.

సంతోషం పట్టలేక అందరి ముందే రామేశ్వరరావు కాళ్లపై పడి 'ముందు మీరు దీవించండి!' అన్నారు అభినవ వధూవరులు. కాలనీ జనం చప్పట్లే బాజాలుగా వారి పెళ్లి అంకం మొదలైంది.

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# చీకటి

గంటి రమాదేవి

సంజ చీకట్లు ముసురుకుంటున్నాయి. టాంక్ బండ్ అవతల పెద్ద జాతీయ పతాక అవనతమైనది. ఇనుప రైలింగ్ ఆనుకుని వెనక్కి వెనక్కి చూస్తున్నాడు శ్రీహరి. రోజూ శిరీష ఈ టైముకు వచ్చేదే! వారం రోజుల నుంచి రావడంలేదు. ఫోన్ కి సమాధానం లేదు. 'వాట్స్ అప్ మెసేజ్' లు చూడడం లేదు.

చేతినిండా గాజులు వేసుకుని, చేతులకు ఎర్రగా గోరింటాకు పెట్టుకుని, కాళ్ళకి పట్టీలు పెట్టుకున్న ఆమెను స్నేహితుడి పెళ్లికి వెళ్ళినప్పుడు చూసాడు. కళ్ళకు కాటుక పెట్టుకుని, నుదుట రాగి పైసా అంత బొట్టు పెట్టుకుని, పక్క పాపిట తీసుకుని, "మార్గశిర మాసపు చేమంతి" పువ్వులా వుండే శిరీష "సాఫ్ట్ వేర్ ఇంజినీర్" అంటే ముందు నమ్మలేదు. "జీన్స్ పాంట్", ఖరీదైన "కూలింగ్ క్లాసెస్", "బ్రాండెడ్ షూ" తో వున్న "తనూ" సాఫ్ట్ వేర్ ఇంజనీరే!

ఓ అనువైన సమయంలో. 'మీరు ఇంత సాంప్రాదాయ బద్ధంగా వున్నారు! మీరు 'సాఫ్ట్ వేర్' ఇంజినీర్ అంటే నమ్మకం కలగడం లేదు.' ఆమెతో అన్నాడు. 'ఇది నా కిష్టమైన డ్రెస్. ఆఫీసులో వాళ్ళిచ్చిన "యూనిఫాం" వేసుకుని వేసుకుని విసుగొచ్చింది. నేను "సాఫ్ట్ వేర్" ఇంజనీర్ ని కాక ముందు. నేను ఓ సగటు తెలుగమ్మాయిని. నాకు మన సాంప్రదాయం, కట్టూ బొట్టూ అంటే ప్రాణం! ఆఫీసులో ఆ డ్రెస్ తప్పదు. ఇక్కడ నా ఇష్టం!'. ఇల్లంతా సందడిగా తిరుగుతూ, పెళ్ళిలో తన గుంపుతో హుషారుగా తిరిగే శిరీష అంటే శ్రీహరి ఇష్టపడ్డాడు. ఇద్దరూ ఉద్యోగస్తులే. ఆమె జీతం వివరాలు సేకరించాడు. మంచి ఉద్యోగం, మంచి జీతం! దీనికి తోడు. అందకత్తె. ఆమె ఒక్క జీతంతో జీవితం హాయిగా గడిచిపోతుంది. ఇంతకన్నా ఏమి కావాలి? ఓ శుభ మూహూర్తాన, శ్రీహరి తన 'ప్రేమ' ని శిరీష కి తెలియజేసాడు. వివాహం విషయంలో ఏ అభ్యంతరాలు లేవు అని చెప్పాడు.

'సరే! నన్ను ప్రేమించానని, వివాహం చేసుకుంటానని చెప్పిన మొదటి వ్యక్తివి నువ్వు! నాకు ఎవరూ అంత త్వరగా నచ్చరు! నీలో 'వంక' పెట్టడానికి ఏమీ లేదు. మంచి అందగాడివి. ఆరోగ్యవంతుడివి. ఉద్యోగస్థుడివి. స్థితిమంతుడవు. ఇంత కన్నా. ఏ యువతి అయినా ఏమి కోరుకుంటుంది? కానీ. నాకు కొంత సమయం కావాలి! ఆఖరుగా. మన పెద్దవాళ్ళు వప్పుకోవాలి! స్త్రీ పురుష ఆకర్షణా, ప్రేమా ప్రకృతి సహజం. కానీ. అదే అంతిమం కాదు! ఈ ప్రేమ మన కుటుంబాల మధ్య విడదీయరాని బంధంగా మారాలి! అదే అనుసరిణీయం! నాకు అదే సమ్మతం! నీకు అర్థమైందని అనుకుంటాను.'

నిజానికి శ్రీహరికి అర్థం కాలేదు. 'సింపుల్ లవ్' కి ఇంత పెద్ద హంగామానా? ఇద్దరి మధ్య ఈ పెద్ద వాళ్ళ గోల ఏమిటి? వాళ్ళ పాత రాతి యుగపు ఆలోచనలతో 'ఇబ్బంది' పెట్టే నైపుణ్యం ఇబ్బడి ముబ్బడిగా వుండే ఓ జాతి ఈ ముసలి మూక! శ్రీహరి ఆలోచించాడు. ఆమెకు దాదాపు ఎనభై వేల రూపాయల నెల జీతం! మంచి భార్య అయే లక్షణాలున్న శిరీష కోసం ఎదురు చూడక తప్పదు. ఇప్పుడు కాందంటే. ఈ బంగారు బాతు వెళ్ళిపోతుంది! అది తనకి సమ్మతం కాదు! 'సరే! నీ ఇష్టం శిరీషా!' అన్నాడు అయిష్టంగానే. అప్పటినుంచి వారి ప్రేమ ప్రయాణం నెమ్మదిగా సాగుతోంది.

మొన్న ఫైవ్ స్టార్ హోటల్ కి 'టీ' కి వెళ్ళినప్పుడు, శిరీష అన్న మాట ఇంకా గుర్తుంది. 'హరీ! ఏమిటీ 'టీ'? వట్టి చూరు నీళ్ళు! బిల్లు చూస్తే గుండె గుభిల్లు! ఇలాగ అయితే మన ఇద్దరి జీతాలు బేజారు! మన జీవితాలు దిగజారు!' అంది నవ్వుతూ!

'శిరీ! 'టీ' ఎలా ఏడిసినా నాకు నీ 'ప్రాస' నచ్చింది. ఈ చిరుప్రాయంలో నీలో ఇంత 'సీరియస్ నెస్' ఓ వింత! ఇప్పటి నుంచి ఎందుకు చింత? లోకంలో "ఎవరూ లేరనుకుని" మన

జీవన యానంసాంతం కొనసాగాలి! 'పాస్ట్ ఈజ్ హిస్టరీ!, 'ఫ్యూచర్' తెలియదు! "ప్రస్తుతం" మొక్కటే ముఖ్యం ! అందుకే అనవసరపు ఆలోచనలు పెట్టుకోకు. జీవితాన్ని అనుభవించు!' అన్నాడు శ్రీహరి! "ఎవరూ లేనట్టా"? అంటే. నీకు అమ్మా, నాన్నా, కుటుంబం ఎవరూ లేరా?' విస్మయంగా అడిగింది శిరీష! 'ఉన్నారు. "నల్లి" రక్తం తాగినట్టు నా రక్తం తాగుతూ వుంటారు! వాళ్ళ ప్రసక్తి తీసుకు రాకు! తలచుకుంటేనే చిరాకు!'

అదే ఆఖరి సారి శిరీష ను చూడడం! ఓ రోజు. శిరీష వుండే 'వుమెన్స్ హాస్టల్' కి వెళ్ళాడు. శిరీష తన స్కూటర్ మీద ఎక్కడికో వెడుతోంది. తన కారులో ఆమెను అనుసరించాడు. మెయిన్ రోడ్డు దాటి పక్క రోడ్డులో మాయమైంది. తన కారు చూసే వుంటుంది! కొత్తగా మార్కెట్ లోకి వచ్చిన కారు. "ఫీనిక్స్ రెడ్" కలర్! ఆ కలర్ అంటే తనకి ఇష్టమని చెప్పింది. ఆమె సలహా ప్రకారమే ఆ రంగు కోసం వారం ఆగి కారు డెలివరీ తీసుకున్నాడు.

కారు ఒక దగ్గర పార్క్ చేసి ఆమెకు ఫోన్ చేశాడు. 'హరీ! ఇవాళ మా నాన్నకి 'హార్ట్' ఆపరేషన్! హాస్పిటల్లో వున్నాను!' అని చటుక్కున పెట్టేసింది.

ఎప్పుడూ చెప్పలేదు శిరీష తనకి గుండె జబ్బున్న తండ్రి వున్నట్టు! ఈ ముసలాళ్ళు ఓ 'న్యూ సెన్స్'! "రిటైర్" అయిన వెంటనే "చచ్చి" చావరు! ఇంకా ఏమి బావుకుందామని ఈ "ఆపరేషన్" లు? లక్షల్లో వృధా ఖర్చు!' మర్నాడు. శిరీష్ కి ఫోన్ చేసి . 'మీ నాన్న కి ఎలా వుంది?' అన్నాడు గొంతులో మర్యాద వుట్టి పడతుండగా!'

'ICU లో వున్నారు!' ముభావంగా అంది. 'ఓకే. ఆఫీసుకు ఎప్పుడు వెడుతున్నావు? ఎక్కువ సెలవలు తీసుకుంటే. ఈ సంవత్సరం "బోనస్" రాదు.' 'తెలుసు. కానీ. ఇంకొన్ని రోజుల్లో మా అమ్మకు కంటి ఆపరేషన్! అది అయిన తర్వాతే.'

'అయితే. బోనస్ కాదు. జీతమే 'కట్' అవవచ్చు. ఇంతేనా ఇంకా వున్నాయా ఆపరేషన్లు?' ఎంత మర్యాదగా మాట్లాడినా, ఆ మాటల్లో వెటకారం దాచలేకపోయాడు!

'వ్యంగంగా మాట్లాడకు! ఇదే మీ ఇంట్లో వాళ్లకి కష్టం వస్తే నువ్వు పట్టించుకోవా?'

'అస్సలు పట్టించుకోను! ఈ "ముసలి పీనుగులు" బతికి ఎవరిని ఉద్ధరించాలి? అదేదో దేశంలో, మనషులకి అరవై ఏళ్ళు రాగానే, చేతులు కాళ్ళూ కట్టేసి అడవిలో వదిలేస్తారుట! అలాటి "రూలు" మనకీ వుండాలి! పీడా విరగడ అవుతుంది.'

'ఛీ ఛీ. మనం ముసలివాళ్ళం కామా? అదే శిక్ష మనకీ వస్తుంది!' శిరీష ఆగ్రహంగా అంది.

'తినాలి! తాగాలి! లైఫ్ ఎంజాయ్ చెయ్యాలి! కొడుకులకీ, కూతుళ్ళకీ భారంగా మారకుండా పోవాలి! అది నా ఫిలాసఫీ!' శిరీష ఫోన్ పెట్టేసింది. అప్పుడు. తన పొరపాటు శ్రీహరికి అర్థమైంది. ఆవేశంలో మాట్లాడాడు. ఎందుకంటే. అది తన స్వానుభవం! .. తనకీ "వున్నారు".. 'ఓ' అమ్మా, నాన్నా, అన్నయ్యా, తమ్ముడూ, చెల్లెలూ. అనబడే "చెత్తంతా" వుంది!

అమ్మ ఎప్పుడూ ఏడుస్తూ వుంటుంది. 'అది లేదు. ఇది లేదు.' అంటూ! 'ఏడ్చి ఏడ్చి కళ్ళు కనబడవు ఆవిడకి! నాన్న అయితే మరీ నిష్టూరంగా మాట్లాడుతాడు.

'ఒరే! నాకున్నదంతా పోసి నీకు చదువు చెప్పించాను! పెద్దాడికి చదువు అబ్బలేదు! ఇక నాకొచ్చే "పెన్షన్" చాలా కొంచెం! అది ఏ మూలకి సరిపోదు! పైగా నీ చదువుకి చేసిన అప్పుకి వడ్డీ! చూసావుగా. ఈ బొళ్ళ కొంప! ఇది ఎండకి ఇల్లే కానీ, వానకీ, మంచుకి కాదురా. ఇల్లంతా కురుస్తోంది. ఇదీ ఎప్పుడో పోతుంది.

చూడరా. తమ్ముడిని స్కూల్ నుంచి గెంటేసారు! ఫీజు కట్టలేదని. మాకు పండుగలు లేవు. కొత్త బట్టలు లేవు. చిరిగిపోయిన బట్టలు కుట్టుకుంటూ, కట్టుకుంటూ

కాలక్షేపం చేస్తున్నాం. చిన్నదాని వంటి మీద "చిన్నమెత్తు బంగారం" కూడా లేదు! సరియిన పోషణ లేక ఎలా "కళ" తప్పి వున్నారో చూడు వాళ్ళని! నాకు వయసు అయిపోయింది! ఏ పనీ చెయ్యలేను! నువ్వు పెద్ద ఉద్యోగం చేస్తున్నావు కదా! కొంచెమో, గొప్పో, నీకు తూచినది నెలకింతని పంపలేవా? ఇంత కర్కోటకం ఎక్కడా చూడాలేదు!'

'అందుకే నాకు ఇక్కడికి రాబుద్ధి కాదు! దరిద్రపు ముఖాలు! దరిద్రపు కోరికలు! జలగల్లా పీక్కు తింటారు! నా జీతం నాకే చాలదు! అదంతా. మీకిచ్చి నేను కూడా మీలాగా "చిరుగు గుడ్డలు" వేసుకుని ఆఫీసుకు వెళ్ళాలా? మీరు ఎక్కువ బలవంతం పెడితే?' 'పెడితే?' తండ్రి అడిగాడు. అప్పుడు శ్రీహరి ఆఖరి అస్త్రం బయట పెట్టాడు. 'నేను టాంక్ బండ్లో దూకి చస్తాను! భయపడకండి! నేను చచ్చిన వార్త మీకు తెలిసేటట్టు చేసి మరీ పోతా!' ఆ దెబ్బకి, విద్యుత్ఘాతం తిన్నట్టు చేష్టలుగి చూస్తూ వుండిపోయారు ఇంటిల్లిపాదీ!

'వద్దు నాయనా! ఎక్కడున్నా నువ్వు నిక్షేపంగా వుండాలి! తల్లి కళ్ళు తుడుచుకుంటూ అంది. తమ్ముడూ, చెల్లెలూ బిక్క ముఖాలు వేసారు. పెంకులు వూడి ఇంట్లో ధారాళంగా వెలుతురు వస్తూ వుంది. వెలుగు కనపడని ఓ మూలాన నిలబడి అసహాయంగా చూస్తున్నారు! అన్నయ్య అంటే భయం! వచ్చినప్పుడల్లా అరుస్తాడు! అమ్మా నాన్నా ఏడుస్తారు. ఇదంతా ఎందుకు జరుగుతోందో తెలియని అయోమయం! రంగు వెలిసిన హరిత పత్రం లా వున్న వాళ్ళ ముఖాలు శ్రీహరికి చూడ బుద్ధి కాలేదు. వీళ్ళకీ ఈ ముసలి శాల్తీ లకీ తేడా ఏముంది? వీళ్ళవి ఎవ్వరూ బాగుచేయలేని జీవితాలు. శిశిరం లో ఎండిన వృక్షాలు. వాటికి ఓ దశ వుంది. వసంతం వస్తుంది. వీళ్ళకి రాదు. శాశ్వత శిశిరం!

తండ్రి ముఖం లో విషాదం కొట్టవచ్చినట్టు కనిపించింది. 'నే పోతున్నా!' అని శ్రీహరి తిరిగి నగరానికి వచ్చేసాడు. బరువు తగ్గి తేలిగ్గా వుంది!

ఆ తరవాత. మళ్ళీ ఆ పల్లెటూరు వెళ్ళలేదు. ప్రాణానికి హాయిగా వుంది. కొడుకులపై, కూతుళ్ళపై ఆధారపడే ఇలాటి "పరాన్న జీవులు" పోతే కాని, దేశం బాగుపడదు. ఇదే అమెరికాలో అయితే ఎవరి సంపాదన వాళ్ళది! ఎవరి బతుకు వాళ్ళది! వాళ్లకి అమ్మా, నాన్నా, అన్నా, చెల్లే అన్న 'మనోభావాలు' వుండవు. అందుకే ఆ దేశం అభివృద్ధి పదంలో దూసుకు పోతోంది. మన దేశం?

సమయం చూసుకుని. శిరీషతో చెప్పాలి. 'ఈ ముసలి సరుకును ఎంత తొందరగా "వదిలించుకుంటే" అంత మంచిదని. ఇంకా ఈ శిరీషకి చదువు అబ్బని అన్నయ్యా, డొక్కలెండిన తమ్ముడూ, పాలిపోయిన చెల్లెళ్ళూ "కూడా" వున్నారా?'

మనసంతా వ్యాకులంగా వుంది. బార్ కి వెళ్ళి, 'స్కాచ్' తగ్గి నిద్రపోతే కానీ. ఈ ముసలి, ముష్టి కుటుంబ సమస్యల తాలూకు 'హన్గోవర్' తగ్గదు!

ఆ రాత్రి నిద్ర సరిగ్గా పట్టలేదు. పొద్దున్న లేవలేకపోయాడు. వళ్ళంతా నొప్పులు! ప్రాణాలు తోడేసే నీరసం! ఊపిరి అందడం లేదు! అతి కష్టం మీద ఆఫీసుకు ఫోన్ చేసి చెప్పాడు. తర్వాత స్పృహ లేదు! తెలివి వచ్చిన తర్వాత చూస్తే హాస్పిటల్లలో వున్నాడు. ఎన్ని రోజులు అక్కడ వున్నాడో శ్రీహరికి అంచనా లేదు. డాక్టర్ పల్స్ చూస్తూ అన్నాడు. 'మీ బంధువులు. ఫ్రెండ్స్ ఎవరైనా వున్నారా? వాళ్ళ ఎడ్రస్ చెప్పండి.!

శ్రీహరికి గుండె గుభేల్మంది! అతని నోట మాట రాలేదు. ఎడం చేతికి "సెలైన్ బాటిలు" వుంది. "అదే" ఇప్పుడు తన 'పక్కన వున్న' బంధువు. స్పృహ వస్తూ, పోతూ వుంది. బతుకో, చావో తెలియని స్థితి. ఓ రోజు తనని మోసుకు పోయినట్టు లీలగా తెలిసింది. తెలివి వచ్చి చూస్తే . పరిచయమున్న పరిసరాలు. తన ఫ్లాట్! 'సారీ సర్! మీ "ఇన్సురెన్స్" సొమ్ము అయిపోగానే. మిమ్మల్ని

పంపించేసారు! ఈ నాలుగు వారాల్లో చాలా జరిగాయి. మీరు పని చెయ్యలేరని, మన ఆఫీసు వాళ్ళు మిమ్మలిని 'బెంచ్' కే పరిమితం చేశారు. జీతం రాదు!' అని ఆఫీసు బాయ్ చెప్పి వెళ్ళిపోయాడు.

అప్పుడప్పుడు ఫ్లాట్ "వాచ్ మాన్" వచ్చి చూసి పోతున్నాడు. 'ఫ్లాట్ నిర్వహణ ఫీజ్ ఇవ్వలేదు. మీ కారు దుమ్ము కొట్టుకు పోయింది. కార్ ముందే అమ్మేయండి. ఎవరికయినా కబురు పెట్టాలా సార్! ' వాచ్ మాన్ తను ఎప్పుడు పోతాడా అని చూస్తున్నాడా?

"ముందే' కారు అమ్మేయాలా? పోతే. అది తీసుకుంటాడు అన్న అనుమానం మొదలయింది. ఈ లోకంలో అందరూ స్వార్థ పరులే. హాస్పిటల్! బిల్లు ఉన్నంత వరకే చికిత్స! ఆ పై వదిలించుకున్నారు! "కబురు?". అంటే . ఇక తనకి ఆఖరి ఘడియలు సమీపించాయా?'

మళ్ళీ మగతలోకి జారుకున్నాడు శ్రీహరి. . ఎన్ని గంటలో, రోజులో తెలియదు. చీకటి, వెలుగు వచ్చి పోతున్నాయి. ఏది చీకటో ఏది వెలుతురో తెలియడం లేదు. 'తన' ఫ్లాట్ లో వంటరిగా. దాహం వేస్తూ వుంది. అరుస్తున్నాడు. శబ్దం వినపడడం లేదు. ...

ఉలిక్కి పడి లేచాడు శ్రీహరి. వెచ్చటి నీటి చుక్కలు ముఖం మీద పడ్డాయి. నాలుకకి రుచి తెలుస్తూ వుంది. గోరు వెచ్చటి ద్రవం గొంతు కష్టంగా దాటుతోంది. గొంతు మండుతోంది. చేతుల్లో తలపట్టుకుని చెంచాతో జావ పట్టిస్తున్న మనిషిని చూసి ఉలిక్కి పడ్డాడు. ఆమె. అమ్మ!.

ఆ పక్కనే. నాన్న! కన్నీళ్ళతో చెల్లెలు! కొంచెం దూరం లో అన్నయ్య, తమ్ముడూ వున్నారు.

ఎక్కడో వందల మైళ్ళ దూరంలో పల్లెలో వుండవలసి వాళ్ళు ఇక్కడకి ఎలా వచ్చారు?'

'చచ్చి బతికావు నాయనా!' అంది తల్లి రోదిస్తూ. కొన్ని గంటలు గడిచాయి. కళ్ళు చీకటిని చీలుస్తున్నాయి. అస్పష్టమైన నీడలు! నెమ్మదిగా తెలుస్తూ వుంది. 'మీరెలా వచ్చారు?' అడిగాడు శ్రీహరి ! నూతిలో నుంచి వినవచ్చే మాటలా అనిపించింది తన మాట తనకే!

'ఓరోజు . ఓ అమ్మాయి మన ఇంటికి వచ్చింది అన్నయ్యా! చాలా బాగుంది. ఆకలితో మలమలా మాడిపోతున్న మాకు అన్నం పెట్టింది. లేకపోతే చచ్చిపోయే వాళ్ళం! నాకు మంచి బట్టలు కొంది. 'చెల్లెలు కళ్ళు మెరుస్తూండగా చెప్పింది.

'అవును. బాబూ. మమ్మల్ని ఇక్కడికి తీసుకు వచ్చింది. నన్ను హాస్పిటల్ లో చూపించింది. నాకు గుండె ఆపరేషన్ వెంటనే చేయాలంటే. దానికి ఏర్పాట్లు చేసింది. అమ్మకు కంటి ఆపరేషన్ చేయించింది. "ఎవరమ్మా నువ్వు?" అని అడిగాను. "మీ ఇంట్లో మనిషిని" అంది. ఆమె లేకపోతే . మేమంతా రోగంతోనో, ఆకలితోనో ఎప్పుడో పోయి వుండేవాళ్ళం! 'ఇదంతా ఎవరు చేయమన్నారు? మా కోసం ఎందుకింత ఖర్చు పెడుతున్నావు?' అడిగాము. 'ఇది ఖర్చు కాదు నాన్న గారూ! అమ్మా, నాన్నా, తమ్ముడూ, చెల్లెలూ, అన్నయ్యా . అనే "నా" కుటుంబానికి నేను ఇలాగే చేస్తాను. అది నా కనీస బాధ్యత! నాకు దగ్గర వాళ్ళకి ఈ మాత్రం చెయ్యలేనా?' అంది. 'ఇంత చేస్తున్న నీ పేరు కూడా మాకు తెలియదు.' అన్నాను.

'నా పేరు శిరీష. నేనూ, మీ శ్రీహరీ ఒకటే ఆఫీసులో పని చేస్తాం! మీ వివరాలు నాకు అక్కడే తెలిసాయి. ఇక ఆగలేక వచ్చేసాను.' 'మరి నీ ఉద్యోగం? శ్రీహరి? చాలా రోజులు నువ్వు మా దగ్గరే వుండిపోయావు!' 'లేదండీ! శ్రీహరికి పెద్ద జబ్బు చేసింది. మన స్పృహలో లేడు అని తెలిసి. ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించాను. రోజూ తన యోగక్షేమాలు తెలుసుకుంటున్నాను. ఇప్పుడు ఇంట్లో చికిత్స జరుగుతూ వుంది. మనం అక్కడకి వెడుతున్నాం!' అంది. అలా వచ్చాం అందరమూ.

'అన్నయ్యా నువ్వు ఎక్కడ వుంటావో తెలియదు! ఇప్పుడు తెలిసింది!' అంది శ్రీహరి చెల్లెలు.

పశ్చాత్తాపంతో ముఖం తిప్పుకున్నాడు శ్రీహరి. 'సారీ! నువ్వు నా బాధ్యత తీసుకున్నావు. నేను చెయ్యవలసిన పని నువ్వు చేశావు! థాంక్స్!' అన్నాడు శ్రీ హరి.

'ఇది నాకు దేముడిచ్చిన కుటుంబం. ఇలా చేయడం. నీకు "పిచ్చి" పనిలా అనిపిస్తుందని నాకు తెలుసు! "నాకూ" అందరూ కావాలి! ఇప్పుడు అందరూ వున్నారు!'

'నాకు సంతోషంగా వుంది. నా జబ్బు తగ్గిపోయింది. చేరవలసిన చోటుకు నువ్వే చేరావు! నా కుటుంబంలో మరొక సభ్యురాలవి! 'అన్నాడు శ్రీహరి.

'అవును శ్రీహరీ! నా కుటుంబంతో నేను చేరాను. చిన్న సవరణ. నీ కుటుంబం లో కాదు. అది ఒకప్పుడు. ఇప్పుడు కాదు! నాకు అమ్మా, నాన్నా, అన్నా, చెల్లెలు, వున్నారు. "దీనితో" మన వరస మారింది. మారిన నా "వరసతో" నీ "సరసన" చెరలేను. నీ భార్యను ఎప్పటికీ కాలేను. నాకు కొన్ని కట్టుబాట్లు వున్నాయి! నువ్వు నా మనసు 'చట్రం' లో ఇమడలేవు! "ఈ ముసలి పీనుగులు" బతికి ఎవరిని ఉద్ధరించాలి?" అన్న నీ మాటలు నేను ఎప్పటికీ మరచిపోలేను. ఇప్పుడు నువ్వు పూర్తి ఆరోగ్యంగా వున్నావు. నీ పరిపూర్ణ ఆరోగ్యం వెనక మా అందరి ప్రార్థన వుంది. వైద్యం ఖర్చుతో కూడుకున్నది. దాని గురించి మా కేవరికీ చింత లేదు. ఎరుపు రంగు కలిగించే 'ఎరిత్రోసైట్' కౌంట్ బాగానే వుందని నీ 'రిపోర్ట్' చెబుతోంది. నీకు ఎప్పటికీ తెలియని సంగతి! నీ రక్తానికి ఏ రంగూ లేదు అని నాకు తెలుసు! అది "వైద్య వలయానికి" ఆవల వుంది. సప్త వర్ణ రంజితమైన ఇంద్రధనస్సు లో vibgyor వుంది. కానీ. నీ వైద్య పరీక్ష నేను చేసాను. అది నా స్వంత "లాబ్" లో! అక్కడ నాకు కనిపించినది. చీకటి! రంగు లేని కటిక చీకటి. మరో రంగులేదు. కుటుంబం అనే "చెత్తని" వదిలించుకున్న నీకు నా అభినందనలు! ఇక మా బెడద నీకు వుండదు. మేము ఇవ్వాళ్ళే తిరిగి వెళ్ళిపోతున్నాం! మా టాక్సీ వస్తోంది!'

శిరీష మాటల్లో వ్యంగానికి, ఆ మాటల తీవ్రతకి బిత్తరపోయాడు శ్రీహరి! హఠాత్తుగా పర్జన్య మేఘపు ఉరుము ఉరిమింది. ఆ తర్వాత అంతా నిశ్శబ్దం! అది చెవులు చిల్లులు పడేటట్టు వినబడుతోంది!.

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

Balaji Flowers Usa

SOMIREDDY
LAW GROUP

North America Telugu Society (NATS)
భాషే రమ్యం - సేవే గమ్యం
NATS

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

New Jersey, USA

# TriMurthy Day

## ARADHANA



**Date:**
March 24th, 2024 (Sunday)
**Time:** 8:30am to 5:30pm

**Venue:**
Ananda Mandir
269 Cedar Grove Lane, Somerset, NJ.

Delicious Lunch Served

*Pooja followed by Group Singing (All are welcome)*

Entry Free

**TRINITY COMPOSITIONS**

Vathapi, Jagadanandakaraka, Duduku gala, Yendaro Mahanubhavulu, Kamakshi Swarajathi

**Sri Shymasastri Compositions Group Participation**

Concert
Sri Vishveshwar Nagarajan - Flute
Swetha Narasimhan - Violin
Murali Balachandran - Mridangam

**Sri Dikshitar Compositions Group Participation**

Concert
Srinaath Perangur - Vocal
Swetha Narasimhan - Violin
Shridhar Parthsarathy - Mridangam

**Sri Thyagaraja Compositions Group Participation**

Concert
Sri Shreehari Raghavan - Vocal
Srinaath Perangur - Violin
Sabarinath Ramachandran - Mridangam

Please register for the Group Performance:
http://tinyurl.com/tfastrimurthy2024participation

Supporters / Sponsors
HELP FOUNDATION
HEALTH AND EDUCATION FOR LESS PRIVILEGED
BHOG
POLEPALLE FOUNDATION
NEW YORK LIFE

For Additional Information :
Jaya Chikka: (201) 317-1166; Rekha Brahmasamudram: (732) 513-0716;
Jyothi Kamarasu: (609) 578-8606

TFAS Board of Trustees 2022-24

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Jyothi Kamarasu: (609) 578 8606
Venkata Satya Tata: (973) 985 3409
Anil Veerisetty: (571) 218 8562
Naga Mahendar Velishala: (732) 429 6025
Ravi Annadanam: (917) 355 5503
Sudha Devulapalli: (732) 331 9313

digitalaya • +91 9246578478

# తెలుగు కళా సమితి ౨౦౨౪ సంక్రాంతి సంబరాలు



## తెలుగు కళా సమితి ౨౦౨౪ సంక్రాంతి సంబరాలు











# తెలుగు కళా సమితి ౨౦౨౪ సంక్రాంతి సంబరాలు








## వృద్ధ మరీచిక

మెట్టు శ్రీనివాసరెడ్డి

అన్ని రోజుల్లల్లే- ఈ రోజూ రైలెల్లిపోయింది
అయినా బిడ్డ రాలే!!
ఆ టేషను పెద్దాయన చూపు మారదాయే!!

రైలు కోసం చూసీ చూసీ చూపు మసకబారి పాయే!
ఈరోజూ పొద్దుగూకి పాయే
బఠానీలు అమ్మే బండ ఖాళీగాకపాయే
నేను లేపకుండా ఆ బండ ఖాళీ ఎట్టవుద్దిలే!!

పండగనాడైనా వస్తడనుకొంటీ
బిడ్డలేని కాడ గొడ్డైన పండగ జేసుకొంటదా!!
బతుకు జూసుకొనేటోడికి పండగతో పనేంది!!
అయినా నాలాంటి పండుటాక్కి పండగేందిలే!!!

ఆడికి చిన్నప్పుడు పరమాన్నం పెడితే
ఇయ్యాల ఏం పండగే అనేటోడు!
ఈరోజూ రైలెల్లిపోయింది - పరమాన్నం ఆరిపోయింది
బ్రతకటానికి పరదేశం పోయినోడికి పండగేందిలే!!!

రైళ్ళన్నీ ఎల్లిపోయినా టేషన్ని వదలని నామీద
ఆ పెద్దాయనకి కనికరమే లేకపొయ్యే
ఎన్ని రైళ్ళెల్లిపోయినా నా కళ్లలో నీళ్ళుండిపోవే!!
రైళ్ళని కనపడనీయని చీకట్లను ఎంతతిట్టుకున్నా నా బిడ్డ రాడే!
అయినా ఆరిపోయ్యే దీపానికి ఎలుగెందుకులే!!

ఎదురు జూస్తన్నా
కన్న అమ్మ కోసం కాకపోయినా
సంబరంలో ఊరేగే అమ్మ కోసమైనా వస్తడని
పనికోసం పోయినోయిడికి పండగతో పనేముంటాదిలే!!

నా బిడ్డ రాలే!!!
అన్ని రైళ్ళ లాగే ఈ రైలూ ఎల్లిపోతుంది
అన్ని సంబరాల్లాగే ఈ సంబరమూ ఎల్లిపోతుంది.
అయినా దూరంగానో, ఖారంగానో ఉందని
బూమంతా తిరగటం ఆపేస్తే వసంతం ఎట్టా వస్తాదిలే !!

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

---

## ఒక శిశిరపు ఉదయాన! అక్కడ!!

**అలజంగి మురళీధర రావు**

ఉదయం తొమ్మిది
చలిలో వేలాడుతోంది మన్యం ....
కాలం విడిచిన ఁకుబుసంఁలా మంచు తెర !

నడుస్తూ వెళుతున్నా..
నానుతూ శిలలా నిల్చింది
ఓ జీలుగు కల్లు చెట్టు ..
కన్ను తిప్పే లోగా
ఒక మంచు ముత్యం
ఁటప్ఁ మంది తలపై
అదొక శీతల చైతన్యం
సోయగాల లోగిల్లోంచి
రాలిపడ్డ రసాతల పుష్పం !

యుగాల దూరం వెనక్కి జరిగి
కాలం ధవళ వర్ణమైంది ....
రెక్కలు తడిచిన కాకి గుండె
పాటై ప్రతిధ్వనించింది !

కొత్త కోరికలేవో
విచ్చుకుంటాయి
అడివంతా ...!
హిమధ్వనిలో
జీవన స్వనం
శ్రుతి తప్పి వణుకుతుంటుంది !

ఏదో కాలిక స్పృహ
రెప్ప విప్పుతుంటే
ఒక విద్యుదాలోచన
ఉరకలెత్తి పారుతుంది !
ఉనికికి ఊపిరాడదు
తనను తాను కోల్పోయి
వేనవేల శకలాలై
లిప్తలుగా వేలాడుతుంటుంది !

అనంతమైన కాళ్ళతో
ప్రాకే హిమజ్వాల
సౌధాలకు సౌరభాన్ని
పులుముతుంది ...
చెట్లను సుతారంగా
నిమురుతుంది... !

మన్వంతరాల దూరంలోకి
జరిగిందా గగనం ....!!??
ఎటు చూసినా
తెల్లని హిమం
వెన్నలా, వెన్నెలలా !

గొంతులు వణుకుతూ
పుట్టిస్తాయి ఒక కొత్త
గజగజల హిమరాగం !.
తరంగమై
తుషారపు తీగను
మీటుతుంది వనం!!!

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# సాపాటు రుచికరం శత్రు

సోమిశెట్టి వేణుగోపాల్

"డాక్టర్ గారూ! మా ఆవిడకి మీరైనా కాస్త అర్థమయ్యేలా చెప్పండి. చప్పటి ఆహారం తినలేక చచ్చిపోతున్నాను. నాకున్న బి.పి., షుగర్ల వల్ల ఉప్పు, పంచదార తక్కువగా తినటం నా ఆరోగ్యానికి మంచిదే, నేనొప్పుకుంటాను. కానీ ఈవిడ గారు పూర్తిగా చప్పటి వంటలు చేసిపెడుతుంది. ఇలాంటి తిండి జంతువులు మాత్రమే తింటాయి."ఆవేదనగా చెప్పాడు అరవైనాలుగేళ్ళ భాగ్యరాజు.

ఆయన పక్కనే కూర్చున్న వాళ్ళావిడ దమయంతమ్మ "అలాంటిదేం లేదు డాక్టర్ గారు. నేను మరీ అంత చప్పిడి వంటలేమీ తినిపించటంలేదు ఈయనకి. మీరు చెప్పినట్లుగానే తన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కూరల్లో ఉప్పు కారాలు, కాఫీ పాయసాల్లో పంచదార కాస్త తక్కువగా కలిపి ఇస్తున్నాను అంతే! ఆమాత్రం దానికే ఈయనకు జీవితం మీద విరక్తి కలుగుతోందట"అని భర్త మీద చిరుకోపం ప్రదర్శిస్తూ అంది ఆయన భార్య దమయంతమ్మ.

డాక్టర్ సౌమ్య, తన ఎదురుగా కూర్చొని ఒకరి మీద ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్న ఆ వర్ధమాన వృద్ధ దంపతుల ముఖాల్లోకి కొన్ని క్షణాలు జాలిగా చూసింది. నలభై నలభై అయిదు మధ్య వయస్కురాలైనా, శారీరక ఆరోగ్యాన్ని అదుపులో ఉంచుకోవటం వలన కాబోలు అసలు వయస్సుని కప్పిపుచ్చి ఆమెను యవ్వనవతిగా చూపిస్తోంది ఆవిడ ముఖారవిందం. ఎంతోమంది రోగులకు చికిత్స అందించిన అనుభవం తాలూకు పరిపక్వతను నింపుకున్నాయి ఆమె కళ్ళు. ఆమెకు, వాళ్ళిద్దరికి మధ్యలో ఉన్న ఖరీదైన టేబుల్ మీద డా. సౌమ్య, ఎం. డి. (జనరల్ ఫిజీషియన్) అని వ్రాసివున్న సొగసైన చెక్క ఫలక ఒకటి విజిటర్స్‌కి కనిపించేలా పెట్టబడి ఉంది. భాగ్యరాజు బ్లడ్‌టెస్ట్ రిపోర్టులను మరోసారి పరిశీలనగా చూసిన తర్వాత ఆమె వారితో అంది "చూడండి, మీకు ఎలా చెప్పాలో తెలియటంలేదు. భాగ్యరాజు గారూ! మీకు ఆహారం విషయంలో కలిగే ఇబ్బందికి కారణం మీ ఆవిడ వంట కాదు. మీ శరీరంలో ఉన్న ఒక అరుదైన జబ్బే ఇందుకి కారణం"

ఆవిడ ఏం చెబుతుందో అర్థంకానట్లుగా ముఖం పెట్టాడు భాగ్యరాజు. దమయంతమ్మ పరిస్థితి కూడా అదే.

డాక్టర్ సౌమ్య, భాగ్యరాజుని చూస్తూ చెప్పింది "మీకు 'లైకేన్ ప్లానస్ సిండ్రోమ్' అనే జబ్బు సోకింది. ఇది నాలుకకు సంబంధించిన ఒక అరుదైన డిసీజ్. ఈ వ్యాధికి గురైన మనిషి నాలుక మీద ఉండేటువంటి రుచిని గుర్తించే గ్రంథులు పూర్తిగా పనిచెయ్యకుండా పోతాయి. దీని వలన ఆ వ్యక్తి ఎలాంటి ఆహార పదార్థాన్ని నోట్లో వేసుకున్నా దాని స్పర్శను మాత్రమే గుర్తించగలడు తప్ప సంబంధిత రుచిని ఎంతమాత్రం అనుభవించలేడు. ప్రస్తుతం మీ శరీరంలో ఈ వ్యాధి ప్రారంభదశలో ఉంది కాబట్టి మీరు ఎక్కువ మోతాదు రుచి కలిగిన పదార్థాన్ని తిన్నప్పుడు ఆ రుచిని తక్కువగా ఆస్వాదించగలుగుతున్నారు. అందరూ మామూలుగా తినే రుచులు మీకు చప్పగా తోస్తున్నాయి. ఈ కారణం వలనే మీ ఆవిడ వంటల్లో మీకు ఉప్పు కారాలు కాస్తంత తగ్గించినా అది మీకు పూర్తి చప్పగా అనిపిస్తోంది. కొన్ని నెలలు గడిచాక ఈ జబ్బు మీ నాలుక పనితీరుని పూర్తిగా దెబ్బతీస్తుంది. అప్పుడు మీరు ఏ స్థాయిలో షడ్రుచులను తీసుకున్నా వాటిని మీ నాలుక గుర్తించలేదు. అంటే .. మీరు ఉప్పు, పంచదార లాంటివి నేరుగా నాలుక మీద వేసుకున్నా దాని రుచిని ఎంత మాత్రం గుర్తించలేరన్నమాట. ఇది తప్ప ఈ జబ్బు వలన శరీరానికి మరే ఇతర నష్టం కానీ ప్రాణాపాయం కానీ ఉండదు"

డాక్టర్ గారు చెప్పింది విని అర్థంచేసుకోవటానికి వాళ్ళిద్దరికి కొంత సమయం పట్టింది. ఆ దంపతులు కాస్సేపు మౌనంగా ఉండిపోయారు. 'భగవంతుడా.. ఎంతపని చేశావయ్యా! నేను ఏం పాపం చేశానని నాకు ఇలాంటి జబ్బుని అంటగట్టావయ్యా?' అనుకుంటూ లోలోపలే బాధపడ్డాడు భాగ్యరాజు. అసలే ఆయన భోజనప్రియుడు.

మధుమేహం, రక్తపోటులు ఒంట్లో తిష్టవేసుకొని కూర్చున్నా రుచికరమైన పిండివంటలు ఆరగించడంలో ఎంత మాత్రమూ రాజీపడడు. 'అసలు మానవజన్మ ఉన్నదే తిని అనుభవించటానికి' అని భావించే మనస్తత్వం ఆయనది. అలాంటి మనిషికి ఇలాంటి జబ్బు రావటం దురదృష్టమే అనుకోవాలి. తనకి షుగర్ జబ్బు ఉందన్న విషయం బయటపడినప్పుడు కూడా ఇంతగా ఆందోళన చెందలేదాయన.

"మరి దీనికి చికిత్స ఏమిటి డాక్టర్?" దమయంతమ్మ అడిగింది.

"కోట్లలో ఒకరికి మాత్రమే వచ్చే అరుదైన డిసీజ్ ఇది. ప్రస్తుతం దీనికి మనదేశంలో చికిత్స కానీ, మెడిసిన్ కానీ లేదనే చెప్పొచ్చు. అయినా మీరు దీని గురించి కంగారుపడొద్దు. అమెరికాలో నాకు తెలిసిన రీసర్చ్ డాక్టర్ ఒకాయన ఉన్నారు. నేను ఆయన్ని సంప్రదించి ఈ జబ్బుకి సంబంధించిన చికిత్సా విదానం గురించి తెలుసుకొని అందుకు అవసరమైన మెడిసిన్స్ కూడా తెప్పిస్తాను. కానీ ఇందుకు నాకు కొంత సమయం పడుతుంది. అంత వరకు మీరు భోజనం విషయంలో సంయమనం పాటిస్తూ ఓర్పుగా వ్యవహరించటం ఎంతో అవసరం. బహుశా ట్రీట్‌మెంటుకి కూడా సమయం పట్టొచ్చు! ఇప్పుడు నేను కొన్ని మందులు వ్రాస్తున్నాను. ప్రస్తుతం మీరు రెగ్యులర్‌గా తీసుకునే వాటితో పాటుగా వీటిని కూడా వాడండి" అని చెప్పి ప్రిస్క్రిప్షన్ వ్రాసి ఆ చీటీని వారికందించింది.

*** *** ***

"నేను గుడికి వెళ్ళొస్తానండీ! ఏదైనా అవసరం పడితే ఫోన్ చెయ్యండి"పెరట్లో మొక్కలకు నీళ్ళు పడుతున్న భర్తతో చెప్పి గేటు తీసుకొని బయటకు నడిచింది దమయంతమ్మ.

తోటపని చేస్తున్న మాటే కానీ భాగ్యరాజు మనసంతా జబ్బుపడిన తన నాలుక చుట్టే తిరుగుతోంది. ఇంతలో ఏదో గుర్తొచ్చినట్లుగా వడివడిగా నడుచుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు. వంటగదిలోకి వెళ్ళి పంచదార డబ్బా కోసం వెతికాడు. అది కనిపించగానే మూత తీసి స్పూన్‌తో ఇంత పంచదార తీసుకొని నోట్లో వేసుకున్నాడు. కాసింత ఇసుక తీసి నాలుకమీద వేసుకున్నట్లు అనుభూతి చెందాడు. మరుక్షణం ఆ ఇసుక లాలాజలంగా మారినట్లు అనిపించింది తప్ప చీమకాలంత తియ్యదనాన్ని కూడా చవిచూడలేకపోయాడు. తర్వాత ఉప్పుడబ్బా వెతికి పట్టుకొని చిటికెడు ఉప్పు తీసి నాలుక మీద వేసుకుంటే వెంటనే అది కరిగిపోయింది తప్ప ఉప్పదనానికి సంబంధించిన సంకేతాలేవీ తన మెదడుకి చేరలేదు. డాక్టర్ చెప్పిన ఆ డిసీజ్ మూలంగా తన నాలుక పూర్తిగా దెబ్బతిందని అర్ధమైందాయనకు. మరుక్షణం ఆయన కళ్ళలో నుండి ఉప్పునీళ్ళు ఉబికి వచ్చాయి. 'నాలుక చెయ్యలేని పనిని మేమైనా చెయ్యగలమేమో చూద్దాం' అనుకున్నాయేమో ఆ కళ్ళు! కానీ జ్ఞానేంద్రియాలలో వేటిపని వాటిదే కదా. 'నీళ్ళలో వేలు ముంచి నోటితో చప్పరించినట్లుగా అయిపోయిందేమిటి నా జీవితం.. ఇంతకన్నా నేను నిద్రలోనే తుదిశ్వాస వదిలినా బాగుండేది కదా' అనుకుంటూ లోలోపలే కుమిలిపోయాడు భాగ్యరాజు.

గుడికి వెళుతూ దమయంతమ్మ వీధిచివర వరకు నడిచి ఏదో మర్చిపోయినట్లు అనిపించటంతో ఆగి వెనక్కి తిరిగి ఇంటికి వచ్చింది. వంటగదిలో భర్త అలికిడి వినిపించటంతో 'ఇంతలోనే ఈయన గారు ఏం ఘన కార్యం చెయ్యటానికని వంటగదిలోకి దూరిపోయారో..' అనుకుంటూ నిశ్శబ్దంగా గోడ చాటున నిలబడి భర్త చర్యలను గమనించింది. ఆయన అంతరంగంలోని ఆవేదనను అర్ధంచేసుకున్న ఆమెకు ఏదోలా అనిపించటంతో దగ్గరకు వెళ్ళింది.

భాగ్యరాజు చిన్నగా కంగారుపడి తన కళ్ళలోని తడి భార్యకు కనపడకుండా జాగ్రత్తపడుతూ "అప్పుడే వచ్చావేంటి దమయంతీ? నువ్వు గుడికి వెళ్ళలేదా?"అన్నాడు.

ఆ మాటకు సమధానం చెప్పకుండా దమయంతమ్మ భర్త కుడిచెయ్యిని తన రెండు చేతుల్లోకి తీసుకొని ప్రేమగా అంది "మీరు ఎంత బాధపడుతున్నారో నాకు తెలుసండీ! కానీ డాక్టర్ గారు చెప్పింది మర్చిపోవద్దు. ఆవిడ అమెరికా

డాక్టర్‌తో మాట్లాడి మంచి ట్రీట్‌మెంటు ఇప్పించి జబ్బుని నయం చేస్తానంది కదా! "

ఆ మాటకు భాగ్యరాజు చిన్నగా నిట్టూర్చాడు. "ఏమో దమయంతీ! నాకైతే నమ్మకం లేదు. ఎందుకో తెలుసా? నువ్వెప్పుడైనా గమనించావో లేదో.. మనం అధికంగా ప్రేమించే వ్యక్తులు ఎవరైనా వేరొక చోట ప్రమాదవశాత్తు చనిపోతే ఆ వార్తను తెలియజేసే వ్యక్తులు ఆ విషయాన్ని ఒకేసారి పూర్తిగా చెప్పకుండా ముందుగా చనిపోయిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పి కొంత సమయం తీసుకొని ఆ తర్వాత మరణ వార్తను తెలియజేస్తారు. ఎందుకంటే అలాంటి దుర్ఘటనకు ధైర్యంగా స్పందించే సామర్థ్యం అందరికీ ఉండదు కనుక. నా జబ్బు విషయంలో డాక్టర్ గారు ఇచ్చిన భరోసా కూడా ఇలాంటిదే అనిపిస్తోంది నాకు"

"అలా ఏంకాదు లెండి! మీ గురించి అంత శ్రద్ధ తీసుకోవటానికి ఆవిడ మనకేమైనా చుట్టమా చెప్పండి? అయినా డాక్టర్లు పేషెంట్ల సున్నితమైన భావోద్వేగాల గురించి అంతగా పట్టించుకోరు. ఎంత కఠినమైన విషయం అయినాసరే సూటిగా చెప్పేస్తారు. వాళ్ళు పేషెంటుకి ఇవ్వవలసిన ట్రీట్‌మెంటు, దానికి అయ్యే ఖర్చు మరియు ఫీజు గురించి మాత్రమే ఆలోచిస్తారు"

"అంతేనంటావా? మరైతే ఆవిడ అమెరికా ట్రీట్‌మెంటు గురించి మనకు ఆర్నెళ్ళ క్రితం చెప్పింది. ఆ తర్వాత మనం ఇప్పటివరకు మూడుసార్లు ఆమెని కలిశాం. 'ఆ డాక్టర్ గారితో నేనింకా మాట్లాడలేదు' అన్న మాట తప్ప ఇప్పటివరకూ ఆమె చేసిందేమీ లేదు కదా! అందుకే నాకనిపించింది.. ఈ జబ్బుకి ఎలాంటి చికిత్స లేకపోయినా అమెరికా డాక్టర్‌తో మాట్లాడతానంటూ కాలయాపన చేసి చివరికి అసలు విషయం చల్లగా చెబుతుందేమోనని.. "

"అలా తొందరపడితే ఎలాగండీ? అమెరికాలో డాక్టర్లు ఎంత బిజీగా ఉంటారో! మనకేం తెలుసు. పైగా ఈ సౌమ్య గారు కూడా తక్కువేం కాదు, విరామం లేకుండా రోగులను చూస్తుంటారు. మీకు వచ్చిన జబ్బేమో చాలా అరుదైనదాయె. దాని గురించి అన్నీ వివరంగా మాట్లాడటానికి ఈవిడకీ ఆయనకు ఒకే సమయంలో తీరిక దొరకాలి కదా? అందుకే ఈ ఆలస్యం అనుకుంటా.. "అని భర్త అనుమానానికి సమాధానం చెప్పింది.

భార్య మాటలతో తృప్తిపడిన భాగ్యరాజు మౌనంగా ఉండిపోయాడు. పదవీవిరమణ పొందిన ప్రభుత్వోపాధ్యాయుడిగా గతంలో ఎంతోమంది విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేసిన తనకు ఇప్పుడు అనారోగ్యం విషయంలో ఉన్న అనుమానాలను భార్య తొలగించటం గమ్మత్తుగా అనిపించిందాయనకు.

"ఏమండీ, నేనొక విషయం చెప్తాను తప్పుగా అనుకోకండి. ఎలాగూ మీ నాలుక రుచుల్ని గుర్తించటంలేదు కదా! కాబట్టి మీరు తినే వంటలలో ఉప్పు, తీపి తగ్గిస్తాను. ఈ విదంగానైనా మీ బి.పి. షుగర్ లెవల్స్ నియంత్రణలోకి వస్తాయి. 'వ్రతం చెడినా సుఖమైనా దక్కాలి' అన్నారు పెద్దలు. ఏమంటారు?" కాస్త భయపడుతూ అడిగింది దమయంతమ్మ. నిజానికి ఆవిడ గత కొన్ని రోజుల్నుండే ఆయన తింటున్న ఆహారం, ఇతర పిండివంటల్లో ఉప్పు పంచదార వెయ్యటం మానేసింది. పదార్థాలు వృథా అవుతాయని కాదు కానీ భర్త ఆరోగ్యం మెరుగవ్వాలనే సదుద్దేశ్యంతో అలా చేస్తోంది. కానీ ఆయనకి చెప్పకుండా అలా చేస్తున్నాననే గిల్టీఫీలింగ్ తనలో ఉంది.

"నువ్వు చెప్పింది కూడా నిజమే దమయంతీ! చెవిటివాడి కళ్ళముందు వీణ వాయించినా, వాయించినట్లు నటించినా రెండూ ఒక్కటే కదా? కమ్మటి రుచుల్ని కళ్ళతో మాత్రమే చూడగలుగుతున్నాను. అవంటే నాలుకకి ప్రేమ.. శరీరానికి పగ. ప్రేమించే నాలుకే నిర్వీర్యమైనప్పుడు ఆరోగ్యానికి కీడు చేసే రుచుల్ని వదిలేస్తే మంచిదే కదా. కనీసం ఈ శరీరమైనా హాయిగా ఉంటుంది. అలాగే కానివ్వు"

భర్త తన అంగీకారం తెలపటంతో మనస్సులో ఉన్న గిల్టీఫీలింగ్ నుండి కాస్త విముక్తి లభించినట్లు

అనిపించిందామెకు. కానీ అంతకంటే ఎన్నో రెట్లు పెద్దదైన అపరాధభావం ఒకటి చాలా రోజుల నుండి దమయంతమ్మని వేదిస్తోంది. ఆ అపరాధభావం నుండి బయటపడటం ఎలాగో ఆమెకి తెలియదు. తెలుసుకోవడానికి అనుక్షణం ఆలోచిస్తుంది. అది గుర్తుకొచ్చినప్పుడల్లా ఆమె మనస్సు వికలం అవుతుంది. ఇప్పుడు కూడా ఆమెలో ఆ అలజడి నేనున్నానని గుర్తుచేసింది. కొన్ని నెలల క్రితం తను డాక్టర్ సౌమ్యతో జరిపిన సంభాషణ గుర్తుచేసుకుంది. ఒకరోజు మధ్యాహ్నం సమయంలో భాగ్యరాజు హఠాత్తుగా కళ్ళుతిరిగి పడిపోయాడు. అంబులెన్స్ సహాయంతో దమయంతమ్మ ఆయన్నిసౌమ్య హాస్పిటల్‌కి తీసుకెళితే వెంటనే ఐ.సి.యు.లో అడ్మిట్ చేసుకున్నారు. అప్పుడు డాక్టర్ సౌమ్య దమయంతమ్మని తన క్యాబిన్‌కు పిలిపించుకొని మాట్లాడింది.

“చూడండమ్మా! భాగ్యరాజు గారి హెల్త్ కండీషన్ కొంత ఆందోళనకరంగానే ఉంది. బి.పి., షుగర్ లెవల్స్ అధిక స్థాయిలో ఉన్నాయి. తన రక్తంలో చక్కర స్థాయి అత్యధికంగా పెరిగిపోవటంవల్లే స్పృహతప్పి పడిపోయారు. వెంటనే తీసుకొచ్చారు కాబట్టి ఇప్పటికైతే ప్రమాదం తప్పినట్లే. కానీ పలుమార్లు ఇలాగే జరిగితే ఎప్పుడో ఒకసారి ఆయన కోమాలోకి వెళ్ళే ప్రమాదం ఉంది. అంతేకాదు ఈ స్థాయిలో షుగర్ లెవల్స్ రిపీట్ అయితే కిడ్నీలు పూర్తిగా పాడయ్యే అవకాశం ఉంది. రక్తపోటు అదుపులో ఉంచుకోకపోయినా తీవ్రమైన గుండెపోటు వచ్చే ఛాన్స్ ఎక్కువ. నేను గత కొన్ని సంవత్సరాలుగా ఆయనకు చికిత్స అందిస్తున్నాను... తనకి సరిపోయే మంచి మందులనే రాస్తున్నాను. కానీ ఏనాడూ తన బి.పి., షుగర్‌లు నియంత్రణలో ఉన్న దాఖలాలు లేవు. ఎందుకో కానీ తనకి ఇస్తున్న మాత్రల డోసు ఎప్పటికప్పుడు పెంచవలసివస్తోంది. దీనివల్ల తన కిడ్నీల మీద ఎక్కువ బర్డెన్ పడి అవి తొందరగా చెడిపోవచ్చు. హెవీడోస్ మందులకు కూడా ఆయన బాడీ ఎందుకు స్పందించటంలేదో నాకే అర్థంకావట్లేదు”

అంతా విన్న దమయంతమ్మ కళ్ళలో ఆందోళనతో పాటు సన్నని కన్నీటి పొర ప్రత్యక్షమైంది. “దీనికంతటికీ కారణం ఆయన నిర్లక్ష్యమే డాక్టర్ గారూ..! భోజనం, చిరుతిళ్ళ విషయంలో చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తాడు తప్ప తనొక పేషెంటుననే నిజాన్నే మర్చిపోతాడు. విపరీతమైన జిహ్వాచాపల్యంతో అడ్డు అధుపు లేకుండా తీపి పదార్థాలు మెక్కటమే కాకుండా వంటల్లో అదనంగా ఉప్పు జల్లుకొని తింటాడు. నేను ఆయన్ని ఎంత నియంత్రణలో ఉంచాలని ప్రయత్నించినా పట్టించుకోడు. ఇంట్లో తీపి పదార్థాలు, పిండివంటలు చెయ్యటం మానేస్తే బయటకు వెళ్ళి నాకు తెలియకుండా స్వీట్లు రకరకాల స్పైసీ ఫుడ్స్ కొనుక్కొని తింటాడు. తన ప్రాణం మీద తనకి పట్టింపు లేదు. కానీ ఆయన ఆరోగ్యం ఎంతగా పాడైపోతుందోనన్న ఆందోళనతో నేను ప్రతిరోజూ చస్తున్నాను ”

“మరి ఇలా అయితే ఎలాగమ్మా? తన ఆరోగ్యం మీద తనకే శ్రద్ధ లేకపోతే ఇక ఆయనను ఎవ్వరూ కాపాడలేరు. తనని తీవ్రమైన అనారోగ్య సమస్యలు చుట్టుముట్టటానికి ఎంతో కాలం పట్టదు ”

“మీరే ఏదో ఒకటి చెయ్యాలి మేడం ”

“చెప్తున్నా కదమ్మా.. నా తరపున తనకి నాణ్యమైన చికిత్సనే అందిస్తున్నాను. కానీ తను స్వయం క్రమశిక్షణ పాటించకపోవటంవల్ల నా చికిత్స బూడిదలో పోసిన పన్నీరవుతుంది “

“డాక్టర్ గారూ! ఆహారం విషయంలో ఆయన క్రమశిక్షణగా ఉండటానికి నా దగ్గర ఒక ఆలోచన ఉంది. కానీ దానిని అమల్లో పెట్టడానికి మీ సహకారం అవసరం అవుతుంది. మీరు కోపం తెచ్చుకోనంటే అదేమిటో చెప్తాను “

ఆశ్చర్యం అనుమానంతో డాక్టర్ సౌమ్య “ఏమిటా ఆలోచన? “అంది.

“మరేం లేదండీ, ఆయన నాలుక కొంతకాలం రుచుల్ని గుర్తించకుండా ఉండేలా మీరు ఏవైనా మందులివ్వండి. ఆ తర్వాత తను రుచుల్ని గుర్తించకపోవటానికి కారణం ఫలానా

నాలుక జబ్బు ఏదో సోకిందనీ, దానికి చికిత్స చెయ్యటానికి చాలా కాలం పడుతుందని ఆయనతో చెప్పండి. దానితో కొంతకాలానికి తనకి చప్పటి ఆహారం తినటం అలవాటవడమే కాకుండా రుచుల్ని గుర్తించలేడు కాబట్టి దొంగతనంగా కూడా ఏమీ తినే ప్రయత్నం చెయ్యడు. నేను తన ఆహారంలో ఆరోగ్యానికి కీడు చేసే రుచులను పక్కన పెట్టేస్తాను. దీనివలన మా ఆయన ఎంతగానో ఇబ్బందిపడతాడు, బాధపడతాడు. కానీ ఆరోగ్యంగా ఉంటాడు. దయతో ఈ సహాయం చేసిపెట్టండి నాకు. జీవితాంతం మీకు రుణపడి ఉంటాను "అంటూ అభ్యర్థనగా అడిగింది దమయంతమ్మ.

"ఏం మాట్లాడుతున్నారమ్మా మీరు!! ఇలా నాటకాలాడి అబద్ధాలు చెప్పడానికి నేనేమైనా నటినా చెప్పండి. బాధ్యత కలిగిన డాక్టర్‌ని నేను. మీ ఆయన పరిస్థితి చూస్తే మీ మీద జాలి కలుగుతోంది. కానీ మీరు చెప్పినట్లు మాత్రం నేను చెయ్యలేను "

"అలా అనకండి ప్లీజ్.. మేము మీకు ఏమీ కాము, కేవలం మీరు మాకు వైద్యం చేసే డాక్టర్ మాత్రమే! నా వ్యక్తిగత సమస్యతో మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానని నాకు తెలుసు. కానీ మానవతాదృక్పథంతో కనికరించండి. మా ఆయనకు నేను, నాకు ఆయన తప్ప మాకు ఎవ్వరూ లేరు. ఎన్ని దేవుళ్ళకు మొక్కినా, రకరకాల ఆసుపత్రుల చుట్టూ తిరిగినా మాకు పిల్లలు కలుగలేదు. ఇప్పుడు ఆయనకేమైనా జరిగితే నేను ఒంటరిదాన్ని అయిపోతాను, పిచ్చిదాన్నైపోతాను. పోతే మేమిద్దరం ఒకేసారి పోవాలి లేదంటే ఆయనకంటే ముందుగా నేనే పోవాలి కానీ నా కళ్ళముందే తను అనారోగ్యంతో తనువు చాలిస్తే నేను తట్టుకోలేను"అంటూ బోరున విలపిస్తూ డాక్టర్ కాళ్ళమీద పడబోయింది.

సౌమ్య వెంటనే ఆమె భుజాలు పట్టుకొని ఆపి "ఏం చేస్తున్నారమ్మా? మీరు నాకంటే పెద్దవారు. అలా చెయ్యొచ్చా?" అంటూ తనని సముదాయించింది.

దమయంతమ్మ పరిస్థితిని పూర్తిగా అర్థంచేసుకున్న ఆమెకు తన మీద ఉన్న జాలి రెట్టింపైంది. కాస్సేపు ఆలోచించుకున్న తర్వాత "సరే.. మీరు చెప్పిన సహాయం నేను చేస్తాను. దీని వెనకాల మీ సదుద్దేశమే తప్ప దురుద్దేశమేమీ లేదు కాబట్టి ఇందుకు ఒప్పుకుంటున్నాను "అంది.

దమయంతమ్మ తన కన్నీళ్ళు తుడుచుకొని, రెండు చేతులు జోడించి ఆవిడకు కృతజ్ఞతలు తెలిపింది.

అలా దమయంతమ్మ.. భర్తను జిహ్వాచాపల్యం నుండి బయటపడెయ్యటానికి డాక్టర్‌తో కలిసి నాలుక జబ్బు నాటకాన్ని మొదలుపెట్టింది. కానీ భర్తను మోసం చేస్తున్నానన్న అపరాధభావం ఒకవైపు, భోజనప్రియుడైన ఆయన రుచుల్ని గుర్తించలేక పడుతున్న అవస్థలు మరోవైపు ఆమెను ప్రశాంతంగా ఉండకుండా చేస్తున్నాయి.

*** *** ***

ఒకరోజు సాయంత్రం టెరస్ మీద నిలబడి శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్న భాగ్యరాజు దగ్గరకు వెళ్ళి "ఏమైందండీ అలా ఉన్నారు? రెండుమూడు రోజుల్నుండీ దిగులుగా కనిపిస్తున్నారు. నాతో సరిగా మాట్లాడటంలేదు. నావల్ల ఏదైనా తప్పు జరిగిందా?" అని అనుమానంగా అడిగింది దమయంతమ్మ.

కొన్ని క్షణాలు భార్య ముఖంలోకి తదేకంగా చూసిన తర్వాత అన్నాడు భాగ్యరాజు. "నువ్వు ఆ డాక్టర్‌తో కలిసి నాకు చెప్పిన అబద్ధం గురించి తెలిసింది. మొన్న హాస్పిటల్‌కి వెళ్ళి ఆమెను కలిసి నా ట్రీట్‌మెంటు గురించి నిలదీస్తే ఆవిడ జరిగినదంతా చెప్పింది "

ఉలిక్కిపడిందామె. 'దేవుడా..! ఏదైతే జరగకూడదు అనుకున్నానో అదే జరిగింది' అనుకుంది. "ఏమండీ.. మీరు నమ్మండీ నమ్మకపోండీ, ఈ నిజాన్ని నేనే మీకు కొన్ని రోజుల తర్వాత చెబుదామనుకున్నాను. ఇంతలో మీరే తెలుసుకున్నారు. మీరు బావుండాలనే ఇదంతా చేశాను. నన్ను క్షమించండి "ఆమెకు దుఃఖం పొంగుకొచ్చింది. "ఆరోజు మీరు స్పృహతప్పి పడిపోయి ఐ.సి.యు.లో అచేతనంగా

పడివుండటాన్ని చూసిన నాకు భయమేసింది. నేను బ్రతికుండగా మీకేదైనా జరిగితే ఆ తర్వాత ఒంటరిగా బ్రతికే ధైర్యం నాకు లేదని అర్ధమైంది. మీరేమో ఆరోగ్యం గురించి అస్సలు పట్టించుకోరు. బాగా ఆలోచించాక మిమ్మల్ని కాపాడుకోవటం కోసం నాకు అలా చెయ్యాలనే ఆలోచన వచ్చింది. మీరు తృప్తిగా భోజనం చెయ్యలేక ఎంత నరకయాతన అనుభవించారో.. పాపిష్టిదాన్ని! నన్ను మన్నించండి "అని కంటతడి పెట్టింది.

"బాధపడకు దమయంతీ.. నిన్ను నేను అర్ధంచేసుకున్నాను. నా ఆరోగ్యం బాగుండాలనీ, నేను బాగుండాలని నువ్వెంతగా తాపత్రయపడ్డావో డాక్టర్ గారు నాకు అంతా చెప్పారు. ఇన్నాళ్ళూ నన్ను మోసం చేస్తున్నానన్న గిల్టీ ఫీలింగ్‌తో నువ్వెంత కుమిలిపోయుంటావో నేను ఊహించగలను. వాస్తవంగా పొరపాటు నాదే! నా ఆరోగ్యం గురించి నీకంటే ముందుగా నాకే శ్రద్ధ, భయం ఉండాలి. కానీ నీ హెచ్చరికను ఏమాత్రం లెక్కచెయ్యకుండా నిర్లక్ష్యంగా కంటికి కనిపించిన తినుబండారాలను, అనారోగ్యం కలిగించే పదార్థాలను యదేచ్చగా ఆరగించి నిన్ను వ్యాకులతకు గురి చెయ్యటమే కాకుండా నేను ప్రమాదం అంచు వరకు వెళ్ళాను. నీకు ఒక్కదానికేనా దమయంతీ.. నాక్కూడా నిండునూరేళ్ళూ ఆరోగ్యంగా నీతో కలసి జీవించాలని ఉంది. ఇప్పుడే నీకు మాటిస్తున్నాను! నా నాలుక మొద్దుబారేలా నాకు ఎలాంటి మందులు ఇవ్వనవసరం లేదు, నేనే స్వచ్ఛందంగా నా ఒంటికి సరిపడని రుచుల్ని ఈరోజు నుండీ బహిష్కరిస్తున్నాను "

ఆయన మాటలతో ఆమె మనసులోని బాధంతా చెతితో తీసేసినట్లుగా తొలగిపోయింది. "మీరు నిజంగానే అంటున్నారా? నా మీద కోపం లేదా మీకు?" అనుమానంగా అడిగింది.

లేదన్నట్లుగా కళ్ళుమూసి అడ్డంగా తలూపుతూ "ఊ..హు "అన్నాడు.

"థాంక్స్ అండీ.. నన్నర్థంచేసుకున్నందుకు "

ఆ మాటని స్వీకరిస్తున్నట్లుగా భాగ్యరాజు చిరునవ్వుతో భార్య చెయ్యిని తన చేతుల్లోకి తీసుకున్నాడు ప్రేమగా. అక్కడి చల్లగాలిని ఆస్వాదిస్తూ ఇద్దరూ కాస్సేపు మౌనంగా ఉండిపోయారు. దమయంతమ్మకు మనస్సు తేలిక పడి హాయిగా అనిపించింది.

కొద్దిసేపటి తర్వాత భాగ్యరాజు అన్నాడు. "దమయంతీ! మన పూర్వీకులు 'భార్యా రూపవతి శత్రుః' అన్నారు. అంటే దానికి అర్థం, భార్య అందం భర్తకు శత్రువు లాంటిది అని. అదెలా అంటే ఆమె అందగత్తె అయితే పరాయి మగవాళ్ళందరి కళ్ళు తన మీదే ఉంటాయి. ఇది ఏదో ఒక రకంగా ఆ భర్తకు చేటు చేస్తుంది. అదన్నమాట ఆ శ్లోకం వెనకాల ఉన్న పరమార్థం. నా విషయంలో దీన్ని మరో రకంగా మార్చుకోవచ్చు"

"ఏమనీ? కొంపదీసి భార్యా గుణవతి శత్రు అంటారా ఏంటి? ఎందుకంటే నా అతిప్రేమ వల్ల తమరు నానా అగచాట్లు పడ్డారు కదా!"అంది చిన్నగా నవ్వుతూ.

"కాదు దమయంతీ.. 'సాపాటు రుచికరం శత్రు' అనాలి. ఎందుకంటే రుచికరమైన భోజనం నా ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది కాబట్టి అది నాకు శత్రువు లాంటిది అన్నమాట "

"మీ ఒక్కరికే కాదండీ.. అడ్డమైన జంక్‌ఫుడ్స్ తినే ఈ తరం వాళ్ళందరికీ మీరు చెప్పిన శ్లోకం వర్తిస్తుంది"

భాగ్యరాజు కొద్దిసేపు భార్య ముఖంలోకి చూసి "నువ్వు చెప్పిన శ్లోకం కూడా నాకు వర్తిస్తుందిలే "అన్నాడు తనని ఉడికించటానికి.

"ఏమన్నారూ..? తిట్టేస్తా మిమ్మల్ని "అంది దమయంతమ్మ చిరుకోపం ప్రదర్శిస్తూ.

దానికి ఆయన బిగ్గరగా నవ్వుతూ భార్యను దగ్గరకు తీసుకున్నాడు.

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# బడ్జెట్ పద్మనాభం

తటవర్తి నాగేశ్వరి

"వాట్" అన్నాడు ఫ్యామిలీ డాక్టర్ కమ్ ఫ్రెండ్ సిద్ధేశ్వర్. పద్మనాభం అదోలా చూశాడు. "నీకేమైనా బుద్ధుందా?" అన్నాడు మళ్లీ డాక్టరే... "అది కాదు రా ...సిద్ధూ.." అని ఏదో అంటుంటే. "షటప్...మా చెల్లి భర్తవి కాబట్టి బ్రతికి పోయావ్..లేకపోతే ఏ పాయిజన్ ఇంజక్షనో ఇచ్చి నిన్ను చంపేసే వాడిని" అన్నాడు. "నువ్వు కాకుంటే నా సందేహం ఇంకెవరూ తీర్చరా?" అన్నాడు. "అలా మరొకరు టెస్ట్ చేశారని తెలిస్తే ఆ డాక్టర్ పట్టా ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు కంప్లైంట్ చేసి రద్దు చేయిస్తా... నిన్ను గృహహింస క్రింద కేసు బుక్ చేసి బొక్కలో వేయిస్తా." అన్నాడు సిద్దేశ్వర్. స్నేహితుడి వైపు ఎగాదిగా చూసి బయటకు నడిచాడు పద్మనాభం. "ఏంటి, నన్ను బయటకు పంపి మా అన్నయ్యతో అంతసేపు బాతాఖానీ..?" అడిగింది కావేరి. "నీకు వాడ్ని అన్నయ్యని చేసింది నేనే. వాడేదో మీ అమ్మ పేగు తెంచుకొని పుట్టినట్టు ఫోజు కొడుతున్నావ్". అన్నాడు. "ఏమయిందయ్యా నీకు?" అడిగింది కావేరి." ఏదో ఒకటిలే..పదా.." అన్నాడు కోపంగా. ఇంటికొచ్చాక "డాక్టర్ ఏమన్నాడమ్మా?" అడిగింది అత్త విమల. "కొన్ని పరీక్షలు చేసి మందులు రాసిచ్చాడు అత్తయ్యా. " చెప్పింది. "నువ్వేంట్రా, అలా కందగడ్డలా మొఖం పెట్టుకున్నావ్" అంది. "ఏంటో అత్తయ్యా..మీ అబ్బాయిగారు.." అందికావేరి. "అది కష్టపడి వారసుడ్ని మోస్తుంటే నీ కొచ్చిన కష్టం ఏంట్రా.." అంది విమల.

"ఏ ఇంటికి వారసుడో" తనలో తాను గొణుక్కున్నాడు. "వీడొక పెర్రి మాలోకం లేమ్మా..నువ్వు మంచిగా ఫుడ్ తీసుకో. రోజు ఎలాగూ ఆకుకూరల వాడు వస్తాడు కదా..తీసుకుందాం. ఫ్రిజ్‌లో ఎలాగూ ఫ్రూట్స్ వుంటాయిగా అవి తింటూ వుండు. పాలలో కుంకుమ పువ్వు వేసుకొని తాగు. అరేయ్, పద్మం షాపులో కుంకుమ పువ్వు కొనుక్కొని రా..అవి తాగడం వల్లే , నిమ్మపండులా పుట్టావ్ నువ్వు .." అంది. "నిమ్మపండ్లు, బత్తాయ్ ..పండ్లు అక్కరలేదు.." అన్నాడు. "చూడండి అత్తయ్యా... తండ్రిని కాబోతున్నానన్న ఆనందం ఆయన ముఖంలో లేదు.. పైగా నన్ను బయట కూర్చోమని చెప్పి , డాక్టర్ అన్నయ్యతో మాట్లాడి వచ్చాడు. ఏం మాట్లాడావయ్యా, అంటే పెదవి విప్పడు" అంది. "నీ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మాట్లాడి వుంటాడు లేమ్మా." అంది విమల. "అలా మాట్లాడి వుంటే, ముఖం ఎందుకు అలా 'గంటు' గా పెట్టుకుంటాడత్తయ్యా? నేను కన్సీవ్ అవ్వడం ఈయనగారికి ఇష్టం లేదు.."అంది కంప్లైంటు గా. "అవునా?" అంది నోరు నొక్కుకుంటూ విమల. "చాలీ చాలని సంపాదనకు పిల్లలు అవసరమా?" అన్నాడు కోపంగా. "అరే... పెళ్లయి మూడేళ్లయింది. పాతిక వేల జీతం..యాభై వేలు అయింది. ఇంకా ఎంతకాలం వాయిదా వేస్తావురా. నువ్వు ఎదిగి వచ్చావు కాబట్టేగా మాకు ఆదరువు అయ్యావు." అంది. "నా బాధ అది కాదులే" అని లోపల పళ్లు నూరుకున్నాడు పద్మనాభం. కోపంగా లోపలి గదిలోకి వెళ్లాడు. "మీ అబ్బాయి పిసినారి అత్తయ్యా. ఫ్రూట్స్ అయిపోయాయి తీసుకు రావయ్యా..అంటే తీసుకురాడు. నువ్వు తినకు, అమ్మా నాన్నా తింటారులే అంటాడు. నిజానికి మీకు ఉపయాగ పడతాయని నేను ఆ ఫ్రూట్స్ కూడా తాకను. ఈయన గారు నిందలు నా మీద వేస్తుంటాడు. అయినా, ఈ ఒక్క జీతంతో బ్రతకడం ఎందుకత్తయ్యా. బి. టెక్ చేసాను కదా ఏ కంపెనీలో జాయిన్ అయినా, పాతిక వేలు మినిమమ్ శాలరీ వస్తుంది. వేడ్నీళ్లకు చన్నీళ్లలా ఉపయోగపడుతుంది కదా.." అంది. "వదిలేసెయ్యమ్మా. వాడి కిష్టం లేదు కదా? ఇదిగో చూస్తుండగానే నా మనవడు వస్తాడు. వాడ్ని చూసుకోవడానికే, నీకు సమయం సరిపోతుంది. పిల్లల ఆలనా పాలన కోసమే మీమావయ్య నన్ను జాబ్ చేయనివ్వలేదు. నేను ఎస్. ఎస్. ఎల్. సి చేశాను కదా. పైగా టైపింగ్ షార్ట్ హ్యాండ్ కూడా వచ్చు" అంటూ వుంటే. "మీరు కూడా జాబ్ చేసి వుంటే బాగుండేది అత్తయ్యా. కాస్త మనీ ఫ్లో

వుంటే ఇలా ప్రతి దానికి బడ్జెట్ చూసుకొనే శ్రమ తగ్గేది. మీ పొదుపు చర్యలే, ఆయన మీద తీవ్ర ప్రభావం చూపి, ప్రతి దానికి బడ్జెట్ చూసు కుంటూ వుంటాడు. సినిమా కెళ్దా మంటే. "ఎందుకు వారం కల్లా టి. వి. లో వస్తుందంటారు. ఎక్కడికైనా విహార యాత్రకి వెళ్దామంటే, టీవీ లో చూసుకో విహార స్థలాలు అంటాడు. ఆద్యాత్మిక కేంద్రాలకు వెళ్దాం అంటే, టెంపుల్స్ కి వెళ్దాం. ప్రశాంతతో పాటు ఆహ్లాదంగా వుంటుందంటాడు. పైగా మనింటి చుట్టూనే నాలుగు టెంపుల్స్ వుంటాయంటారు. నా సంగతి సరే..ఆయన్నైనా నాలుగు జీన్స్ కొనవయ్యా అంటే, అన్నీ ఒకేలాగా వుంటాయి..ఇంక కొనడమెందుకో అని, రెండు పాంట్స్ నే రెండేళ్లనుండి లాగిస్తున్నారు. సిగ్గు విడిచి మీకు ఒక విషయం చెప్పనా . ఒక రాత్రి 'ఒక్కసారి" కలిస్తే చాలు అని ఆ విషయంలో కూడా పొదువు చేస్తారు." అని కాస్త సిగ్గుపడుతూనే చెప్పింది కావేరి. "కండోమ్స్ కాస్ట్ తక్కువేం కాదంటాడు." సిగ్గుపడుతూనే చెప్పింది కావేరి. విమల కూడా, కోడలు చెప్పింది విని సిగ్గు పడింది. కావేరికి పద్మనాభంతో జరిగిన ఫస్ట్ నైట్ గుర్తొచ్చింది. ఎన్నో మధురోహలతో పడక గదిలోకి అడుగు పెట్టింది. తాను వెళ్లేసరికి లాప్ టాప్‌లో ఏదో టాలీ చేస్తున్నాడు. తనని తలెత్తి చూసి "కూర్చో కావేరీ.." అన్నాడు.కాస్త సిగ్గుపడుతూ మంచపైన ఒక పక్కగా ఒదిగి కూర్చుంది. అరగంట గడిచినా , తనవైపు కళ్లెత్తి కూడా చూడలేదు. "ఏంటండీ , అంత సేపు లెక్క కడుతున్నారు?"అడిగింది. "వెయ్యి రూపాయలు ట్యాలీ కావడం లేదు కావేరి. పెళ్లికి పెట్టిన ఖర్చులో వెయ్యి రూపాయలు ట్యాలీ కావడం లేదు " అన్నాడు లాప్ టాప్ నుంచి తల మరల్చకుండానే. ఒళ్లు మండింది కావేరికి. "పెళ్లాన్ని పక్కన పెట్టుకొని వెయ్యి రూపాయల కోసం కుస్తీ పడుతున్నాడేంటి మహానుభావుడు" అనుకుంది. "ఎవరికో ఇచ్చి వుంటారు లెండి" అంది అసహనంగా. "అదే కదా తేలడం లేదు." అన్నాడు గొణుగుతూ. "అరేయ్ మగడా, ఆ వెయ్యి రూపాయలు నేను ఇస్తాలేరా" అని అరవాలనుకుంది. కోపం లోపల దిగమింగి "పాలు చల్లారిపోతున్నాయ్" అంది. "పాలు నాకు పెద్దగా ఇష్టం వుండదు. అదొక ఖర్చు దండగ. ఈరోజు నువ్వు తాగేసెయ్.." అన్నాడు. ఒళ్లు మండుకొచ్చింది. "మీరు సగం తాగి ఇవ్వండి" అంది. "ఈ పాలిచ్చే ఫార్మాలిటి ఎవరు ఎందుకు కనిపెట్టారో కానీ, ఫస్ట్ నైట్‌లో పాలివ్వాలని రూలు ఏమన్నావుందా? సిల్లీ . ఒక రాత్రి పాలు తాగగానే స్ట్రెంస్త్ వస్తుందా. సహజ సిద్ధం గానే లోపల 'విషయం' వుండాలి కాని " అన్నాడు, మళ్లీ లాప్ టాప్ లోకి తల దూరుస్తూ,..కాసేపు చూసి "నాకు నిద్ర వస్తుంది" అంది కావేరి. "నువ్వు పడుకో కావేరీ... పెళ్లి ఖర్చుల లెక్కలు చూసి నేనూ పడుకుంటా" అన్నాడు. "ఫస్ట్ నైట్ ముహూర్తం చూసి పెట్టారు కదా "అని ఏదో కావేరీ చెప్పేలోపు "మొదటి రాత్రే భార్యా భర్తలు కలవాలని ఎవరు చెప్పారు? ముందు ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. పరస్పరం గౌరవం పెంచుకోవాలి. అందులోంచి ఎమోషన్ జనరేట్ అయితే, అదే మంచి కలయికగా మారుతుంది" అన్నాడు. "ఫర్వాలేదు మా ఆయన బాగానే 'థింక్' చేస్తున్నాడు అనుకుంది. కాస్త ఒత్తి గిలి పడుకుంది. తెల్ల వారు జామున ఒంటి మీద ఏదో బరువు పడిందని పిస్తే మెలకువ వచ్చింది. పద్మనాభం బలమైన కాలు ఆమె నడుం మీద పడింది. పసి పిల్లాడిలా కావేరిని దగ్గరకు తీసుకొని పడుకున్నాడు. కావేరి ఒంట్లో, సెగలు పొగలు కమ్ముకోవడం మొదలైంది. స్నేహితురాలి మాటలు గుర్తొచ్చాయ్.. "మీ ఆయన రసికుడనుకో.. తెల్లవారిందాకా నిద్ర పోనివ్వడు." చొరవ చేసి, కావేరి కూడా అతనికి దగ్గరగా జరిగింది. ఆమె యద అతని యదని మెత్తగా హత్తుకుంది. తెల్లవారు జామున మత్తుగా కళ్లు తెరిచాడు. తనని బిగించి పట్టుకున్న భార్యని చూసి, మత్తుగా మళ్లీ హత్తు కున్నాడు. చప్పున ఆమె పెదవులను అందుకు న్నాడు.కావేరి కూడా మత్తుగా మూలుగుతూ తనకి సహకరించడం మొదలు పెట్టింది. అతడిలో వేడి పరా కాష్టకు చేరింది. ఇంక అతడు తనలో ఐక్యమవుతానిపించినప్పుడు దిగ్గున పైకి లేచాడు. "ఏమయింది?" అన్నట్టు మత్తు కళ్లతోనే చూసింది. కాస్త దగ్గరగా వున్న అలమారలో చెయ్యి పెట్టాడు. ఎప్పుడు తీసుకొచ్చి పెట్టుకున్నాడో తెలీదు కానీ అవి కామ సూత్ర పాకెట్స్. "ఎందుకివి?" గొణిగింది. "ఒక్కసారికి కూడా కన్సీవ్

అయ్యే ప్రమాదం వుందని 'సమరం' గారు అనేక సార్లు చెప్పారు కదా" అన్నాడు. "కన్సీవ్ అయితే తప్పేముంది. ఎంచక్కా కంటాను." అంది అమాయకంగా. "పిచ్చి మొద్దూ.... అప్పుడే మనకి పిల్లలెందుకు?" అన్నాడు. "లైఫ్ ఎంజాయ్ చేయాలని మీ ఆశ కదూ.." అంది నవ్వుతూ. "అదేం కాదు..వెంటనే పిల్లలు పుడితే వాడికోసం ఖర్చు చేయడానికి సరిపడా డబ్బులు కావాలి కదా. చూస్తుండగానే ఎల్. కే. జీ కి వస్తాడు. లక్షల్లో డొనేషన్లు వుంటాయి. చెల్లాయి పెళ్లికి చేసిన అప్పు కూడా ఇంకా పూర్తిగా తీరలేదు. ఈలోపు, జూనియర్ పద్మనాభం భూమి మీదకు వస్తే వాడిని లావిష్‌గా పెంచడం కష్టం "అంటూ ఏదో చెప్పుకు పోతున్నాడు. అలా కండోమ్ కాపురం సాగుతున్నప్పుడే "వీటితో మీకూ నాకూ తృప్తి లేదు. నేను టాబ్లెట్స్ వాడుతాను లెండి" అంది. "అమ్మో, నువ్వు సేఫ్టీ పిల్స్ వాడడం నిర్లక్ష్యం చేస్తే, పిల్లలు పుట్టే ప్రమాదం వుంది." చెప్పాడు. కండోమ్‌తో కాపురం సాగించడం కావేరికి కాస్త అసంతృప్తిగానే వుంది. "మొండి ఘటం" అని తనలో తాను సర్దుకుంది. మూడొచ్చి ఏ అర్ధరాత్రో మళ్లీ పైన చేయి వేసి దగ్గరకు తీసుకుంటే "వద్దులే కావేరి , కండోమ్ వేస్ట్ చేయడమెందుకు?అవి కాస్ట్లీ కండోమ్స్" అని దూరంగా జరిగి పడుకొనే వాడు. ఏం మనిషవయ్యా బాబూ. కండోమ్స్ పొదుపు చేయడం కోసం "మూడ్" పోగొడతావా?" అని తిట్టుకుంటూ పడుకొనేది.ఎలా జరిగిందో తెలీదు కానీ, సంపూర్ణ జాగ్రత్తలు తీసుకున్నా కన్సీవ్ అయింది కావేరి.

**********

ఇక్కడే పద్మనాభం అనుమానం మొదలైంది. బాల్య స్నేహితుడు, ఫ్యామిలీ డాక్టర్ సిద్దేశ్వర్‌తో "కావేరి కడుపులో వున్న బిడ్డ నా బిడ్డేనా? ఇప్పుడు డిన్. ఎన్. ఏ పరీక్షలు చేయడానికి వీలువుతుందా?"అడగడంతో అతడు ఫైర్ అయ్యాడు. సిద్దేశ్వర్ నెంబర్ చూసి లిఫ్ట్ చేశాడు పద్మనాభం"ఎందుకు నువ్వు కావేరిని అనుమానిస్తున్నావ్?" అడిగాడు. "అది కాదురా సిద్దూ. గత మూడేళ్లుగా సేఫ్టీమెథడ్స్ పాటిస్తూనే వున్నాం. తను ఎలా కన్సీవ్ అయ్యింది". అడిగాడు ఆరాగా."నీ ప్రశ్నకు నేను జవాబు చెప్పలేనురా ఫూల్, బట్ కావేరి బంగారం." అన్నాడు. "అదే నా బంగారాన్ని ఎవరైనా పాడు చేశారా? అన్నదే నా డౌట్.." అన్నాడు లోగొంతుకతో. "పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. కళ్లు పోతాయ్.." అన్నాడు. "ఈ పాపం చూస్తూ బ్రతకడం కంటే కళ్లు పోతేనే బెటర్ కదా" అన్నాడు. "నువ్వు చెత్త డౌట్స్ ఆపు" అన్నాడు. "ఏదైనా మన దాకా వస్తేనే తెలుస్తుందిరా" అన్నాడు. "ఎవరైనా తన భార్యని నమ్మాలి, అది రూల్" అన్నాడు సిద్దేశ్వర్. "ప్రతి భార్యా. తన భర్తకే పిల్లల్ని కనాలి. ఇది కూడా రూలే.." అన్నాడు కోపంగా. "ఏడ్చావులే. కావేరి ఫోన్ చేసింది. ఎందుకు అన్నయ్యగారూ. ఆయన ముభావంగా వుంటున్నారు?" అని అడిగింది. ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు.నీ కడుపులో బిడ్డ అతడి 'అంశే' అని నిర్ధారించడానికి డి. ఎన్. ఏ పరీక్షలు జరుపమన్నాడమ్మా అంటే కావేరి "చెప్పెత్తి కొట్టి , పుట్టింటికి వెళ్లిపోతుంది. తను చాలా సెల్ఫ్ రెస్పెక్ట్ , గొప్ప క్యారెక్టర్ వున్న అమ్మాయి. ఈ విషయం ఎప్పుడు నిర్ధారణ అయ్యిందంటే ఒక సారి మీ అమ్మగారిని తీసుకొని హాస్పిటల్‌కి వచ్చింది. అప్పుడే మా బంధువుల కుర్రోడు అనుదీప్, నన్ను కలవడానికి హాస్పిటల్ కి వచ్చాడు. అతడ్ని నా గదిలో పెట్టుకొనే ఓ. పి చూస్తున్న కావేరిని చూసి నవ్వి "బాగున్నావా కావేరీ.." అని అడిగాడు. కావేరి నవ్వి, నేను బాగానే వున్నాను.మా అత్తగారికి కాస్త నలతగా వుంటే హాస్పిటల్‌కి వచ్చాం" అంది. వాళ్లు వెళ్లిపోయాక అనుదీప్ "కావేరి మా కాలేజీ బ్యూటీ అన్నయ్యా. తనని అప్పట్లో ప్రపోజ్ చేసా. బ్లంట్‌గా రిజక్ట్ చేసింది. నాలాగే చాలా మంది ఆ అమ్మాయి ప్రేమ కోసం వెంపర్లాడే వాళ్లు. తను ఎవరి వల్లో నూ పడ లేదు అన్నాడు. ఆ విధంగా తన గురించి పూర్తిగా తెలుసు". చెప్పడం ఆపాడు డాక్టర్ సిద్దేశ్వర్. పద్మనాభం అనుమానం తో ఇంకాస్త భయపడి, "మీ బంధువుల అబ్బాయ్ ఆ అనుదీప్ మళ్లీ మా కావేరిని కలిసాడా?" అడిగాడు. "అరే..నీ బ్రెయిన్ వాషింగ్ మిషన్ లో వెయ్యా.. మళ్లీ కావేరి మరోసారి మా హాస్పిటల్‌కి రాఖీ కట్టడానికి వచ్చింది. ఈ సారి మీనాన్న గారు తనకి

తోడుగా వచ్చారు. నాకు రాఖీ కట్టింది. అప్పుడు నాకు ఎదురుగా వున్న అనుదీప్‌కి కూడా రాఖీ కట్టింది. ఇప్పుడు వాడు మా హాస్పిటల్‌కి పార్ట్నర్ కూడా."ఈ జన్మలో మీరు మా అన్నయ్యే" అనడం నా చెవుల్లో నేను విన్నాను. కాబట్టి ఇందు మూలంగా తెలియ చేయడం ఏమనగా, పిచ్చి పిచ్చిగా అనుమానాలు పడడం ఆపేసి. హ్యాపీగా తండ్రివి కా. ఇక నీ బడ్జెట్ వ్యవహారం నాకు తెలుసు కాబట్టి , పిల్లాడికి ఏడాది వచ్చాక తనని జాబ్‌లో జాయిన్ చేయించు. ఆర్థిక సమస్యలు కూడా వుండవు " చెప్పాడు డాక్టర్ సిద్దేశ్వర్.

****

సడన్‌గా వచ్చిన కూతుర్ని చూసి కావేరి తల్లి అమ్మణమ్మ, ఆమె తండ్రి ఆశ్చర్యపోయారు. కావేరితో ఆమె మావయ్య జగదీశ్వర్ వచ్చాడు. కూతుర్ని కాన్పుకి తెచ్చారని అనుకున్నారు. "కబురు చేస్తే మేమే వచ్చి తెచ్చుకొనే వాళ్లం కదా అన్నయ్యగారూ.." అంది అమ్మణమ్మ . మొహమాటంగా నవ్వాడు జగదీశ్వర్. అదే రోజు తిరుగు ప్రయాణం అయ్యాడు ఆయన. నాలుగు నెలలు గిర్రున తిరిగింది. కావేరి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈ నాలుగు నెలల్లోనూ పద్మనాభం రాలేదు. "మా అత్తింటికీ, మా ఆయనకీ నాకు బిడ్డ పుట్టిన విషయం చెప్పకు నాన్నా." అంది కావేరి. ఆశ్చర్యంగా చూశారు అమ్మణమ్మ దంపతులు. "ఎందుకు తల్లీ..?" అడిగాడు ఆయన "ఆయనతో నాకు ఇక సంబంధం లేదు నాన్నా. పిల్లాడు కాస్త ఎదిగాక జాబ్ చూసుకుంటాను" అంది. "ఏం మాటలమ్మా అవి.అసలు ఏమయింది?" అడిగింది అమ్మణమ్మ. "నన్నేం అడగొద్దమ్మా.." అంది కావేరి. "పిల్ల బాధపడుతుంటే, ఎందుకే ఇంటరాగేషను? అయినా అది అనాథ కాదు.. దాన్ని బ్రతికించలేని స్థితిలో దాని నాన్న లేడు.." అన్నాడు కావేరి తండ్రి "విషయం ఏంటో తెలుసుకోకుండా ఆ బరోసా ఏంటండీ. నాకు మాత్రం బిడ్డకాదా?" అంది అమ్మణమ్మ. ఆరోజు రాత్రి జరిగిన సంభాషణ గుర్తొచ్చింది కావేరికి. "నేను కన్సీవ్ అయినందుకు మీరు ఆనందపడుతున్నారా? బడ్జెట్ లేదని పిల్లలు ఎందుకని అనుకుంటున్నారా? ఒక వేళ అదే మీ ప్రాబ్లమ్ అయితే, డాడీకి పెన్షన్ వస్తుంది.అది ప్రతి నెలా మనకిస్తాడు. వర్రీ కాకండి.." అంది.నాకు అభ్యంతరం అదొక్కటే కాదు.." అన్నాడు. "మరి..?" అడిగింది."అసలు నీ కడుపులో బిడ్డకు కారణం నేనేనా?" అడిగాడు. ప్రక్కనిమిషం పద్మనాభం చెంప చెళ్లుమంది."ఆడది భర్త పిసినారి తనం అయినా భరిస్తుంది , కానీ అనుమానం భరించలేదు.నేను సీతమ్మ కాలం నాటి దాన్ని కాదు." అంది. "మరి రోజు నేను కండోమ్ వాడుతున్నా. మరి ఎలా కన్సీవ్ అయ్యావ్?" అడిగాడు కోపంగా. "దానికి సమాధానం చెప్పాల్సింది నేను కాదు, డాక్టర్." అంది."అదే అడిగాను..వాడు నిన్ను 'నిప్పు' అని చెప్పి డి. ఎన్. ఏ టెస్ట్ చేయడానికి నిరాకరించాడు." అన్నాడు. "మీ స్నేహితుడికి నామీద ఉన్న నమ్మకం, నా భర్తగా మీకు లేదు. అందుకే ఇక మీతో నాకు ఏ సంబంధం లేదు" అని రాత్రికి రాత్రే బయలుదేరి పుట్టింటికి బయలు దేరింది. "నాన్నా తను పుట్టింటికి వెళ్తానంటుంది. దించేసి రా నాన్నా." చెప్పాడు పద్మనాభం.

****

కాలం పాతికేళ్లు గిర్రున తిరిగింది. ఐ .ఐ .టి లో టాపర్ గా వచ్చిన ఒక యువకుడు తన కంపెనీకి సి. ఇ. ఓ అవుతున్నాడని తెలిసి బొకే పట్టుకొని ఎదురు చూస్తున్నాడు పద్మనాభం. ఇప్పుడు కంపెనీ మేనేజర్ . హెచ్. ఆర్ బాధ్యతలు కూడా పద్మనాభమే చూస్తున్నాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు అడుగు పెట్టాడు కొత్త సి. ఇ. ఓ కౌశిక్. అతడ్ని చూసి ఉలిక్కి పడ్డాడు పద్మనాభం. పాతికేళ్ల క్రితం తను ఎలా గున్నాడో ఇప్పుడా కుర్రాడు అలాగే వున్నాడు. పద్మనాభం తనని తాను పరిచయం చేసుకున్నాడు. ఆఫీసులో ఇతర స్టాఫ్ కూడా ముక్కున వేలేసు కున్నారు. మనిషిని పోలిన మనుషులు వుంటారంటే ఇదేనేమో. కౌశిక్ కూడా పద్మనాభంని చూసి "మీకు నా ఫీచర్స్ వున్నాయో, మీ ఫీచర్స్ నాలో వున్నాయో అర్థం కావడం లేదు. బట్ ఇట్స్ క్రేజీ" అన్నాడు . ప్రక్కరోజు సాయంత్రం నాలుగు గంటలకి రివ్యూ జరిగింది. మీటింగ్ నుద్దేశించి కౌశిక్..ఇలా మాట్లాడాడు. "చూడండి పద్మనాభం గారూ..మన ఆఫీసులో

సగం మంది స్టాఫ్‌ని మీరు సాగనంపవచ్చు. లేదా అందరికీ సమాన వేతానాలు ఇచ్చి పని చేయించుకోవచ్చు. ఆలోచించి నిర్ణయం తీసుకోండి." చెప్పాడు. కొత్తగా వచ్చిన సి. ఇ. ఓ.ని తిట్టుకోవడం మొదలు పెట్టారు. "సి. ఇ. ఓ. గారు చెప్పింది నిజమే. సీనియారిటీ పేరుతో ఎక్కువ మంది శాలరీలు తీసుకుంటున్నారు. పనిలో వేగం మాత్రం లేదు. ఎక్కువ శాలరీ వున్న వాళ్లని సాగనంపాలా లేదా శాలరీ తగ్గించుకొని పని చేస్తారో డిసైడ్ చేసుకోండి" అన్నాడు పద్మనాభం. రూపం లోనే కాదు యాటిట్యూడ్‌లో కూడా పద్మనాభంకి డిటోలా వున్నాదని వాపోయారు.అందరూ, ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు. అసలే కోవిడ్ సమయం. ఇంకొక కంపెనీలోకి వెళితే, ఈ మాత్రం శాలరీ కూడా వస్తుందన్న నమ్మకం లేదు. దాంతో అందరూ అంగీకరించారు. ఫైల్ రడీ చేసుకొని, సి. ఇ. ఓ ముందు నిల్చొన్నాడు పద్మనాభం. ఫైల్ మొత్తం చూసి "గుడ్ చక్కగా ఒప్పించారు. తద్వారా కంపెనీకి మేలు చేశారు." అన్నాడు కౌశక్. నవ్వుతూ చూశాడు పద్మనాభం. "బట్, ఈ ఆపరేషన్ సక్సెస్ ఫుల్ గా చేసినందుకు మీకు ఒక ఇంక్రిమెంట్ ఇస్తున్నాను " అన్నాడు కౌశిక్. "థాంక్యూ సర్.." అన్నాడు పద్మనాభం. "బైదిబై , మిమ్మల్ని బడ్జెట్ పద్మనాభం అని కూడా అంటారట కదా..." అన్నాడు కౌశిక్. "ఎవరు చెప్పారు మీకు.?" అడిగాడు పొడిపొడిగా. "నిన్న, మీరు నన్ను రిసీవ్ చేసుకున్న ఫోటోలు, మమ్మీకి పెట్టా... సాయంత్రం ఇంటికెళ్ళాక బడ్జెట్ పద్మనాభం మీ కంపెనీ హెచ్. ఆరా..అని అడిగింది. మా అమ్మ మీకు తెలుసా?" అడిగాడు కౌశిక్."మీ అమ్మగారి పేరు.." అడిగాడు పద్మనాభం. కావేరి నటరాజ్.. నటరాజ్ మా తాతయ్యగారి పేరు.." చెప్పాడు కౌశిక్. బడ్జెట్ పద్మనాభం మొఖం పాలిపోయింది. "ఒక్కోసారి కండోమ్స్ కూడా ఫెయిల్ అవుతాయిరా..తనని అనుమానించకు.." అన్న డాక్టర్ మిత్రుడి మాటలు అతడి చెవుల్లో ప్రతి ధ్వనించాయి. "ఒక్కోసారి కండోమ్స్ కూడా ఫెయిల్ అవుతాయిరా. తనని అనుమానించకు." అన్న డాక్టర్ మిత్రుడి మాటలు పద్మనాభం చెవుల్లో ప్రతి ధ్వనించాయి. కౌశిక్ తన కొడుకే అని అర్థమైంది. ప్రక్కరోజు అతడు వచ్చేసరికి , అతడి టేబిల్ పై ఉద్వాసన లేఖ వుంది. సీ. ఈ. ఓ. చాంబర్ లోకి వెళ్ళాడు. అతడి చేతుల్లో లేఖ చూసి "మీకు ఇచ్చే శాలరీతో ఇద్దరికి జాబ్స్ ఇవ్వొచ్చు.."అన్నాదు కౌశిక్. పద్మనాభం గొంతు తదారిపోయింది. లేచి ముందుకొస్తూ "అమ్మా..మీరు ఎందుకు విడిపోయారో నాకు తెలీదు.. మీ శేష జీవితం అమ్మతో ప్రశాంతంగా గడిపేయండి.."అన్నాదు. "మీ అమ్మ నన్ను క్షమిస్తుందా?" అడిగాడు పద్మనాభం. "మీరు ఏం తప్పు చేశారో నాకు తెలియదు. మీ వెడ్డింగ్ కార్డ్ ఒకటి అమ్మ భద్రంగానే దాచుకొనే వుంది. మీ పెళ్ళి పోటోలు కూడా చూశాను. మిమ్మల్ని నా క్రింద ఉద్యోగిగా చూడలేను నాన్నా." అన్నాదు కౌశిక్.

పద్మనాభం కళ్ళనిండా నీళ్ళు.

*******

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి



# యుద్ధం

జి సాహితి (ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్)

పాలస్తీనా దేశంలో గాజా పట్టణంలోని ఒక కాలనీ అది. తెల్లవారి అప్పుడే మూడు గంటల సమయం అయింది. అంతా శ్మశాన నిశ్శబ్దంలా ఉంది. పక్క మీద నుంచి లేవకుండానే ` కిటికీలోంచి ఆకాశం వైపు తేరిపారా చూసింది ఆసిన్. అంతా ప్రశాంతంగా ఉంది. చెవులు రిక్కించి వింది. ఎక్కడా విమానాల రొద వినపడ లేదు.

తమ్ముడు ఇంకా నిద్ర పోతూనే ఉన్నాడు. అమ్మ వంటింట్లో ఉన్నట్టుంది. తను మంచం మీద నుంచి లేచింది. ఒక్కసారి తలుపు తీసుకొని బయటికి రావాలనిపించింది. డాబా మీదకు వెళ్లి వీధంతా చూడాలనిపించింది. కానీ, అమ్మ ఒప్పుకుంటుందా? హాల్లోకి వెళ్లి చూసింది. బయటి తలుపునకు లోపలి నుంచి తాళం వేసి ఉంది. తామెవరం పొరపాటున కూడా బయటికి వెళ్లకుండా, బయటి నుంచి ఎవరూ లోపలికి రాకుండా.

యుద్ధం మొదలైన రోజు నుంచి ఏ చిన్న శబ్దం విన్నా భయపడాల్సి వస్తోంది. వీధిలో మనుషుల అడుగుల చప్పుడు విన్నా అమ్మ ఆతురతగా వచ్చి, తననూ, తమ్ముడిని తన చేతులతో దగ్గరకు లాక్కొంటుంది. గట్టిగా పొదివి పట్టుకొంటుంది. ఇంట్లో ఎవరూ లేనట్టే ఉండాలీ అంటుంది.

మొదట్లో ఒకరోజు అమ్మని అడిగింది, అసిన్.

"ఎందుకమ్మా… ఇలా జరుగుతోంది? అసలు ఏమైంది." అని.

"ఏమో! యుద్ధమంట యుద్ధం." అంది అమ్మ.

"ఎందుకు యుద్ధం? ఎవరెవరికి యుద్ధం?"

ప్రశ్నల మీద ప్రశ్నలు మనసులోంచి దూసుకు వస్తున్నాయి.

నిశ్శబ్దంగా ఉండు అన్నట్టు నోటికి చూపుడు వేలితో తాళం వేసి, సైగ చేసింది. ఆసిన్ కూడా నోటి మీద వేలు పెట్టుకొని, తమ్ముడి వైపు చూసింది. వాడికేం తెలుసు పాపం! బాగా చిన్నోడు. మూడేళ్ల వయసు. ఆసిన్‌కి కొంచెం కొంచెం తెలుసు. ఎందుకంటే తన వయసు ఆరేళ్లు కాబట్టి` తమ్ముడికన్నా కొంచెం ఎక్కువ తెలుసు.

అమ్మ ఎందుకంతగా భయపడిపోతుందో పూర్తిగా తెలియదు. అందుకనే అమ్మ తనకు స్నానం చేయిస్తున్నప్పుడు, వంట చేస్తున్నప్పుడు, అన్నం తినిపిస్తున్నప్పుడు, పడుకొని నిద్ర పుచ్చుతున్నప్పుడూ అడుగుతూనే ఉంటుంది.

"అమ్మా, ఇలా ఎందుకు? యుద్ధం ఎందుకు?"

"ష్ .. మాట్లాడకు." అంటుంది అమ్మ.

చాలాసార్లు నెమ్మదిగా చెబుతుంది. కొన్నిసార్లు గట్టిగా చెబుతుంది. ఒక్కోసారి గద్దిస్తున్నట్టు కోపంగా చెబుతుంది. ఆకాశంలో విమానం చప్పుడు వినబడ్డప్పుడు అమ్మ చాలా భయపడుతుంది. ఆ సమయంలో వాష్‌రూంలో ఉన్నా, వంటింట్లో ఉన్నా ఉన్నఫళాన తమ దగ్గరకు వచ్చేస్తుంది. ఇద్దరికి గట్టిగా పొదివి పట్టుకొంటుంది.

"అమ్మా .. ఏమైంది?" అని నెమ్మదిగా గొంతు తగ్గించి అడుగుతుంది ఆసిన్. అమ్మ "ష్ .." అని నోటికి తాళం వేస్తుంది. తమ్ముడికి ఏమీ అర్థం కాదు. ఒక్కోసారి "బూచాళ్లా?" అంటాడు. అప్పుడు తాను "ష్ .." అని సైగ చేసి, తమ్ముడి నోటికి చేయి అడ్డం పెడుతుంది.

ఒక్కోసారి వీధిలో ఎవరో గుంపులు గుంపులుగా వెళుతున్నట్టు అనిపిస్తుంది. దగ్గర్లోనే బాంబు పడినట్టు పెద్ద శబ్దం వినిపిస్తుంది. అలాంటప్పుడు ముగ్గురూ మంచం కిందికి చేరిపోతారు. చెవులు రిక్కించి వింటారు. అప్పుడు ఆసిన్‌కి తన గుండె చప్పుడు తనకే వినిపిస్తుంది.

అలాంటప్పుడు నాన్న దగ్గర ఉంటే బాగుణ్ణు అనిపిస్తుంది. మంచం కింది నుంచి బయటికి వచ్చాక `అడుగుతుంది.

"అమ్మా .. నాన్న ఎప్పుడు వస్తాడు? ఎక్కడ ఉన్నాడు?"

"వస్తాడు .. యుద్ధం ఆగిపోయాక …"

“యుద్ధం ఎప్పుడు ఆగిపోతుంది?”

“ఏమో ...” బాధగా అంటుంది అమ్మ.

వంటింట్లోకి వెళ్ళి, తాను చూడకుండా ఏడుస్తుంది. తాను దగ్గరకు వెళితే అటు తిరిగి కళ్లు తుడుచుకొని, ఇటు తిరిగి నవ్వుతుంది.

—000—

ఆరోజు కాస్త ప్రశాంతంగా ఉంది. పక్కింటి వాళ్లు కిటికీలు తెరిచారు. తరువాత వీధి తలుపు కూడా తెరిచారు. అమ్మ వంటింటి తలుపు తెరిచి, పక్కింటి ఆంటీతో మాట్లాడిరది. యుద్ధానికి నాలుగు రోజులు సెలవులంట! ఆంటీకి వాళ్ల బంధువులు ఎవరో చెప్పారంట.

ఆసిన్‌కి సంతోషం వేసింది. కిటికీ లోంచి మళ్లీ ఆకాశం వైపు చూసింది. వీధిలోకి చూసింది. వీధిలో అలికిడి మొదలైంది. గుంపులు తిరుగుతున్న శబ్దం కాదు మనుషులు నడుస్తున్న సందడి. ఆసిన్ అమ్మని గట్టిగా హత్తుకొంది. తమ్ముడిని ప్రేమగా ఎత్తుకొంది.

“అమ్మా .. తాళం తీస్తావా? తమ్ముడూ, నేను డాబా మీదికి వెళ్లి రావొచ్చా?”

అమ్మ కాసేపు ఆలోచించింది. తరువాత తాళం చూసింది. చాలా రోజుల తరువాత ఇంటి నుంచి విడుదల. చాలా ఆనందంగా ఇంటి మీదికి పరుగులు తీసింది ఆసిన్. అమ్మ తమ్ముడిని తీసుకొని పైకి వచ్చే లోగా మూడుసార్లు ఇటూ అటూ తిరిగింది. వీధిలో వెళుతున్న మనుషులను చూసి, కేరింతలు కొట్టింది. చేతులు ఊపుతూ పలకరించింది.

అమ్మ ముఖంలో అంత సంతోషం లేదు.

నాన్న ఇంకా రాలేదని కాబోలు!

“అమ్మా ... యుద్ధం ఆగింది కదా! ఈరోజు నాన్న వచ్చేస్తాడు కదా?” ఆశగా అడిగింది.

అమ్మ ఏదో గుర్తొచ్చినదానిలా కదిలింది.

“నేను పక్క వీధి అక్తర్ అంకుల్ వాళ్లింటికి వెళ్ళొస్తాను. పదండి కిందికి. మీరు ఇంట్లోనే ఉండండి. తాళం వేసి, వెళతాను.” అంది.

అక్తర్ అంకుల్ ఆసిన్‌కి బాగా తెలుసు. ఆయనా, వాళ్ల నాన్న ఒకే ఆఫీసులో పనిచేస్తారు. బహుశా నాన్న ఎప్పుడు వస్తాడో తెలుసుకోవటానికి ఆ ఇంటికి అమ్మ వెళుతుందని అర్థమైంది. అక్తర్ వాళ్ల పాప ఆఫ్రిన్. ఆసిన్‌కి ఫ్రెండు. ఇద్దరూ ఒకే స్కూలు, ఒకే క్లాసు. యుద్ధం లేనప్పుడు ఇద్దరూ కలిసి చక్కా ఆడుకునేవారు. ఒకరింటికి ఒకరు వచ్చేవారు. వెళ్లేవారు.

“నేనూ వస్తాను.” అంది ఆసిన్.

కాసేపు తటపటాయించింది అమ్మ. ఆకాశం వైపు చూసింది. ఏ శబ్దం చేయకుండా గద్దల్లాగ విమానాలు వస్తాయేమో అన్న భయం కాబోలు!

తరువాత ఇంటికి తాళం వేసి, వీధిలోకి అడుగు పెట్టింది, పిల్లలిద్దరినీ తీసుకొని. అమ్మ చేయి పట్టుకొని వీధిలో నడుస్తుంటే` ఆసిన్‌కి చాలా సంతోషం కలిగింది. తమ్ముడికి కూడా బాగున్నట్టుంది, తనని చూసి నవ్వుతున్నాడు. పక్కవీధిలో చివరి ఇల్లు అక్తర్ అంకుల్ వాళ్లది. ఆ ఇంట్లో ఆఫ్రిన్ ఉంటుంది. తనను చూడొచ్చు. మాట్లాడొచ్చు. కాసేపు ఆడుకోవొచ్చు అనుకొంది ఆసిన్.

తమ వీధి దాటి పక్క వీధిలోకి అడుగుపెట్టారు. అమ్మ తమ్ముడిని ఎత్తుకొని, తన చేయి గట్టిగా పట్టుకొని నడుస్తోంది. ఆఫ్రిన్‌ని కలవ్వొచ్చనే ఆనందంతో వేగంగా అడుగులు వేస్తోంది ఆసిన్. అమ్మను దారిలో చాలామంది పలకరిస్తున్నారు. ఏదేదో మాట్లాడుతున్నారు. నాన్న గురించి అడుగుతున్నారు. అమ్మ ఏదో చెబుతోంది.

ఈలోగా అక్తర్ అంకుల్ వాళ్లింటి దగ్గరకు వచ్చేశారు. ఆఫ్రిన్‌ని చూస్తానని ఆసిన్‌కి హుషారుగా ఉంది. చూస్తే అక్కడ ఇల్లు లేదు. ఉంది కానీ, ఇంతక ముందులా లేదు. ఇల్లు ఇల్లులాగా లేదు. అమ్మకు ఆ ఇరుగు పొరుగు వాళ్లు చెబుతున్నారు... యుద్ధం మొదలైన రెండోరోజు మధ్యాహ్నం వేళ ... ఆ ఇంటికి దగ్గర్లోని ఖాళీస్థలంలో బాంబు పడిరది అట! ఆ ధాటికి ఇల్లు ముందు భాగం కూలిపోయింది.

"మరి ఆ ఇంట్లో వాళ్లు?"

"అక్తర్ ఆఫీసు నుంచి రాలేదని జరీనా రెండోరోజు ఉదయమే ఆఫీసుకు వెళ్లిందట. చూసినవాళ్లు చెప్పారు. పిల్ల కూడా తన వెంట ఉందో లేదో తెలియదు.." ఎవరో ఒకతను అమ్మకు చెబుతున్నాడు.

ఆసిన్ తల్లి చేతిని వదలించుకొని, కూలిపోయిన ఆ ఇంటిలోపలికి పరుగు తీసింది. ఆ శిథిలాల మధ్యలోంచి ఇంటి వెనక వైపు వెళ్లింది. గది భాగం కూలిపోకుండా ఉంది. కిటికీ తెరచి కనిపించింది. అక్కడికి వెళ్లి లోపలికి చూస్తూ, "అఫ్రిన్ ... అఫ్రిన్ ..." అని పిలుస్తోంది. పిలుస్తూ గది నలుమూలలూ కళ్లతో వెదికింది. ఒకపక్కన అఫ్రిన్ కనిపించింది.

"అఫ్రిన్ .. అఫ్రిన్ ..." గట్టి గట్టిగా పిలిచింది.

ఆ పిలుపునకు అఫ్రిన్ నెమ్మదిగా కదిలింది.

"అమ్మా ... అమ్మా ... అఫ్రిన్ లోపల ఉంది." గట్టిగా కేకేసి చెప్పింది. అప్పటికే అమ్మ, మరో ముగ్గురు నలుగురు మనుషులూ అక్కడికి చేరుకున్నారు.

అఫ్రిన్ శక్తినంతా కూడదీసుకొని పైకి లేచింది. కిటికీ దగ్గరకు వచ్చింది. తను చాలా నీరసంగా ఉంది. కానీ, ఆసిన్ చూడగానే బలం వచ్చినట్టయింది. కిటికీలోంచి చేతులు చాచి, ఆసిన్‌ని తాకింది. బాంబు ధాటికి ఇల్లు కూలిపోవడంతో అఫ్రిన్ తీవ్ర భయాందోళనలకు గురైంది. అమ్మ ఎంతసేపటికీ తిరిగి రాలేదు. కిటికీ తెరిచి, ఎవరైనా మనుషులు కనిపిస్తారని చూస్తూనే ఉంది. ఇంట్లో ఉన్న పదార్థాలను కొన్ని రోజులు తింది. రాత్రుళ్లు తీవ్రమైన భయంతో గడిపింది. ఆ గది బయట తాళం వేసి ఉంది.

ఆసిన్ వాళ్లమ్మ పెద్ద రాయితో దానిని బద్దలు గొట్టింది. తలుపు తెరిచింది. ఆసిన్ పరుగున లోపలికి వెళ్లి నేస్తాన్ని గట్టిగా హత్తుకొంది.

అఫ్రిన్ చాలా నీరసించిపోయింది. ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు చారికలు కట్టాయి. కిటికీలోంచి మనుషులను పిలిచి పిలిచి గొంతు జీరబోయింది. సహాయం కోసం చూసి చూసి కళ్లు కాంతి విహీనమయ్యాయి.

ఇప్పుడు మనుషులను చూడగానే కళ్లు వెలిగాయి. గొంతు పెగిలింది. దుంఖం పొంగుకొచ్చింది. ఆసిన్ వాళ్లమ్మ ప్రేమగా దగ్గరకు తీసుకొంది. తమ వెంట తీసుకొని ఇంటికి బయల్దేరింది.

"ఏమైనా ఇబ్బందులు వస్తాయేమో! వీళ్లు వేరు. మనం వేరు కదా!" సంశయం వెలిబుచ్చాడు ఒకతను.

అమ్మ కోపంగా చూసింది.

"ఎవరు వేరు? అందరం కలిసి మెలిసే బతికాం కదా! అందరం మనుషులమే కదా! అసలు ఈ యుద్ధం ఎందుకొచ్చింది? ఎవరి కోసం జరుగుతోంది? ఈ యుద్ధంతో మనకేమిటి సంబంధం? అసలు ఈ పిల్లలకేమిటి సంబంధం? ఎవరికి దీనివల్ల ప్రయోజనం? మనందరం ఒక్కటే కదా? మనుషులందరం ఒక్కటే కదా? పిల్లలు అందరూ పిల్లలే కదా? అందరి దుంఖం ఒక్కటే కదా? అసలు ఈ యుద్ధం ఎందుకు? ఇలా భయపడుతూ బతకాల్సిన పరిస్థితి ఎందుకు?" అమ్మ గట్టిగా అంటూనే ఉంది.

మిగతా అందరూ అమ్మ మాటలతో ఏకీభవిస్తున్నట్టే ఉన్నారు. అమ్మ అడుగుతున్న ప్రశ్నలు వాళ్ల మనసులోనూ ఉన్నట్టున్నాయి.

"అంటే ` యుద్ధం ఎందుకొచ్చిందో, ఇళ్ల మీద, మనుషుల మీదా బాంబులు ఎందుకు పడుతున్నాయో అమ్మకు కూడా తెలీదన్న మాట ` అనుకొంది ఆసిన్. అమ్మకే కాదు అక్కడున్న ఎవరికీ తెలీదు. మామూలు మనుషులు ఎవరికీ యుద్ధంతో సంబంధం లేదు. యుద్ధాన్ని ఎవరూ కోరుకోవడం లేదు. యుద్ధం వల్ల మనుషులు అందరికీ నష్టమే కాబోలు, కష్టమే కాబోలు... " అనుకొంది ఆసిన్.

ఆసిన్, వాళ్లమ్మ అఫ్రిన్‌ని చెరోపక్కా ప్రేమగా పట్టుకొని తమ ఇంటికి తీసుకొని వెళుతున్నారు. ఏం జరుగుతుందో తెలియని వాళ్ల తమ్ముడు అమ్మ చంకలోనుంచి నవ్వుతున్నాడు ` ఏ స్వార్థమూ అంటని మానవత్వంలాగ!

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# తెలుగుజాతి గొప్పదనం

చొక్కర తాతారావు

ప. తెలుగుజాతి గొప్పదనం తెలుసుకో సోదరా
తేనెలూరు తెలుగుభాష నలు దిశలా చాటరా
నా తెలుగు అమృతం నా తెలుగు అనంతం
అజరామరభాష మన అమ్మ భాష అమేయం

చ. నన్నయ తిక్కన ఎర్రన నడకలు నేర్పిన భాష
అన్నమయ్య త్యాగయ్య పదకవితలల్లిన భాష
విదేశీయులు కొనియాడిన తీయనైన భాష
దేశభాషలందు మిన్న తెలుగు భాష వెన్న
||తెలుగుజాతి||

చ. కందుకూరి గురజాడ తెలుగు వెలుగు జాడలు
వాడుక భాషకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి పంతులు
జాతీయ జెండా సృష్టికర్త పింగళి వెంకయ్య
మహామహులు జన్మించిన తెలుగునేల ధన్యము
||తెలుగుజాతి||

చ. తీరైన లిపి మనది తేటతెలుగు మనది
పద్యం గద్యం అవధానం మన సొంతం
ఏదేశమేగినా ఎక్కడ నువు బతికినా
తెలుగుజాతి ఔన్నత్యం పెంచి పోషించాలి
||తెలుగుజాతి||

చ. పరసంస్కృతి మోజులో మన సంస్కృతి మరవద్దు
కులమతాలకతీతంగ స్నేహబాట వేద్దాము
జై తెలుగుతల్లీ మేమంతా నీబిడ్డలం
నీ తెలుగు బడిలో నిత్యవిద్యార్థులం
||తెలుగుజాతి||

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# తరతరాల సంపద

లక్ష్మి మైథిలి

ఆమె సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం
హిమోన్నత శిఖరం ఆమె కీర్తి కిరీటం
శతాబ్దాల చరితకు సజీవ సాక్ష్యం
విభిన్న సంస్కృతుల కాలవాలమీ ధరిత్రి
సనాతనమీ భారత సంస్కృతి
ఎన్నో కులమతాల కలయికల
సర్వమత సామరస్య సమన్విత
భారతీయుల ఐకమత్యానికి ప్రతీక

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుకున్న నేల
సర్వమానవ సౌభ్రాతృత్వ సమానత్వమే
జన జీవన స్రవంతిలో
చతుష్షష్టి కళల అపూర్వ సమ్మేళనంతో
సంగీత సాహిత్యాల సౌరభాలతో
లలిత కళలు చక్కనైన భూమికలతో
అవని నలుదిశలా వెల్లి విరిసే
శిల్పకళల సోయగాల నెలవైన కల్పవల్లి

అవతార మూర్తుల దైవ లీలలతో
పురాణ, ఇతిహాసాలలో వెలిసిన
మహిమాన్విత చరిత
అనన్యమైన విజ్ఞానశాస్త్రాలు అందించే
ఋషి పుంగవులకు జన్మభూమి
సద్బోధలు చేసే మహర్షులు
నడయాడిన పవిత్ర తపోభూమి

పలుభాషా సాంస్కృతిక సాహితీ గౌతమి

విశిష్ట ఆధ్యాత్మికదివ్య సందేశాలిచ్చే
ప్రవచన కర్తలతో
భక్తిని ప్రభోదించే వాగ్గేయకారులతో
తాత్వికత, తత్వభోధనలతో
నిత్య సంకీర్తనలతో అలరారే పుణ్యభూమి
ప్రపంచాన్ని శాసించే పురాతన
గ్రంథాలకు జగద్గురువైన జ్ఞానభూమి
పంచభూతాలలో సర్వజీవులు
సకల వృక్ష జాతులు పూజనీయులే

సంస్కారం, సంస్కృతి,సంప్రదాయం
మన జాతి ప్రాచీన గోపురాలు
చందమామ చూపి గోరుముద్దలు పెట్టి..
ఆ చంద్రునిపైనే కాలుపెట్టే ఘనత సాధించిన
స్త్రీజాతి పుట్టిన భూమి భారతి
విదేశీయుల దండయాత్రలు తట్టుకుని
ఎదురొడ్డి నిలిచిన విశ్వవిజేత
వినువీధిని తాకే స్వేచ్ఛా వాయువుల
త్రివర్ణ పతాకం రెపరెపల సవ్వడులతో
వందేమాతరమని పోరాడిన
గొప్ప దేశభక్తులు జన్మించిన భరతభూమి


భరతధాత్రికి పల్లెలే పట్టుకొమ్మలు.
దేశానికి అన్నం పెట్టే దాతలే రైతన్నలు
పవిత్ర నదీమతల్లుల కరుణతో
పంటలందించే బంగారు పుడమి
దట్టమైన అడవులు, కొండలు కోనలతో
పచ్చని శోభలతో కళకళలాడే వనదేవత
గతించిన కాలాన్ని భావి తరాలకు
అందించే వారధి ..మన సంస్కృతి

ఎందరో శాస్త్రవేత్తలకు
సకల శాస్త్రాలు అందించిన దేశం
పరిశోధనలతో ఇస్తోంది సందేశం
ప్రపంచీకరణ విజృంభిస్తున్న
నేటి యుగంలో ఆచార సంప్రదాయాలు మరిచి..
నవనాగరికత మత్తులో కొరవడిన
సంస్కృతి సంప్రదాయాలను..
కరోనా మరోసారి గుర్తు చేసింది
ప్రకృతి పరిరక్షణే మన ధ్యేయం
మన ఉనికి కోసం సంస్కృతిని
ఆరాధిస్తూ స్వాగతిద్దాం
ఓంకారానికి వారసులం
నూతన ఆవిష్కరణలకు కారకులం
భావితరాల సంపదకు పునాది వేద్దాం!

ఇక్కడ click చేసి ఈ రచన పై మీ అభిప్రాయం చెప్పండి

# బహుమతి గ్రహీతలైన రచయితలు

### అప్పరాజు నాగజ్యోతి



కథలలో (అమ్మోరు తల్లి) మొదటి బహుమతి గృహీత

జననః మచిలీ పట్నం, వయస్సు: 51 సం.లు

బెంగళూరు లోని భారత్ సంచార నిగం లో జనరల్ మేనేజర్

రచనా వ్యాసంగం మొదలు పెట్టిన కొన్ని సంవత్సరాలలోనే (2016 నుండి) దాదపు ఒక వంద చిన్న కథలూ ధారావాహిక కథలూ రాశారు. అనేక బహుమతులు గెల్చుకున్నారు.

### రాంభక్త పద్మావతి గారు

సారాంశం అన్న కవితకి రెండవ బహుమతి గ్రహీత

2017 నుండి కవిత్వం రాస్తున్నారు. అప్పుడప్పుడు కథలు, సామాజిక స్పృహ కలిగిన లఘుచిత్రాలకు రివ్యూలు, కవితాసంకలనాలకు రివ్యూలు రాసారు. 2020లో మొదటి కవితాసంపుటి "కొత్తవేకువ", 2021లో మొదటి కథాసంపుటి "కురిసి అలసిన ఆకాశం" వచ్చాయి. ఎన్నో కవితలకు కథలకు పోటీలలో బహుమతులు అందుకున్నారు

సాహిత్యఅకాడమీ వారి ఆన్ లైన్ కవితాపఠనం కార్యక్రమం 2021లో పాల్గొన్నారు

### మహీధర శేషారత్నం గారు



శాంతి కామన అన్న కవితకి మొదటి బహుమతి గ్రహీత.

భాషా ప్రవీణ, తెలుగు ఎమ్. ఎ. బి. యిడి చేసి గుంటూరు జిల్లాపరిషత్ పాఠశాలలలో టీచరుగా పనిచేసి పదవీ విరమణ చేసారు. ప్రస్తుతం సాహిత్య వ్యాసంగమే వారి కాలక్షేపము.

### లక్ష్మి గాయత్రి గారు



కథలలో (అన్నీ నీవనుచు) అన్న కథకి రెండవ బహుమతి గ్రహీత.

1983 నించి చందమామ లో కథలు, సీరియల్స్ రాశారు. తర్వాత ఈ మధ్య కాలం నించి మామూలు కథలు రాస్తున్నాను. ఇప్పటి వరకు రెండు ప్రథమ బహుమతులు, ఆరేడు ప్రోత్సాహక బహుమతులు వచ్చాయి.

### నామని సుజనాదేవి గారు



శిశిరంలో వసంతం కథకి మూడవ బహుమతి గెల్చుకున్న నామని సుజనాదేవి గారు

దాదాపు 250 పైగా కథలు , 225 పైగా కవితలు 4 నవలలు రాశారు. అన్నీ ప్రముఖ మాగజీన్లలో, వెబ్ సైట్ లలో, ఆకాశవాణిలో ప్రచురించబడ్డాయి. కొన్ని ఇతర భాషల లోనికి అనువాదం కూడా జరిగాయి. 2 కవితా సంపుటాలు, 5 కథా సంపుటాలు ఒక నవల అచ్చయ్యాయి -అన్నింటికీ పురస్కారాలు వచ్చాయి. 'కథా కిరీటి ', ' కవి సుధ ', సహస్ర కవిమిత్ర, సాహితీ చక్రవర్తిని బిరుదాంకితులు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణా బుక్ ఆఫ్ రికార్డ్స్, మల్టీ టాలెంటెడ్ విమెన్ గా రికార్డ్ లు.

### డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీ గారు

సంక్రాంతి హేల కవితకి మూడవ బహుమతి గ్రహీత. భారత భాషా భూషణ్, ప్రజ్ఞాశ్రీ , సాహిత్యశ్రీ వేదాంత వక్త బిరుదాంకితులు.



అన్ని సాహితీ ప్రక్రియలలో 45 పుస్తకాలు ప్రచురించారు. వారు తెలుగులో వ్రాసిన గీతామృతం కి నాలుగు భాషల్లో అనువాదం జరిగింది.

ఎన్నో పురస్కారాలు అందుకున్నారు

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

New Jersey, USA



# TFAS WOMEN'S THROWBALL TOURNAMENT



**Tournament Date:**
March 17th 2024, (Sunday)
from 10AM onwards

**Location:**
Sportsplex At Metuchen,
215 Durham Ave,
Metuchen, NJ 08840.

**Cash Prizes** for Winner and Runner-up Teams

**Registration Last Date:**
March 8th, 2024 (Friday)

**Registration Fee:**
$200/Team

**Register at :**
http://tinyurl.com/TFASWomenThrowballTournament

*For more details contact:*

- Ramakrishna Seethala (609-933-3180) • Laxmi Pasumarti (908-644-5619)
- Meena Kuricheti (630-229-5234) • Sudha (848-219-8358)

**TFAS Board of Trustees 2022-24**

Madhu Rachakulla: (201) 312 1305 Venkata Satya Tata: (973) 985 3409 Ravi Annadanam: (917) 355 5503
Srinivas Cheruvu: (732) 447 6686 Anil Veerisetty: (571) 218 8562 Sudha Devulapalli: (732) 331 9313
Jyothi Kamarasu: (609) 578 8606 Naga Mahendar Velishala: (732) 429 6025

digitalaya • +91 9246578478


What you do makes you who you are.
Contact me about a career that can better your financial future while helping others with theirs.
Thevan Theivakumar
Executive Partner
CLF®
Phone: (732) 744-3763
Cell: (732) 319-8758
ntheivakuma@ft.newyorklife.com
New York Life Insurance Company
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837
DIVERSITY JOURNAL
2016 DIVERSITY LEADER
BEST PLACES TO WORK
2017 for LGBT Equality
training TOP 125
To learn more about our awards and recognition visit: www.newyorklife.com
Insure. Prepare. Retire.
Be good at life.
NEW YORK LIFE